
www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
మంగళవారం | 10-9-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 146 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, భాద్రపదమాసం, శుక్లపక్షం; తిథి: సప్తమి రా. 11.12 తదుపరి అష్టమి; నక్షత్రం: అనూరాధ రా. 8.04 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: రా. 1.58-3.39; దుర్ముహూర్తం: ఉ. 8.32-9.21, రా. 10.09-10.55; అమృతఘడియలు: ఉ. 8.48-10.32; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.06; సూర్యాస్తమయం: 6.17 | విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

1,139.85 టీఎంసీల వరద


సాగర్ ద్వారా విడుదలవుతున్న నీరు

- ఈ 3 నెలల్లో శ్రీశైలానికి రికార్డు ప్రవాహం
- స్పిల్‌వే, విద్యుదుత్పత్తితో 858.72 టీఎంసీలు విడుదల
- సాగునీటి ప్రాజెక్టులకు 107.85 టీఎంసీలు
- కొనసాగుతున్న వరద.. ఐదు గేట్లెత్తి దిగువకు విడుదల
- సాగర్ నుంచి 1,37,871 క్యూసెక్కుల ప్రవాహం
- అదంతా ప్రకాశం బ్యారేజీకే 2

బుడమేరు శాంతించింది..



కష్టం.. నష్టం

వచ్చింది.. కొండంత కష్టం! మిగిలింది అపార నష్టం!

ఇంట్లోని వస్తువులెన్నో పోయాయి! ఉన్నవేమో ఇలా వరదతో బురద కొట్టుకుపోయాయి. ఏవి పనికొస్తాయో, ఎంత పనికొస్తాయో తెలియదు. కళ్లముందు కొండంత కష్టం! అదే సమయంలో ఈ కష్టాల నుంచి గట్టెక్కుతామనే ధైర్యం! బుడమేరు ముంపు బాధిత ప్రాంతమైన అజిత్‌సింగ్ నగర్ ప్రాంతంలో మంగళవారం కనిపించిన చిత్రమిది! ఈనెల 1వ తేదీన బుడమేరు పొంగడంతో మొదలైన కష్టం నుంచి బెజవాడ వేగంగా కోలుకుంటోంది. బుడమేరు శాంతించింది. గండ్లు పూడ్చడంతోపాటు... పటిష్ఠం చేసే ప్రక్రియా కొనసాగుతోంది. ముంపు ప్రాంతాల్లో వరద చాలావరకు తగ్గిపోయింది. ప్రకాశం బ్యారేజీ వద్ద దెబ్బతిన్న మూడు కౌంటర్ వెయిట్ల అమరిక ముగిసింది. వరద బాధిత ప్రాంతాల్లో సాధారణ పరిస్థితులు తెచ్చేందుకు ప్రభుత్వం అహరహం శ్రమిస్తోంది.

కళ్లముందు దైన్యం.. కళ్లలో ధైర్యం

కోలుకుంటున్న బెజవాడ

- శాంతించిన బుడమేరు.. గట్లు పటిష్ఠం
- ప్రకాశం బ్యారేజీ కౌంటర్ వెయిట్లు సిద్ధం
- జోరుగా సాగుతున్న సహాయ చర్యలు
- సాధారణ పరిస్థితులు నెలకొనేలా సహాయం

నష్టం అంచనాకు మంత్రివర్గ ఉపసంఘం

ప్రజల కోసమే ఈ యుద్ధం

- ఏడాది కిందట నాకు అండగా నిలిచారు
- అర్బన్ కంపెనీకి ఫోన్ చేస్తే ఇంటికేవచ్చి కొన్ని రిపేర్లు
- ముంపు ప్రాంతాల్లో ఇంటింటికీ ఉచితంగా దుస్తులు 12
- బుడమేరు వరద బెజవాడను తాకకుండా అన్నీ చేస్తాం: చంద్రబాబు



ఏజెన్సీ గర్జిస్తోంది..


ఏలేరు రిజర్వాయర్ నుంచి విడుదలవుతున్న నీరు

ఉత్తరాంధ్రలో కుంభవృష్టి

బలిమెల డ్యామ్ వద్ద 30 సెంటీమీటర్ల వర్షం

పూరీ వద్ద తీరం దాటిన తీవ్ర వాయుగుండం

- ఉధృతంగా నదులు, వాగులు.. నిండిన జలాశయాలు
- ఒడిశాలోనూ భారీవానలతో ఉప్పొంగిన నదులు
- ప్రమాదకరంగా శబరి.. కూనవరం వద్ద గోదారిలోకి..
- గోదావరిలోనూ పెరుగుతున్న వరద
- నీట మునిగిన రోడ్లు.. నిలిచిన రాకపోకలు
- వేల ఎకరాల్లో నీట మునిగిన పంటలు
- అల్లూరి జిల్లాలో కొండచరియలు పడి యువతి మృతి
- కాలువలకు గండ్లు.. కొట్టుకుపోయిన వంతెనలు


అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ చట్రాపల్లి గ్రామంలోకి కొట్టుకువచ్చిన కొండచరియలు, మట్టి, రాళ్లు

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు ఉత్తరాంధ్ర ఉక్కిరిబిక్కిరైంది. శనివారం మధ్యాహ్నం నుంచి సోమవారం ఉదయం వరకు ఉత్తరాంధ్ర జిల్లాల్లో పలుచోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిశాయి. దీంతో నదులు, వాగులు, గెడ్డలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. రిజర్వాయర్లలో నీటిమట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంది. బలిమెల డ్యామ్ వద్ద ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు ఏకంగా 30 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. గోవిందపురం (విజయనగరం జిల్లా

మిగతా 11వ పేజీలో...



ప్రమాదకరంగా 'ఏలేరు'

- పోటెత్తిన వరద.. ఇన్‌ఫ్లో 46,625 క్యూసెక్కులు
- కాకినాడ జిల్లాలో 8 మండలాలకు పొంచిఉన్న ముప్పు
- కిర్లంపూడి మండలం రాజుపాలెంలో కాల్వకు భారీ గండి
- మునిగిన ఇళ్లు.. 25 వేల ఎకరాల్లో పంటలు మునక
- పదికిపైగా కాలువలకు గండ్లు.. వంతెనలు ధ్వంసం 2
- రంగంలోకి ఆర్మీ, ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ బృందాలు

కాకినాడ జిల్లా గొల్లప్రోలులోని ఏలేరు ముంపు ప్రాంతంలో బురదలోనే పర్యటిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

తలశిల, నందిగం కనుసన్నల్లోనే

'బోట్ల' కుట్ర

- ఈ కేసులో ఉషాద్రి, రామ్మోహన్‌ల అరెస్టు
- ఒకరు తలశిల మేనల్లుడు, ఇంకొకరు నందిగం అనుచరుడు
- వారి స్కెచ్‌తోనే ప్రవాహంలోకి బోట్లు.. దర్యాప్తు బృందాల నిర్ధారణ
- నిందితులకు రిమాండ్.. జైలుకు తరలింపు 12

'కౌంటరు' ఆపరేషన్ సక్సెస్

- బ్యారేజీ గేట్లకు విజయవంతంగా 3 కౌంటర్ వెయిట్ల ఏర్పాటు
- తొలుత 15 రోజులు పట్టొచ్చని అంచనా.. 5 రోజుల్లోనే పూర్తి


సీఎం చంద్రబాబును కలిసి 10 కోట్ల విరాళానికి సంబంధించిన సమ్మతి లేఖను అందజేస్తున్న రేషన్ డీలర్లు 11

మేము సైతం

- వరద సాయంలో ఉదారత.. రేషన్ డీలర్ల విరాళం రూ.10 కోట్లు
- మేఘా ఇంజనీరింగ్ 5 కోట్లు.. జీఎంఆర్ విరాళం రూ.2.5 కోట్లు
- ఏఐజీ డాక్టర్ నాగేశ్వరరెడ్డి కోటి.. లలితా జ్యువెలరీస్ కిరణ్ కోటి



టెర్రరిస్ట్‌లా ట్రీట్ చేశారు 2

- పీఎస్ఆర్, కాంతిరాణా, గున్నీపై చర్యలు తీసుకోవాలి: నటి జెత్వానీ
- విద్యాసాగర్ బ్లాక్‌మెయిల్ చేశారు
- కేసు నమోదు చేయాలని సీపీని కోరిన మహిళా సంఘాలు

మిజోరాం గవర్నర్ కంభంపాటికి తీవ్ర అస్వస్థత 2

- ప్రత్యేక విమానంలో శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు

తప్పించుకున్నారా.. వదిలేశారా?

కీలక కేసుల్లో నిందితులు పరార్

- అరెస్ట్ చేయడంలో పోలీసుల వైఫల్యం?
- టీడీపీ కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై దాడి కేసుల్లో నిందితులు ఎక్కడ?
- జాడలేని లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, జోగి రమేశ్.. సుప్రీంలో అవినాశ్ పిటిషన్
- 4 నెలలుగా పరారీలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి
- ఒక్కొక్కరు పారిపోతున్నా అదే నిర్లక్ష్యం


అవినాశ్


లేళ్ల అప్పిరెడ్డి


తలశిల రఘురాం


జోగి రమేశ్

(గుంటూరు, నరసరావుపేట-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వంలో పోలీసులు అర్ధరాత్రి అని చూడకుండా గోడలు దూకి మరీ టీడీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతి పరులను అరెస్ట్ చేశారు. పైనుంచి ఆదేశాలు రావడమే ఆలస్యమన్నట్టు టార్గెట్ చేసి కేసులు పెట్టి వేధించారు. అలాంటిది పట్ట పగలే నానా బీభత్సం సృష్టించిన వైసీపీ నేతలు, కార్యకర్తలను ఇప్పుడు పోలీసులు ఎందుకు అరెస్ట్ చేయలేకపోతున్నారు? రోజులు, నెలలు గడుస్తున్నా వారిని పట్టుకోవడంలో ఎందుకు విఫలమవు తున్నారు? టీడీపీ కేంద్ర కార్యాలయం విధ్వంసం, నాటి ప్రతిపక్షనేత చంద్రబాబు ఇంటిపై దాడి కేసుల్లో కీలక నిందితులను ఇప్పటికీ పట్టుకోలేదు! అలాగే పోలింగ్ రోజున పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గంలో

మిగతా 11వ పేజీలో...

కోర్టుకు రావడానికి జగన్‌కు నామోషీ!



- ఇబ్బంది పేరిట షరతులు సవరించాలంటున్నారు.. చట్టానికి లోబడే షరతులు
- ఎన్‌వోసీ జారీకి షరతులు విధించే అధికారం ఉంది.. పరువునష్టం కేసు వివరాలు జగన్‌కు తెలుసు
- ఎన్నికల అఫిడవిట్లలో ప్రస్తావించారు.. పలు సందర్భాల్లో ప్రత్యేక కోర్టు సమన్లు ఇచ్చింది 3
- హోదాను అడ్డుపెట్టుకుని వాటిని అందుకోలేదు.. 'పాస్‌పోర్టు' వ్యాజ్యాన్ని కొట్టివేయండి: పీపీ వాదనలు

మొబైల్‌లో విద్యార్థినుల 5 వేల నగ్న వీడియోలు

» కర్ణాటకలో ఆర్ట్ టీచర్ నీచకృత్యం.. ఫోరెన్సిక్‌లో వెలుగులోకి

బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్రంలోని కోలారు జిల్లా మాలూరు తాలూకా మొరార్జీదేశాయ్ రెసిడెన్షియల్ స్కూల్‌లో డ్రాయింగ్ టీచర్ మొబైల్‌లో విద్యార్థినులకు చెందిన 5 వేలకుపైగా నగ్న వీడియోలు ఉన్న విషయం ఆదివారం వెలుగులోకి వచ్చింది. ఈ పాఠశాలలో గత ఏడాది విద్యార్థులచేత మ్యాన్‌హోల్ శుభ్రం చేయించిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం కలిగించింది. అప్పట్లో తల్లిదండ్రులు ఓ ఉపాధ్యాయుడు విద్యార్థినుల అశ్లీల ఫొటోలు, వీడియోలు తీశాడని అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఆర్ట్ (డ్రాయింగ్) టీచర్ మునియప్ప మొబైల్ ఫోన్లను సీజ్ చేశారు. మాస్తి పోలీసులు ఫోన్లలోని డేటాను పరిశీలించి, నగ్న వీడియోలను గుర్తించారు. ఉపాధ్యాయుడి నుంచి 5 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్న పోలీసులు వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపగా, ఐదు వేలకు పైగా నగ్నవీడియోలు ఉన్న విషయం బహిర్గతమైంది.

చర్చలు విఫలం.. ఒంటరిగా బరిలోకి ఆప్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: హరియాణా అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు చర్చలు విఫలం కావడంతో ఒంటరిగా బరిలోకి దిగాలని ఆమ్ ఆద్మీ పార్టీ నిర్ణయించింది. 20 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. 90 నియోజకవర్గాలున్న హర్యానా అసెంబ్లీకి అక్టోబర్ ఐదున ఎన్నికలు జరగనున్నాయి. వాస్తవానికి పొత్తులో భాగంగా ఆప్ 10 సీట్లు అడగ్గా కాంగ్రెస్ కేవలం 5 మాత్రమే ఇచ్చేందుకు అంగీకరించినట్లు సమాచారం. దీంతో ఆప్ సొంతంగా బరిలోకి దిగాలని నిర్ణయించినట్లు తెలిసింది.

సిరియాపై ఇజ్రాయెల్ దాడి.. 18 మంది మృతి

డమాస్కస్, సెప్టెంబరు 9: సిరియాపై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 18 మంది మృతి చెందగా, 40 మందికి పైగా గాయపడ్డారని సిరియా అధికారిక మీడియా సోమవారం ప్రకటించింది. ఆదివారం రాత్రి ఇజ్రాయెల్ జరిపిన దాడులు మధ్య సిరియాలో నష్టం కలిగించాయి. దాడుల్లో చనిపోయినవారిలో నలుగురు సాధారణ పౌరులని యూకే నుంచి పనిచేసే సిరియా మానవ హక్కుల సంస్థ ఒకటి తెలిపింది.

టెర్రరిస్టులా ట్రీట్ చేశారు: నటి జెత్వానీ

విజయవాడ(ధర్నాచౌక్), సెప్టెంబరు 9: గత వైసీపీ ప్రభుత్వంలో పోలీసు ఉన్నతాధికారులు తన పట్ల నీచంగా ప్రవర్తించారని ముంబై నటి కాదంబరి జెత్వానీ ఆరోపించారు. తనను ఒక టెర్రరిస్టుగా ట్రీట్ చేశారని, తన క్యారెక్టర్‌ను తప్పుగా చూపించే ప్రయత్నం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తన పట్ల దారుణంగా వ్యవహరించిన పోలీసు అధికారులు పీఎస్ఆర్ ఆంజనేయులు, కాంతిరాణా టాటా, విశాల్ గున్నీపై చట్టపరంగా తగిన చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సోమవారం విజయవాడ గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడారు. కుక్కల విద్యాసాగర్ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు ఒక మహిళ పట్ల దారుణంగా వ్యవహరించడం సరికాదన్నారు. అప్పటి పోలీసులు విద్యాసాగర్‌కు కొమ్ముకాశారని ఆరోపించారు. దుబాయ్‌లో ఉన్న తన సోదరుడిని కూడా ఇబ్బంది పెట్టారని చెప్పారు. తనపై ఎటువంటి క్రిమినల్ కేసులు లేవని స్పష్టం చేశారు. విద్యాసాగర్ తనను బ్లాక్‌మెయిల్ చేశారని ఆరోపించారు. అతనిపై 2015 నాటికే 18 క్రిమినల్ కేసులు ఉన్నాయన్నారు. సీఎం చంద్రబాబు తనకు న్యాయం చేస్తారనే ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రమాదకరంగా 'ఏలేరు'

» ఇన్‌ఫ్లో 46,625 క్యూసెక్కులు.. దిగువకు 27వేల క్యూసెక్కులు

» కాకినాడ జిల్లాలో 8 మండలాలకు పొంచిఉన్న ముప్పు

» తుని-నర్సీపట్నం మధ్య ఆర్టీసీ బస్సుల నిలిపివేత

» ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఉపముఖ్యమంత్రి పవన్

కాకినాడ(ఆంధ్రజ్యోతి), ఏలేశ్వరం, సెప్టెంబరు 9:కాకినాడ జిల్లాలో ఏలేరు రిజర్వాయర్ ప్రమాదకరంగా మారింది. ఈ ప్రాజెక్టులోకి భారీగా వరద పోటెత్తి ఏడు మండలాల్లో 25వేల ఎకరాలను ముంచేసింది. ఎగువన విశాఖ, పార్వతీపురం మన్యం ఏజెన్సీలో భారీవర్షాలు కురుస్తుండడంతో ప్రాజెక్టుకు అంచనాలకు మించి వరద ప్రవాహం వస్తోంది. ఏలేరులో గరిష్ఠ నీటిమట్టం 86.56 మీటర్లు కాగా, సోమవారం రాత్రి 10 గంటలకు నీటిమట్టం 86.14 మీటర్లకు చేరింది. నీటి నిల్వ సామర్థ్యం 24.11 టీఎంసీలు కాగా, ఇప్పటికే 23.27 టీఎంసీల నీరు చేరింది. సోమవారం రాత్రి 8గంటలకు గంటలకు ఏలేరు రిజర్వాయర్‌లోకి అన్ని మార్గాల ద్వారా ఇన్‌ఫ్లో 46,625 క్యూసెక్కులు ఉండగా, ఏలేరు కాలువలకు 27,000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. విశాఖ అవసరాల నిమిత్తం 275 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నాలుగేళ్ల తర్వాత మళ్లీ ఇన్‌ఫ్లో 45 వేల క్యూసెక్కులు దాటింది. కాగా, రాత్రి 10గంటలకు ఇన్‌ఫ్లో 27,275 క్యూసెక్కులకు తగ్గగా, దిగువకు 27వేల క్యూసెక్కుల నీరు విడుదల చేసినట్టు అధికారులు తెలిపారు. రాత్రి 11గంటలకు అదే పరిస్థితి నెలకొందన్నారు. ఎగువనున్న ఏజెన్సీ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండడంతో పరిస్థితి ఆందోళన కరంగా మారింది. ఏలేశ్వరం, ప్రత్తిపాడు, పిఠాపురం, గొల్లప్రోలు, పెద్దాపురం, సామర్లకోట, కిర్లంపూడి మండలాల్లో పంటలు నీట మునగడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కిర్లంపూడి మండలం రాజుపాలెంలో ఏలేరు కాలువకు భారీగా గండి పడి రాజుపాలెం, భూపాలపట్నం, ఎస్.తిమ్మాపురం, శృంగరాయునిపాలెం గ్రామాలు వరద ముంపునకు గురయ్యాయి. అనేక ఇళ్లల్లోకి వరద నీరు చేరింది. మంగళవారం ఉదయానికి వరద పెరిగితే పరిస్థితిని అంచనా వేయడమూ కష్టమని చెప్తున్నారు. ప్రవాహం తీవ్రతకు ఒక్కరోజే పదిచోట్లకుపైగా గండ్లు పడ్డాయి. మండలంలో 6వేలకుపైగా ఎకరాల్లో వరి నీటమునిగింది. పెద్దాపురం మండలంలో దబ్బ కాల్వ, ఏలేశ్వరంలో అప్పన్నపాలెం వంతెనలు వరద ఉధృతికి కుంగిపోయాయి. ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం వద్ద ఏలేరు ఎడమ కాలువకు గండి పడింది. వరద తీవ్రత అధికంగా ఉన్న గొల్లప్రోలు, పిఠాపురం మండలాల్లో భోగాపురం, రాపర్తి, పిడిందొడ్డి సమీపంలో భారీగా గండ్లు పడ్డాయి. పిఠాపురం నియోజకవర్గంలో 10వేల ఎకరాల్లో వరి, వాణిజ్య పంటలు పూర్తిగా నీటమునిగి చెరువులను తలపిస్తున్నాయి. కూరగాయలు, ఇతర వాణిజ్య పంటలైతే వరద తీవ్రతకు కొట్టుకుపోయాయి. 216వ జాతీయ రహదారిపై గొల్లప్రోలు టోల్‌గేట్‌కు ఇరువైపులా వరద నీరు చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు తలెత్తాయి. ప్రత్తిపాడులోని పలు ఏజెన్సీ గ్రామాలకూ రాకపోకలు నిలిచిపోయాయి. తుని-నర్సీపట్నం మధ్య ఆర్టీసీ సర్వీసులను నిలిపివేశారు. ప్రైవేటు వాహనాలు కూడా ప్రయాణించకజనం ఇబ్బందులు పడ్డారు.

ఏలేరుకు ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు

కిర్లంపూడి మండలం రాజుపాలెంవద్ద ఏలేరు కాలువకు గండిపడి ఇళ్లలోకి నీరు చేరడంతోపాటు, కాకినాడ జిల్లాలోని 8 మండలాల్లో వరద ఉధృతి అతి తీవ్రంగా ఉండే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. దీంతో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఇతర అత్యవసర విభాగాలను పంపాలని ప్రభుత్వాన్ని కోరారు.



సహాయక చర్యల నిమిత్తం పడవలతో ఏలేశ్వరానికి బయలుదేరుతున్న ఆర్మీ సిబ్బంది

బురదలో నడుచుకుంటూనే...

ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ సోమవారం సాయంత్రం మాజీ ఎమ్మెల్యే వర్మతో కలిసి పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. నీటమునిగిన పేదల ఇళ్ల కాలనీకి బోటులో వెళ్లారు. పవన్ బురదలో నడుచుకుంటూ బాధితులను పరామర్శించారు. పవన్‌కల్యాణ్‌కు జ్వరం తీవ్రంగా ఉన్నా.. కలెక్టర్‌తో కలిసి బోటెక్కారు. ముంపునకు గురైన కాలనీకి వెళ్లి బాధితుల సమస్యలు విన్నారు.

1,139.85 టీఎంసీల వరద

» ఈ 3 నెలల్లోనే శ్రీశైలానికి రికార్డు ప్రవాహం

కర్నూలు, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ప్రాజెక్టుకు 2024-25 నీటి సంవత్సరంలో సోమవారం వరకు 1,139.85 టీఎంసీల వరద చేరినట్లు అంచనా వేశారు. ఇది గత మూడు నెలల్లో వచ్చిన ప్రవాహమని.. ఇది రికార్డు అని ప్రాజెక్టు ఇంజనీర్లు చెబుతున్నారు. స్పిల్‌వే గేట్లు ఎత్తి 604.53 టీఎంసీలు, రైట్ పవర్ కెనాల్ ద్వారా ఏపీ ప్రభుత్వం విద్యుత్ ఉత్పత్తి చేస్తూ 101.45 టీఎంసీలు, తెలంగాణ ప్రభుత్వం లెఫ్ట్ పవర్ హౌస్ ద్వారా 152.74 టీఎంసీలు కలిపి 858.72 టీఎంసీలు దిగువన నాగార్జున సాగర్‌కు విడుదలచేశారు. మరోవైపు శ్రీశైలం జలాశయానికి వరద ప్రవాహం కొనసాగుతోంది. 2,28,307 క్యూసెక్కులు వస్తుండగా.. ఐదుక్రస్టు గేట్లు ఎత్తి దిగువకు 2,28,203 క్యూసెక్కులు వదులుతున్నారు.

తెలుగు భాష కాదు.. చరిత్ర

తెలుగు ముఖ్యం కాదంటే తెలుగువారిని అవమానించినట్లే

» ఒక రాష్ట్రం గొప్ప.. మరో రాష్ట్రం కాదు అని ఉండదు

» ఈ చిన్న విషయాన్ని అర్థం చేసుకోకపోవడం వల్లే పోరాటాలు

» మోదీపై ప్రజలకు భయం పోయింది

» అమెరికాలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు



న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): "తెలుగు అంటే ఒక భాష కాదు. ఒక చరిత్ర.. ఒక సంప్రదాయం.. ఒక సంస్కృతి" అని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ వ్యాఖ్యానించారు. అమెరికా పర్యటనలో ఉన్న రాహుల్ ఆదివారం డాలస్‌లో.. టెక్సస్ ఇండియన్ అమెరికన్ కమ్యూనిటీ ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ, ఆరెస్సెస్‌పై నిప్పులు కురిపించారు. భారత సమాఖ్య వ్యవస్థ గురించి మాట్లాడుతూ.. తెలుగును ప్రత్యేకంగా ప్రస్తావించారు. "భారత జాతీయగీతం అన్ని రాష్ట్రాలను ప్రతిబింబిస్తుంది. అన్ని రాష్ట్రాలను సమానంగా చూపిస్తుంది. ఒక రాష్ట్రం మాత్రమే గొప్ప అని ఎక్కడా చెప్పదు. ఏ రాష్ట్రం ఎక్కువా కాదు. తక్కువా కాదు. భాషలు సంప్రదాయాలు కూడా సమానమే. తెలుగునే తీసుకోండి.. మనం తెలుగు కేవలం భాషగా మాత్రమే కాకుండా.. చరిత్ర, సంప్రదాయం, సంస్కృతిగా చూస్తాం. హిందీతో పోలిస్తే తెలుగు భాష అంత ముఖ్యం కాదని ఒకవేళ ఆ రాష్ట్ర ప్రజలకు చెబితే.. అది వారిని అవమానించినట్లే" అని వ్యాఖ్యానించారు. ఈ చిన్న తేడాను కొందరు అర్థం చేసుకోకపోవడం వల్లే భారత్‌లో పోరాటాలు జరుగుతున్నాయంటూ బీజేపీపై ఫైర్ అయ్యారు. భారత రాజకీయాల్లో ప్రేమ, గౌరమర్యాదలు, మానవత్వం లోపించాయని ఆవేదన వ్యక్తం చేశారు. తాము(కాంగ్రెస్) మాత్రం కుల, మత, సంస్కృతి, చరిత్ర అనే తరతమబేధాల్లేకుండా ప్రతి ఒక్కరికీ సమానావకాశాలు కల్పించేందుకు ప్రయత్నిస్తామని ఉద్ఘాటించారు. "ఆరెస్సెస్ భారత్‌ను ఒక భావజాలంగా భావిస్తుంది. మహిళలు ఇంటికే పరిమితమవ్వాలనే ధోరణిలో ఉంటుంది. మేము మాత్రం భారత్ అంటే.. బహుళ భావజాలాలు అని విశ్వసిస్తాం. అమెరికా మాదిరిగానే మేము కూడా ప్రతి ఒక్కరికీ భాగస్వామ్యం కల్పించాలని కోరుకుంటాం. కుల, మత బేధాల్లేకుండా ప్రతి ఒక్కరూ తమ కలలను సాకారం చేసుకునేందుకు సహకరిస్తాం" అని స్పష్టం చేశారు. భారత ఎన్నికల ఫలితాలు వచ్చిన కొద్ది క్షణాల్లోనే.. ప్రజలు బీజేపీకి, ప్రధాని మోదీకి భయపడడం మానేశారనే విషయాన్ని తాను గుర్తించానన్నారు. ఇది రాజ్యాంగాన్ని అర్థం చేసుకున్న ప్రజలు సాధించిన భారీ విజయంగా ఆయన అభివర్ణించారు. "నేను ఏం చెప్పాలనుకుంటున్నానంటే.. భారత్ అంటే.. రాష్ట్రాల సమాఖ్య. అందుకే అన్ని ప్రాంతాలను, భాషలను, సంస్కృతులను గౌరవించాలి. అన్ని కులాలను గౌరవించాలి" అని వ్యాఖ్యానించారు. ఈ తరతమబేధాలతోనే భారత్‌లో నైపుణ్యం ఉన్నవారిని పక్కనపెడుతున్నారని పేర్కొంటూ.. మహాభారతంలో ఏకలవ్యుడి ఉదంతాన్ని ఉటంకించారు. "నైపుణ్యత ఉన్నవారిని పాలకులు గౌరవించడం లేదనేది నా భావన" అని స్పష్టం చేశారు. తాము విపక్షంలో ఉన్నామని.. విపక్షం అంటే ప్రజల గొంతుక అని అన్నారు. భారత్, అమెరికా మధ్య స్వేచ్ఛాయుత రాకపోకలు ఉండాలనేదే తన ఆకాంక్ష అని వివరించారు. చైనాతో పోలిస్తే భారత్‌లో నిరుద్యోగం ఎక్కువ ఉందన్నారు. భారత్ సహా.. పాశ్చాత్య దేశాలు, అమెరికా, ఐరోపా ఉత్పత్తిని మానేసి.. ఆ పనిని చైనాకు అప్పజెప్పాయని, దీని వల్ల ఈ దేశాల్లో నిరుద్యోగం పెరిగిందని పేర్కొన్నారు.

భగ్గుమన్న బీజేపీ

ఆరెస్సెస్, బీజేపీపై రాహుల్‌గాంధీ అమెరికాలో చేసిన వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఒక ద్రోహికి ఆరెస్సెస్ అంటే అర్థం కాదని కేంద్ర మంత్రి గిరిరాజ్ సింగ్ తీవ్రంగా వ్యాఖ్యానించారు. ఆరెస్సెస్‌ను అర్థం చేసుకోవాలంటే రాహుల్ ఎన్నో జన్మలెత్తాలని, దేశాన్ని విమర్శించేందుకు విదేశాలకు వెళ్లేవారికి సంఘ్ మూల సిద్ధాంతాలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ఆరెస్సెస్ పాత్ర గురించి రాహుల్ ఏదైనా టెక్నాలజీని ఉపయోగించి.. తన నానమ్మ దగ్గర తెలుసుకోవాలన్నారు. భారతదేశ విలువల నుంచి ఆరెస్సెస్ జన్మించిందన్నారు. రాహుల్ చైనాను బలపరిచేందుకు ఉత్సుకత ప్రదర్శిస్తుంటారని బీజేపీ అధికార ప్రతినిధులు ప్రదీప్ భండారీ, గౌరవ్ భాటియా అన్నారు. చైనా కమ్యూనిస్టు పార్టీతో రాహుల్ ఎంవోయూ కుదుర్చుకున్నారా? అని ప్రశ్నించారు. రాహుల్ బెయిల్‌పై ఉన్నందుకే భారత న్యాయవ్యవస్థను విమర్శిస్తున్నారన్నారు. దేశాన్ని విభజించి, పాలించాలన్న వ్యూహంతోనే ఆయన సామాజిక ఉద్వేగాలను ఆశిస్తున్నారని దుయ్యబట్టారు. రాహుల్ భారతీయ దేవతలను అవమానిస్తారని విమర్శించారు.

యూఏఈ అణుశక్తికి భారత్ సహకారం



» యువరాజు అల్ నహ్యాన్‌తో మోదీ చర్చలు

» నాలుగు కీలక ఒప్పందాలపై సంతకాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: అణుశక్తి రంగంలో యునైటెడ్ అరబిక్ ఎమిరేట్స్(యూఏఈ)కి భారత్ సహకారం అందించనుంది. యూఏఈతోపాటు.. అరేబియా ద్వీపకల్పంలో మొట్టమొదటి అణుశక్తి కేంద్రం అయిన బరాకా న్యూక్లియర్ పవర్ ప్లాంట్ నిర్వహణ, ఆపరేషన్స్‌కు.. ఎమిరేట్స్ న్యూక్లియర్ ఎనర్జీ కంపెనీ(ఈఎన్ఈసీ)కి న్యూక్లియర్ పవర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(ఎన్‌పీసీఐఎల్) సహకరించనుంది. సోమవారం ఢిల్లీలో యూఏఈ యువరాజు షేక్ ఖాలెద్ బిన్ మహమ్మద్ బిన్ జాయెద్ అల్ నహ్యాన్, భారత ప్రధాని మోదీ మధ్య జరిగిన ద్వైపాక్షిక చర్చల్లో భాగంగా ఈఎన్ఈసీ, ఎన్‌పీసీఐఎల్ ఈ మేరకు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశాయి. అదేవిధంగా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్(ఐవోసీఎల్)కు ఎల్ఎన్‌జీని సరఫరా చేసేందుకు అబుధాబి జాతీయ చమురు కంపెనీ(ఏడీఎన్‌వోసీ)తో భారత వ్యూహాత్మక పెట్రోలియం నిల్వల సంస్థ(ఐఎస్‌పీఆర్ఎల్) ఒప్పందం కుదుర్చుకుంది. అబుధాబి ఆన్‌షోర్ బ్లాక్-1కు సంబంధించి ఉర్జా భారత్-ఏడీఎన్‌వోసీ మధ్య.. భారత్‌లో ఫుడ్‌పార్క్‌ల అభివృద్ధికి గుజరాత్ ప్రభుత్వానికి, అబుధాబి డెవలప్‌మెంటల్ హోల్డింగ్ కంపెనీ పీజేఎస్‌జీ(ఏడీక్యూ)తో ఒప్పందాలు జరిగాయి. ఈ సమావేశం అనంతరం ఇరువురు నేతలు ఢిల్లీలోని రాజ్‌ఘాట్‌కు చేరుకున్నారు. అక్కడ మహాత్ముడి సమాధి వద్ద నివాళులు అర్పించారు. ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో బస చేసిన యూఏఈ యువరాజు రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయ్యారు. మంగళవారం ఆయన ముంబైలో జరగనున్న బిజినెస్ ఫోరంలో పాల్గొంటారు.

ఈ సమయంలో ప్రధానితో భేటీనా?

» కర్ణాటక ఉపముఖ్యమంత్రి డీకేపై కాంగ్రెస్ అధిష్ఠానం ఆగ్రహం



బెంగళూరు, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధిష్ఠానానికి అత్యంత ఆప్తుడిగా ముద్రపడిన కర్ణాటక ఉప ముఖ్యమంత్రి, కేపీసీసీ అధ్యక్షుడు డీకే శివకుమార్‌పై పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శులు ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. 'ముడా' ఇంటి స్థలాల వివాదంలో సీఎం సిద్దరామయ్యను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ విషయమై పార్టీ అధిష్ఠానానికి వివరణ ఇచ్చేందుకు సీఎం సిద్దరామయ్య, శివకుమార్ ఆగస్టు మూడోవారంలో ఢిల్లీ వెళ్లారు. అదే సందర్భంలో శివకుమార్ ప్రధాని మోదీతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. ముఖ్యమంత్రిపై వివాదం కొనసాగుతున్న సమయంలో ప్రధానమంత్రిని డీకే కలవడంపై కాంగ్రెస్ అధిష్ఠానం అసంతృప్తి వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. ప్రధానిని కలిసేందుకు సొంత పార్టీ ముఖ్యమంత్రులకే అవకాశం లభించడం కష్టంగా ఉందని, అటువంటిది వైరి పార్టీ నేత అయిన శివకుమార్ ఏ విధంగా అపాయింట్‌మెంట్ పొందారనే విషయంపై అధిష్ఠానం ఆరా తీసినట్టు తెలుస్తోంది. రాష్ట్రంలో భిన్నమైన పరిస్థితులు ఉన్నప్పుడు, సీఎం ఢిల్లీలో ఉన్న సమయంలోనే ఉప ముఖ్యమంత్రి ప్రధానిని కలవడం వెనుక ఉద్దేశమేమిటని ఆరా తీసినట్టు సమాచారం. పార్టీ ప్రధాన కార్యదర్శులు కేసీ వేణుగోపాల్, రాష్ట్ర పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జ్ సుర్జేవాలా ఈ విషయంపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు తెలుస్తోంది. మంత్రిగా పలు అభివృద్ధి పనులపై ప్రధానిని కలిశానని, రాజకీయ ఉద్దేశం లేదని డీకే వివరణ ఇచ్చినట్టు తెలుస్తోంది. కాగా, ప్రస్తుతం రాహుల్‌గాంధీ అమెరికా పర్యటనలో ఉన్న నేపథ్యంలో శివకుమార్ కూడా అమెరికా చేరుకున్నారు. వారిద్దరూ అక్కడ భేటీ అయ్యే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది.

బీమా ప్రీమియంపై జీఎస్టీ తగ్గింపు!

జీఎస్టీ మండలిలో విస్తృత ఏకాభిప్రాయం

» నవంబరు భేటీలో తగ్గింపుపై నిర్ణయం

» క్యాన్సర్ ఔషధాలపై జీఎస్టీ 5 శాతానికి తగ్గింపు

» చిరుతిళ్లపై 18 నుంచి 12 శాతానికి..

» కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి



న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియం చెల్లింపులపై విధిస్తున్న జీఎస్టీని తగ్గించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. బీమా ప్రీమియంలపై ప్రస్తుతం 18 శాతం జీఎస్టీ వసూలు చేస్తున్నారు. దీన్ని తగ్గించే విషయమై జీఎస్టీ మండలి విస్తృత ఏకాభిప్రాయానికి వచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సోమవారం ఆమె నేతృత్వంలో జీఎస్టీ మండలి 54వ సమావేశం జరిగింది. అనంతరం మంత్రి విలేకర్లతో మాట్లాడారు. బీమా ప్రీమియంలపై ఎంత మేరకు పన్ను తగ్గించాలనే అంశంపై నవంబరులో జరిగే జీఎస్టీ మండలి సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియం చెల్లింపులపై జీఎస్టీని తగ్గిస్తే కలిగే ప్రభావాలపై కేంద్రం, రాష్ట్రాల పన్నుల అధికారులతో కూడిన ఫిట్‌మెంట్ కమిటీ సమగ్ర నివేదికను జీఎస్టీ మండలికి అందజేసింది. బీమా ప్రీమియంలపై ప్రస్తుతం విధిస్తున్న 18 శాతం జీఎస్టీని తగ్గించాలని రాష్ట్రాలన్నీ ఏకాభిప్రాయానికి వచ్చినట్లు నిర్మల తెలిపారు. దీనిపై వచ్చే నెలాఖరులోగా నివేదిక సమర్పించాలని బిహార్ డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి నేతృత్వంలోని మంత్రుల బృందాన్ని ఆదేశించినట్లు చెప్పారు. ఆ నివేదికను పరిశీలించిన తర్వాత నవంబరులో జరిగే మండలి భేటీలో బీమా ప్రీమియంపై ఎంత మేరకు జీఎస్టీ తగ్గించాలనేదానిపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఇక తాజా సమావేశంలో క్యాన్సర్ ఔషధాలపై 12 శాతంగా ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని నిర్ణయించినట్లు చెప్పారు. మతపరమైన ప్రయాణాల్లో ఉపయోగించే హెలికాప్టర్ సర్వీసులపై 18 శాతం ఉన్న జీఎస్టీని 5 శాతానికి తగ్గించాలని నిర్ణయించినట్లు నిర్మల వెల్లడించారు. అలాగే చిరుతిళ్ల (స్నాక్స్)పై ఉన్న 18 శాతం జీఎస్టీని 12 శాతానికి తగ్గిస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్ గేమింగ్‌పై 28 శాతం జీఎస్టీ వసూలు చేయాలని నిర్ణయించిన తర్వాత (2023, అక్టోబరు 1) నుంచి ఆర్నెల్లలోనే ఈ రంగంలో పన్ను వసూళ్లు 412 శాతం పెరిగి రూ.6909 కోట్లకు చేరాయని నిర్మల వెల్లడించారు. కాగా, బీమా ప్రీమియంపై జీఎస్టీ తగ్గిస్తే చెల్లించాల్సిన ప్రీమియం మొత్తం తగ్గిపోయి.. కోట్లాది మంది పాలసీదారులకు లబ్ధి చేకూరుతుంది. 2023-24లో కేంద్రం, రాష్ట్రాలు ఆరోగ్య బీమా ప్రీమియంపై జీఎస్టీ కింద రూ.8262.94 కోట్లు వసూలు చేశాయి.

వైద్యురాలిపై హత్యాచార కేసు..

ఆ పత్రం ఎక్కడ?

మృతదేహాన్ని శవపరీక్షకు అప్పగించినప్పుడు ఇచ్చే డాక్యుమెంట్ ఏది?

» సీబీఐ, బెంగాల్ సర్కారుకు సుప్రీం ప్రశ్న

» మృతురాలి ఫొటోలను సోషల్ మీడియా నుంచి తొలగించాలని ఆదేశం



ఆర్జీ కర్ ఆస్పత్రి వద్ద సీబీఐ అధికారులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9: కోల్‌కతా ప్రభుత్వ వైద్య కళాశాలలో హత్యాచారానికి గురైన జూనియర్ వైద్యురాలి కేసులో మృతురాలి శవపరీక్షకు సంబంధించిన కీలక పత్రం కనిపించకపోవడంపై సుప్రీం కోర్టు తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ అంశంపై దర్యాప్తు జరపాలని సీబీఐని ఆదేశించింది. మరోవైపు హత్యాచార ఘటనను నిరసిస్తూ ఆందోళనలకు దిగిన వైద్యులు విధుల్లో చేరాలని సూచించింది. మంగళవారం సాయంత్రం 5 గంటల్లోగా విధులకు హాజరవకపోతే చర్యలు తీసుకునే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని తెలిపింది. సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ జేబీ పార్దీవాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాల ధర్మాసనం సోమవారం జూనియర్ వైద్యురాలి హత్యాచార కేసును విచారించింది. ఆమె మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం అప్పగించిన సమయంలో ఇవ్వాల్సిన పత్రం ఎక్కడ ఉందని సీజేఐ ధర్మాసనం సీబీఐని, బెంగాల్ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే ఆ పత్రం తమ రికార్డుల్లో లేదని సీబీఐ తరఫున వాదనలు వినిపించిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తెలిపారు. బెంగాల్ ప్రభుత్వం తరఫు న్యాయవాది కపిల్ సిబాల్ స్పందిస్తూ.. ఆ పత్రం గురించి తనకూ తెలియదని, తర్వాత దానికి సమాధానం ఇస్తానని చెప్పారు. అత్యాచారం, హత్య జరిగిన తర్వాత ఎఫ్ఐఆర్ నమోదు చేయడానికి కోల్‌కతా పోలీసులకు 14 గంటలు ఎందుకు పట్టిందని ధర్మాసనం మరోసారి ప్రశ్నించింది. అలాగే ఈ కేసు దర్యాప్తుపై ఈ నెల 17న తాజా నివేదిక సమర్పించాలని సీబీఐని ఆదేశించింది. ఇక మృతురాలి ఫొటోలను అన్ని సోషల్ మీడియా వేదికల నుంచి తక్షణమే తొలగించాలని ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు కేసు దర్యాప్తుపై సీబీఐ స్థాయీ నివేదికను సమర్పించిందని, కేసు విచారణ కొనసాగుతోందని.. ఈ విషయంలో సీబీఐకి తాము సలహాలు ఇవ్వాలనుకోవడం లేదని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. ఆర్జీ కర్ కళాశాలలో హత్యాచార ఘటన జరిగిన ప్రదేశంలో సేకరించిన ఫోరెన్సిక్ నమూనాలను రాష్ట్ర ప్రభుత్వ ఫోరెన్సిక్ విభాగం పరిశీలించిందని, వాటిని తాము ఢిల్లీ ఎయిమ్స్‌కు పంపాలని నిర్ణయించామని తుషార్ మెహతా ధర్మాసనానికి తెలిపారు. ఆర్జీ కర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో భద్రత కోసం నియమించిన మూడు కంపెనీల సీఐఎస్ఎఫ్ సిబ్బందికి తక్షణమే సకల సౌకర్యాలు కల్పించాలని బెంగాల్ హోంశాఖను ధర్మాసనం ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 17కు వాయిదా వేసింది. కాగా, వైద్యుల నిరసన కారణంగా రాష్ట్రంలో 23 మంది మరణించారని బెంగాల్ ప్రభుత్వం సుప్రీంకోర్టుకు తెలిపింది.

2వారాలు.. 2వేల పోలీసులు

ఎట్టకేలకు చిక్కిన స్వయంప్రకటిత దైవ కుమారుడు క్విబొలోయ్

» చిన్నపిల్లల సెక్స్‌ట్రాఫికింగ్, స్మగ్లింగ్ సహా ఫిలిప్పీన్స్ పాస్టర్‌పై ఎన్నో కేసులు



మనీలా, సెప్టెంబరు 9: తనను తాను దైవ కుమారుడిగా, ఈ విశ్వానికి యజమానిగా ప్రకటించుకుని.. లక్షలాది మందిని ఆధ్యాత్మిక మత్తులో ముంచేసి.. చిన్నపిల్లల సెక్స్ రాకెటింగ్ సహా రకరకాల అరాచకాలకు పాల్పడిన ఫిలిప్పీన్స్ పాస్టర్ అపోలో క్విబొలోయ్‌ని అమెరికా కేంద్ర దర్యాప్తు సంస్థ ఎఫ్‌బీఐ అరెస్టు చేసింది! ఫిలిప్పీన్స్‌తోపాటు అమెరికా దేశాల 'వాంటెడ్' జాబితాలో ఉన్న ఈ 74 ఏళ్ల పాస్టర్‌ను పట్టుకునేందుకు దాదాపు 2000 మంది పోలీసులు.. కింగ్‌డమ్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ (కేవోజేసీ) పేరిట అతడు ఏర్పాటుచేసుకున్న 75 ఎకరాల సామ్రాజ్యంలో రెండువారాలపాటు అణువణువూ గాలించారు! 2017లో మన దేశంలో డేరా సచ్చా సౌదా చీఫ్ గుర్మీత్ రామ్ రహీమ్‌సింగ్‌ను అరెస్టు చేసినప్పుడు అతడి అనుచరులు చేసిన రచ్చ గుర్తుందా? అచ్చం అలాగే.. క్విబొలోయ్ అనుచరులు కూడా పోలీసుల తనిఖీలను తీవ్రంగా ప్రతిఘటించారు. వేలాదిగా తరలివచ్చి పోలీసులతో ఘర్షణకు దిగారు. అయినా పోలీసులు వెనక్కి తగ్గలేదు. ప్రత్యేక నిఘా పరికరాలను తెప్పించి.. వాటిలో నమోదైన హృదయస్పందనల ఆధారంగా అతడు అక్కడే అండర్‌గ్రౌండ్‌లో ఒక బంకర్‌లో దాక్కుని ఉన్నట్టు గుర్తించి అరెస్టు చేశారు. అతడితోపాటు మరో నలుగురిని కూడా అదుపులోకి తీసుకుని రాజధాని మనీలాకు తరలించారు. క్విబొలోయ్ లాయర్లు మాత్రం అతడే తనంత తానుగా లొంగిపోయాడని చెబుతున్నారు. తన అరెస్టు వెనుక సైతాను హస్తం ఉందని క్విబొలోయ్ ప్రకటించాడు.

ఇవీ అభియోగాలు..

ఫిలిప్పీన్స్‌లో పేదరికంలో మగ్గిపోతున్న చిన్నారులకు దాతృత్వం పేరుతో అమెరికాలోనూ ఆధ్యాత్మిక దుకాణం తెరిచిన క్విబొలోయ్‌పై 2021లో అమెరికా పోలీసులు చిన్నపిల్లల సెక్స్‌ట్రాఫికింగ్, మోసం, భారీగా నగదు అక్రమ రవాణా వంటి కేసులు పెట్టారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. దైవకార్యం పేరిట క్విబొలోయ్ ఫిలిప్పీన్స్ నుంచి బాలికలను, యువతులను అమెరికాకు తీసుకెళ్లేవాడు. వారంతా.. పగటిపూట విరాళాలు సేకరించాల్సి ఉంటుంది. రాత్రి పూట.. 'నైట్ డ్యూటీ' పేరిట వేసే ప్రత్యేక డ్యూటీలో భాగంగా అతడికి లైంగిక సేవలు అందించాలి. అందుకు ఒప్పుకొన్నవారికి డిస్నీలాండ్ సందర్శన, ప్రైవేటు జెట్ విమానంలో టూర్ల వంటి ప్రోత్సాహకాలు ఇచ్చేవారు. కాదన్నవారికి 'శాశ్వత నరకం' తప్పదని బెదిరించేవారు. 'సైతాను బిడ్డ' అని రాసి ఉన్న దుస్తులువారికి వేసి గదుల్లో బంధించేవారు. ఈ విషయాలన్నీ 2021లోనే బయటపడినా.. అతడు అప్పటి ఫిలిప్పీన్స్ అధ్యక్షుడు రోడ్రిగో డ్యుటెర్టే బాల్యస్నేహితుడు, ఆధ్యాత్మిక సలహాదారు కావడంతో అతడి అరెస్టుకు ఎవరూ సాహసించలేదు. 2022 జూన్‌లో డ్యుటెర్టే పదవీకాలం ముగిశాక క్విబొలోయ్‌కి కష్టాలు మొదలయ్యాయి. ఫిలిప్పీన్స్ ప్రభుత్వం కూడా అతడిపై అరెస్టు వారెంట్ జారీ చేసింది. ఆ ఆశ్రమంలోని ఒక కొండమీద అతడికో కోట ఉంది దానిపేరు.. 'గార్డెన్ ఆఫ్ ఈడెన్ రిసార్ట్' అని పేరు పెట్టుకున్నాడు. సొంత టీవీ, రేడియో, సోషల్ మీడియా నెట్‌వర్క్ కూడా ఉన్నాయి. తనకు ఫిలిప్పీన్స్‌లోనే 40 లక్షల మంది అనుచరులు.. ప్రపంచవ్యాప్తంగా మరో 30 లక్షల మంది దాకా భక్తులున్నారని గతంలో ఒకసారి ప్రకటించాడు.

లోకం తీరు



మిజోరాం గవర్నర్ కంభంపాటికి

తీవ్ర అస్వస్థత

» ప్రత్యేక విమానంలో హైదరాబాద్‌కు

శంషాబాద్ రూరల్/హైదరాబాద్ సిటీ, సెప్టెంబరు 9: మిజోరాం గవర్నర్ కంభంపాటి హరిబాబు సోమవారం తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. గమనించిన భద్రత సిబ్బంది, వ్యక్తిగత డాక్టర్లు హుటాహుటిన హైదరాబాద్‌కు తరలించాలని నిర్ణయించారు. వెంటనే మిజోరాం నుంచి ప్రత్యేక విమానంలో మధ్యాహ్నం 12.30 గంటలకు శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు తీసుకొచ్చారు. అక్కడి నుంచి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా పోలీసులు గ్రీన్ చానల్ ఏర్పాటు చేసి ఔటర్ రింగ్ రోడ్డు సమీపంలోని స్టార్ ఆస్పత్రికి తరలించారు. ఆయన వైరల్ ఇన్‌ఫెక్షన్, జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిసింది. ఆయన ఇంతకు ముందు ఆయన గుండెకు సంబంధించిన చికిత్సలను స్టార్ ఆస్పత్రి వైద్యుల వద్ద తీసుకున్నట్లు సమాచారం. దీంతో ఆయనను ఇక్కడే వైద్యం కోసం ఇక్కడకు తరలించినట్లు తెలుస్తోంది. సోమవారం ఆయనకు అవసరమైన పరీక్షలను చేసినట్లు తెలిసింది. మంగళవారం ఉదయం నివేదికలు వచ్చిన తర్వాత ఆయన పూర్తి ఆరోగ్యంపై వైద్యులు నిర్ధారణకు రానున్నట్లు సమాచారం. ఆయనను ప్రత్యేక గదిలో ఉంచి చికిత్సలు అందిస్తున్నారు. ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పినట్లు తెలుస్తోంది.

భారత్‌లో కొత్త మంకీపాక్స్ కేసు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 9: భారత్‌లో కొత్త మంకీపాక్స్ కేసు నిర్ధారణ అయింది. అయితే అది క్లేడ్-2 రకానికి చెందిందని, కంగారుపడాల్సిన అవసరం లేదని కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. విదేశాలనుంచి ఇటీవల భారత్‌కు వచ్చిన యువకుడిలో మంకీపాక్స్ లక్షణాలు కనిపించడంతో ఐసోలేషన్‌లో ఉంచి నమూనాలను పరీక్షించారు. మంకీపాక్స్ సోకిందని నిర్ధారణ అయింది. ప్రస్తుతం బాధితుడి ఆరోగ్యం నిలకడగా ఉందని కేంద్రం తెలిపింది.

బుడమేరు ఆక్రమణలు తొలగించేలా ఆదేశాలు ఇవ్వండి

▸ హైకోర్టులో పిల్ దాఖలు

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): బుడమేరు పరీవాహక ప్రాంతంలో ఆక్రమణలు, చట్టవిరుద్ధంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించేలా ఆదేశించాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్) దాఖలైంది. ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి షేక్ ఖాజావలీ ఈ పిల్ దాఖలు చేశారు. ఉమ్మడి కృష్ణా, ఏలూరు జిల్లాల్లో వాగును వెడల్పు చేసేలా అధికారులను ఆదేశించాలని కోరారు. రెవెన్యూశాఖ ముఖ్యకార్యదర్శి, ఇరిగేషన్ శాఖ ముఖ్యకార్యదర్శి, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల కలెక్టర్లు, విజయవాడ మున్సిపల్ కమిషనర్‌ను వ్యాజ్యంలో ప్రతివాదులుగా చేర్చారు.

అక్రమ కేసును కొట్టివేయండి

▸ 2022 నాటి కేసులో సుప్రీంకోర్టుకు టీడీపీ ఎమ్మెల్యే రఘురామ అభ్యర్థన

▸ విచారణ నాలుగు వారాలకు వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌లో తనతోపాటు తన కుమారుడిపై నమోదైన అక్రమ కేసును కొట్టివేయాలని కోరుతూ టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణను సుప్రీంకోర్టు 4 వారాలకు వాయిదా వేసింది. 2022లో రఘురామ, ఆయన కుమారుడు భరత్‌తోపాటు వారి సిబ్బంది తనపై దాడి చేశారని ఏపీ ఇంటెలిజెన్స్ అధికారి ఫరూక్ భాషా ఫిర్యాదు చేశారు. దీంతో హైదరాబాద్ గచ్చిబౌలి పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే.. అది అక్రమ కేసు అని, దానిని కొట్టివేయాలని కోరుతూ రఘురామ, భరత్ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. దీంతో 2022, జూలై 12న సుప్రీంకోర్టును ఆశ్రయించారు. రఘురామ పిటిషన్‌ను సోమవారం జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ రాజేశ్ బిందాల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. రఘురామ పిటిషన్‌పై కౌంటర్ అఫిడవిట్ ఎందుకు దాఖలు చేయలేదని తెలంగాణ ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. అయితే.. తెలంగాణలో ప్రభుత్వం మారిందని, తమకు మరికొంత సమయం కావాలని ప్రభుత్వం తరఫు న్యాయవాదులు ధర్మాసనాన్ని కోరారు. దీంతో తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేశారు.

నివాస్‌కు సెక్రటరీ బాధ్యతలు

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): అదనపు కార్యదర్శి హోదాలో ఉన్న జె.నివాస్‌కు సెక్రటరీ స్థాయి బాధ్యతలు అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులిచ్చింది. నివాస్ ప్రస్తుతం ఆర్థిక శాఖలో అదనపు కార్యదర్శి హోదాలో విధులు నిర్వర్తిస్తున్నారు. ఇప్పుడు ఆయనకు ఆర్థికశాఖలో బడ్జెట్ విభాగాన్ని అప్పగించారు. ఈ నేపథ్యంలో జె. నివాస్‌ను సెక్రటరీ హోదాను కల్పిస్తున్నట్టు ప్రభుత్వం జీవో ఇచ్చింది.

కోర్టుకు రావడానికి జగన్‌కు నామోషీ!



▸ ఇబ్బంది పేరిట షరతులు సవరించాలంటున్నారు

▸ ఎన్‌వోసీ జారీకి షరతులు విధించే అధికారం ఉంది

▸ పరువునష్టం కేసు వివరాలు ఆయనకు తెలుసు

▸ 'పాస్‌పోర్టు' వ్యాజ్యాన్ని కొట్టివేయండి: పీపీ వాదనలు

▸ వాదనలు వినిపించిన జగన్ తరఫు సీనియర్ న్యాయవాది

▸ తీర్పు రిజర్వ్.. రేపు వెల్లడిస్తామన్న హైకోర్టు

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్‌కు పాస్‌పోర్ట్‌ను ఏడాది పాటే పునరుద్ధరించాలని, తమ ముందు హాజరై రూ.20 వేలు స్వీయ పూచీకత్తు సమర్పించాలని విజయవాడ ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు విధించిన షరతులు సహేతుకమైనవేనని పబ్లిక్ ప్రాసిక్యూటర్(పీపీ) మెండ లక్ష్మీనారాయణ తెలిపారు. అవి చట్టనిబంధనలకు లోబడే ఉన్నాయన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన హైకోర్టులో వాదనలు వినిపించారు. ఎన్‌వోసీ జారీకి షరతులు విధించే అధికారం ప్రత్యేక కోర్టుకు ఉందన్నారు. ఈ ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవద్దని హైకోర్టుకు విన్నవించారు. సీబీఐ కోర్టు ముందున్న కేసులు, ప్రత్యేక కోర్టు ముందున్న కేసు వేర్వేరని, రెండింటినీ పోల్చిచూడటానికి వీల్లేదని అన్నారు. పిటిషనర్‌కు అసౌకర్యం ఉందనే కారణంతో కోర్టు ఉత్తర్వులను సవరించాలని కోరరాదని చెప్పారు. పూచీకత్తు సమర్పించే నిమిత్తం కోర్టుకు వచ్చేందుకు జగన్ నామోషీగా భావిస్తున్నారని తెలిపారు. విజయవాడ కోర్టుకు వెళ్లకుండా.. ఎగ్గొట్టేందుకు పిటిషనర్ ప్రయత్నిస్తున్నారని అన్నారు. పరువు నష్టం కేసుపై హైకోర్టు స్టే విధించలేదన్నారు. సీనియర్ న్యాయవాది కోర్టును తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పరువు నష్టం కేసులో ప్రజాప్రతినిధుల కోర్టు జగన్‌కు తాజాగా సమన్లు జారీ చేసిందని, ఈ నెల 29న విచారణకు హాజరుకావాల్సి ఉందని అన్నారు. పాస్‌పోర్టు జారీ, పునరుద్ధరణకు సంబంధించి పూర్తి అధికారం పాస్‌పోర్టు అధికారులదేనని తెలిపారు. ఎన్‌వోసీ జారీ కోసం ప్రత్యేక కోర్టులో వేసిన పిటిషన్‌లో వారిని ప్రతివాదులుగా చేర్చలేదని చెప్పారు. ఎన్‌వోసీ జారీకి ఎలాంటి షరతులు విధించినా అభ్యంతరం లేదని ప్రత్యేక కోర్టులో వేసిన వ్యాజ్యంలో పిటిషనర్ ప్రస్తావించారని, అలాంటిది ఇప్పుడు కోర్టు షరతులపై హైకోర్టును ఆశ్రయించడంలో అర్థం లేదని పేర్కొన్నారు. క్రిమినల్ కేసుల విచారణ పెండింగ్‌లో ఉండగా పాస్‌పోర్టు జారీ/పునరుద్ధరణ కోసం షరతులు విధించే అధికారం కోర్టుకు ఉందని సుప్రీంకోర్టు పలు తీర్పులు ఇచ్చిందని ఈ సందర్భంగా వివరించారు. తనపై పరువు నష్టం కేసు పెండింగ్‌లో ఉందని 2019, 2024 ఎన్నికల అఫిడవిట్‌లోనే జగన్ ప్రస్తావించారని తెలిపారు. కేసు గురించి పిటిషనర్‌కు అవగాహన లేదని, సమన్లు అందలేదని సీనియర్ న్యాయవాది కోర్టును తప్పుదోవపట్టిస్తున్నారని అన్నారు. దీనిని పరిశీలిస్తే పిటిషనర్ వైఖరి ఏంటో తెలుస్తోందని చెప్పారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని జగన్ దాఖలు చేసిన పాస్ పోర్టు పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. పాస్‌పోర్ట్ రెన్యువల్ విషయంలో నిరభ్యంతరపత్రం(ఎన్‌వోసీ) ఇచ్చేందుకు విజయవాడలోని ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు కఠిన షరతులు విధించడాన్ని సవాల్ చేస్తూ మాజీ సీఎం జగన్ శుక్రవారం అత్యవసరంగా హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సోమవారం విచారణ జరిగింది.

నిందితుడే తప్పించుకున్నారా?

న్యాయస్థానం స్పందిస్తూ.. పరువునష్టం కేసులో ప్రత్యేక కోర్టు జారీ చేసిన సమన్లను నిందితుడి(జగన్)కి అందజేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని తెలిపింది. ఇంతకాలం సమన్లు అందచేయకుండా వారు ఏం చేస్తున్నారని ప్రశ్నించింది. సమన్లు ఉద్దేశపూర్వకంగా ఇవ్వలేదా? వాటిని తీసుకోకుండా నిందితుడే తప్పించుకున్నారా? కారణాలు ఏంటని పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను ప్రశ్నించింది. పీపీ బదులిస్తూ.. పిటిషనర్ తన హోదాను అడ్డుపెట్టుకొని గత ఐదు నరేళ్లుగా సమన్లు అందుకోలేదని వివరించారు. పాస్‌పోర్టుకు సంబంధించిన పిటిషన్‌పై సోమవారం జరిగిన విచారణలో ఇరు పక్షాల వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ తీర్పును రిజర్వ్ చేశారు. ఈ నెల 11న నిర్ణయం వెల్లడిస్తామని ప్రకటించారు.

ప్రత్యేక కోర్టు పరిధి దాటింది: పొన్నవోలు

జగన్ తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి స్పందిస్తూ.. సీఎంగా ఉండగా డిప్లొమేటిక్ పాస్‌పోర్టు ఉండేదని, ఆయన పదవి నుంచి దిగిపోయాక జనరల్ పాస్‌పోర్టు కోసం దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కుమార్తె పుట్టినరోజు వేడుకలు జరిపేందుకుగాను ఈ నెల 3 నుంచి 25 వరకు లండన్ వెళ్లేందుకు సీబీఐ కోర్టు అనుమతి ఇచ్చిందన్నారు. పాస్‌పోర్టును ఐదేళ్లపాటు పునరుద్ధరించాలని(రెన్యువల్) సీబీఐ కోర్టు సంబంధిత అధికారులను ఆదేశించినట్టు తెలిపారు. ప్రస్తుత మంత్రి నారాయణ 2018లో వేసిన పరువునష్టం కేసు పెండింగులో ఉన్నందున ప్రజాప్రతినిధుల కోర్టు నుంచి ఎన్‌వోసీ తెచ్చుకోవాలని పాస్‌పోర్ట్ అధికారులు పిటిషనర్‌కు సూచించారని తెలిపారు. ఎన్‌వోసీ కోసం ప్రత్యేక కోర్టును ఆశ్రయించగా కఠిన షరతులు విధించిందన్నారు. పాస్‌పోర్టును ఏడాదిపాటు మాత్రమే రెన్యువల్‌కు అనుమతిస్తామని, రూ.20 వేల స్వీయ పూచీకత్తు సమర్పించాలని ఆదేశించిందని పేర్కొన్నారు. ఈ నెల 6 నుంచి 26 మధ్య మాత్రమే లండన్‌కు వెళ్లాలని షరతులు విధించిందన్నారు. పిటిషనర్‌పై ఉన్న తీవ్రమైన క్రిమినల్ కేసులను విచారిస్తున్న సీబీఐ కోర్టే పాస్‌పోర్టును ఐదేళ్లకు పునరుద్ధరించాలని ఆదేశించగా, దానికి విరుద్ధంగా షరతులు విధించి ప్రత్యేక కోర్టు తన పరిధి దాటిందని తెలిపారు. తనపై పరువునష్టం కేసు ఉన్నట్లు పిటిషనర్‌కు అవగాహన లేదన్నారు. కేసును కాగ్నిజెన్స్‌లోకి తీసుకొని ప్రత్యేక కోర్టు జగన్‌కు ఎలాంటి సమన్లు ఇవ్వలేదని చెప్పారు. పరువునష్టం కేసు విచారణపై హైకోర్టు స్టే విధించిందన్నారు. ఈ నేపథ్యంలో కేసు పెండింగ్‌లో ఉన్నట్లు భావించడానికి వీల్లేదన్నారు. ఈ విషయంలో హైకోర్టు, సుప్రీంకోర్టు తీర్పులు ఇచ్చాయని, వాటిని పరిశీలించాలని కోరారు. పిటిషనర్‌కు ఐదేళ్ల పాస్‌పోర్టు పునరుద్ధరించడం వల్ల ప్రాసిక్యూషన్‌కు వచ్చిన నష్టం ఏమీ లేదన్నారు. ప్రత్యేక కోర్టు షరతులు రద్దు చేయాలని అభ్యర్థించారు.

సాయిరెడ్డి కుమార్తె అక్రమ నిర్మాణం పాక్షికంగా తొలగింపు!

▸ హైకోర్టు ఆదేశించినా పట్టించుకోని అధికారులు

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె భీమిలి సమీపాన బీచ్‌లో నిబంధనలకు వ్యతిరేకంగా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలపై జీవీఎంసీ అధికారులు నామమాత్రపు చర్యలు చేపట్టి మమ అనిపించేశారు. సాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి బీచ్‌లో ఇసుక తిన్నెలను తవ్వి శాశ్వత నిర్మాణాలు చేపట్టడంతో జీవీఎంసీ 22వ కార్పొరేటర్, జనసేన నేత పీతల మూర్తి యాదవ్ నిబంధనల ఉల్లంఘనపై హైకోర్టులో ప్రజా ప్రయోజనం వ్యాజ్యం దాఖలు చేయగా, అక్కడ నిర్మాణాలను ఆపి, యంత్రాలను స్వాధీనం చేసుకోవాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తరువాత కూడా నిర్మాణాలు కొనసాగించడంతో మూర్తి యాదవ్ హైకోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. తాము జారీచేసిన ఆదేశాలపై అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని న్యాయస్థానం ఆదేశించింది. దాంతో జీవీఎంసీ అధికారులు నామమాత్రంగా ఒకచోట కొద్దిగా పునాదులు తొలగించి చేతులు దులిపేసుకున్నారు. సముద్రం వైపు ఉన్న రెండు ప్రహరీ గోడల్లో ఒక దానిని పైపైన తొలగించి విడిచిపెట్టారు. రహదారి, దక్షిణం వైపు ఉన్న ప్రహరీలను అలాగే వదిలేశారు. ఈ కేసు ఈ నెల 11న హైకోర్టులో విచారణకు రానుంది.

బాబు అక్రమ అరెస్టుతోనే వైసీపీ పతనానికి నాంది: మంత్రి ఫరూక్

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు అక్రమ అరెస్టుతోనే వైసీపీ పతనానికి నాంది పడిందని మంత్రి ఎన్ఎండీ ఫరూక్ అన్నారు. సోమవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 'రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలకు పైగా మచ్చలేని ప్రజా నాయకుడు చంద్రబాబు. అహర్నిశలు ప్రజా సంక్షేమం కోసం కృషి చేస్తున్న ఆయనపై అక్రమ కేసులు బనాయించి, అరెస్టు చేసిన సైకో జగన్ ప్రభుత్వం... టెర్రరిస్టు పాలనను తలపింపచేసింది. ప్రజలందరూ తిరుగులేని విధంగా ఓటుతో బుద్ధి చెప్పారు' అని ఫరూక్ అన్నారు.

ప్రజలు గుణపాఠం చెప్పినా జగన్‌లో మార్పు రాలేదు

▸ మంత్రి కొల్లు, ఎమ్మెల్యే యార్లగడ్డ

సైకో జగన్ ప్రవృత్తికి చంద్రబాబు అరెస్టే.. తార్కాణమని మంత్రి కొల్లు రవీంద్ర వ్యాఖ్యానించారు. ప్రజలు తగిన గుణపాఠం చెప్పినా జగన్‌లో ఇంకా మార్పు రాలేదని, వరద సాయంపై ఆయన చేస్తున్న దుష్ప్రచారమే దీనికి నిదర్శనమని అన్నారు. విజయవాడలోని కలెక్టరేట్‌లో ఆయన తమ పార్టీ ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 'సరిగ్గా ఏడాది క్రితం ఏ సంబంధమూ లేని కేసులో చంద్రబాబును ఇరికించి జగన్ అరెస్టు చేయించారు. 53 రోజులపాటు జైల్లో ఉంచారు. అక్కడ ఆయనను అనేక రకాలుగా వేధించారు. అది చూసి ఆనందపడిన వారి గతి ఏమైందో ప్రపంచమంతా చూసింది' అని కొల్లు అన్నారు.

రెవెన్యూ మంత్రి ఓఎస్డీగా సుబ్బారావు

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ ఓఎస్డీగా రిటైర్డ్ ఐఏఎస్ బి.సుబ్బారావు నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సుబ్బారావు బాపట్ల జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పనిచేస్తూ గత నెల 31న పదవీ విరమణ చేశారు.

వర్షాలు, వరదల్లోనే అడ్మిషన్లు

▸ డిగ్రీ రెండో విడత ప్రక్రియ పూర్తి, తాజాగా మూడో విడతకు షెడ్యూలు

▸ నేడు, రేపు దరఖాస్తులకు గడువు .. డిగ్రీలో అంతా గందరగోళమే

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఓ వైపు తీవ్రమైన వర్షాలు, వరదలతో ప్రజలు అల్లాడిపోతున్నారు. పలు ప్రాంతాల్లో వరద ప్రభావం తీవ్రంగా ఉంది. ఇదే సమయంలో డిగ్రీ రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియను ముగించారు. గడువు పొడిగించాలని విద్యార్థులు డిమాండ్ చేసినా ఉన్నత విద్యామండలి పట్టించుకోకుండా ఇప్పుడు మూడో విడత అడ్మిషన్లకు షెడ్యూలు విడుదల చేసింది. ఉన్నత విద్యా శాఖ, ఉన్నత విద్యా మండలి తీరు డిగ్రీ విద్యను అస్తవ్యస్తం చేస్తోంది. మూడో విడతలో డిగ్రీ అడ్మిషన్లకు విద్యార్థులు మంగళ, బుధవారాల్లో దరఖాస్తు చేసుకోవచ్చని ఉన్నత విద్యా మండలి సూచించింది. 11వ తేదీ నుంచి 14 వరకు ఆప్షన్ల ఎంపికకు గడువు ఉంటుందని, 18వ తేదీన సీట్ల కేటాయింపు జరుగుతుందని వివరించింది. అడ్మిషన్లు పొందిన వారు 19వ తేదీ నుంచి 21లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని సూచించింది. కాగా రెండో విడత అడ్మిషన్ల ప్రక్రియలో గత నెల 29న విద్యార్థులకు సీట్లు కేటాయించగా, ఈ నెల 3లోగా కాలేజీల్లో రిపోర్టు చేయాలని అప్పట్లో షెడ్యూలు ఖరారు చేశారు. ఆ సమయంలో తీవ్రమైన వర్షాలు, వరదల కారణంగా అనేక జిల్లాల్లో విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో గడువు పొడిగించి, ఆ సమాచారాన్ని విద్యార్థులకు తెలియజేయాల్సిన ఉన్నత విద్యామండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వారి తీరుతోనే విజయవాడలో ఓ విద్యార్థి కాలేజీలో రిపోర్టు చేయడానికి వెళ్తూ వరదల్లో కొట్టుకుపోయి మృతిచెందాడు.

వీసీ పోస్టులకు దరఖాస్తులు

▸ ఆన్‌లైన్‌లో 28వ తేదీ వరకు గడువు.. 17 యూనివర్సిటీల్లో పోస్టులు ఖాళీ

రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 17 యూనివర్సిటీల వైస్ చాన్స్‌లర్ పోస్టుల భర్తీకి ఉన్నత విద్యా శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నెల 28వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఈ సారి దరఖాస్తుల విధానాన్ని మొత్తం ఆన్‌లైన్‌లోకి మార్చింది. దరఖాస్తు చేసుకోవాల్సినవారు ఉన్నత విద్యామండలి వెబ్‌సైట్‌లో లాగిన్ అయ్యి దరఖాస్తు చేసుకోవాలని, ఈ-మెయిళ్లు, హార్డ్ కాపీలు స్వీకరించరని స్పష్టం చేసింది. ప్రొఫెసర్‌గా పదేళ్ల అనుభవం ఉన్నవారు లేదా ప్రముఖ విద్యా సంస్థల్లో ప్రొఫెసర్ పోస్టుకు సమానమైన హోదాలో పనిచేసినవారు అర్హులని పేర్కొంది. ఒకరు ఒకటి కంటే ఎక్కువ యూనివర్సిటీలకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది.

నేటి నుంచి వైద్యుల సమ్మె

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో విధులు నిర్వహిస్తున్న వైద్యులు సమ్మెకు సిద్ధమయ్యారు. వైద్యుల సర్వీసు కోటాను 30శాతం నుంచి 15 శాతానికి తగ్గిస్తూ ప్రభుత్వం గత నెలలో జీవో 85ను విడుదల చేసింది. దీనివల్ల పీహెచ్‌సీల్లో విధులు నిర్వహించే వైద్యులు తీవ్రంగా నష్టపోతున్నారు. ఈ జీవోను రద్దు చేయాలంటూ ఇప్పటికే ఆరోగ్యశాఖ మంత్రి నుంచి ఉన్నతాధికారుల వరకూ విన్నవించారు. ఆరోగ్యశాఖ నుంచి స్పందన లేకపోవడంతో ఆందోళనలకు దిగుతున్నారు. సోమవారం ఉదయం ఏపీ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం ప్రతినిధులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పద్మకుమారిని కలసి సమ్మె నోటీసులు ఇచ్చే ప్రయత్నం చేశారు. అయితే డీహెచ్ అందుబాటులో లేకపోవడంతో సమ్మె నోటీసులను డీహెచ్ పేషీలో అందించారు. మంగళవారం నుంచే సమ్మెకు దిగుతున్నామని, తొలిరోజు నల్లబ్యాడ్జీలు ధరిస్తామని, 11, 12వ తేదీల్లో వైద్య సేవలకు అంతరాయం లేకుండా నిరసన కొనసాగిస్తామని వివరించారు. ప్రభుత్వం స్పందించకపోతే 13 నాటికి అత్యవసర సేవలు మినహా, అన్ని సేవలు నిలిపివేస్తామని చెప్పారు. 15న డీహెచ్ కార్యాలయం వరకూ 'చలో విజయవాడ' ర్యాలీ నిర్వహిస్తామని, 16నుంచి నిరవధిక నిరాహార దీక్షలు ప్రారంభిస్తామని సమ్మె నోటీసుల్లో పేర్కొన్నారు.

డీవైఈవో మెయిన్స్‌పై గోప్యత!

▸ పరీక్షకు అభ్యర్థుల ఎంపికపై సందేహాలు

▸ రోస్టర్ వారీగా వివరాలు కోరిన అభ్యర్థులు , లేవన్న ఏపీపీఎస్సీ

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): డిప్యూటీ విద్యాధికారి పోస్టుల భర్తీ విషయంలో ఏపీపీఎస్సీ గోప్యత పాటిస్తోంది. ఈ ఏడాది మే నెలలో 38 డీవైఈవో పోస్టుల భర్తీకి కమిషన్ స్ర్కీనింగ్ పరీక్ష నిర్వహించింది. ఫలితాల అనంతరం ఒక్కో పోస్టుకు వంద మంది చొప్పున 3,936 మంది అభ్యర్థులను మెయిన్స్‌కు ఎంపిక చేసింది. అయితే ఈ ఎంపికపై అభ్యర్థులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. కటాఫ్ మార్కుల ఆధారంగా కొందరికి మార్కులు వచ్చినా వారు మెయిన్స్‌కు ఎంపిక కాలేదని చెబుతున్నారు. ఎంపిక చేసినవారి మార్కుల వివరాలను రోస్టర్ వారీగా ఇవ్వాలని అడిగారు. ఏపీపీఎస్సీ అధికారులు పట్టించుకోకపోవడంతో ఆర్టీఐ ద్వారా సమాచారం కోరారు. అయితే అసలు ఆ వివరాలే తమ కార్యాలయంలో లేవంటూ ఏపీపీఎస్సీ ఇచ్చిన సమాధానం మరిన్ని అనుమానాలకు తావిస్తోంది. ఈ వివరాలు కమిషన్ వద్ద లేకపోతే ఇంకెక్కడ ఉంటాయని అభ్యర్థులు ప్రశ్నిస్తున్నారు. దీనిపై మంత్రి లోకేశ్‌కు కూడా వారు ఫిర్యాదు చేశారు.

వైసీపీకి కొత్త సలహాదారు

▸ పార్టీ నిర్మాణం, బలోపేతం కోసం ఆళ్ల మోహన సాయిదత్ నియామకం

▸ కీలక బాధ్యతల నుంచి సజ్జల అవుట్

▸ ఎన్నికల వ్యూహకర్త పీకే, రిషిరాజ్‌తో కటీఫ్

▸ తల్లి, చెల్లెలు ఏకంగా పార్టీకి దూరం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)



వైఎస్ జగన్‌తో ఆళ్ల మోహన సాయిదత్

సార్వత్రిక ఎన్నికలకు ముందు వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ఆ పార్టీ నేతలు సింహంతో పోల్చారు. జగన్ కూడా ఎందరు కలసి వచ్చినా తన వెంట్రుక కూడా పీకలేరంటూ బహిరంగ సమావేశాల్లో వ్యాఖ్యానించారు. ఎన్నికల్లో చిత్తుచిత్తుగా ఓడిపోయాక తత్వం బోధపడింది. ఇప్పుడు ఆయన పార్టీ నిర్మాణం, బలోపేతం కోసం సలహాదారు సేవలు అవసరమయ్యాయి. వైసీపీ నిర్మాణాత్మక సలహాదారుగా ఆళ్ల మోహన సాయిదత్‌ను నియమించినట్టు జగన్ అధికారికంగా ప్రకటించారు. పార్టీని స్థాపించక ముందో, స్థాపించిన తొలినాళ్లలోనో, తొలిసారి ఎన్నికల బరిలో దిగుతున్న సమయంలోనో నిర్మాణాత్మక సలహాదారులను నియమించుకోవడం రాజకీయ పార్టీలకు ఆనవాయితీ. కానీ వరుసగా ఉప ఎన్నికల్లో పోటీ చేయడంతో పాటు రెండుసార్లు సార్వత్రిక ఎన్నికలను ఎదుర్కొన్న పార్టీకి ఇప్పుడు కొత్తగా నిర్మాణాత్మక సలహాదారుడిని జగన్ నియమించడంపై సర్వత్రా విస్మయం వ్యక్తమవుతోంది.

ఒక్కొక్కరు దూరం...

జగన్ ఎవరినీ ఎక్కువ కాలం నమ్మరని ఆయనతో సన్నిహితంగా మెలిగినవారే చెబుతుంటారు. పార్టీ స్థాపించిన కొత్తలో జగన్ వెంట నడిచి, ఆయన జైలుకు వెళ్లిన సమయంలో ప్రజల్లో వైసీపీని బలోపేతం చేసిన తల్లి విజయలక్ష్మి, సోదరి షర్మిల సైతం పార్టీ నుంచి బయటకు వెళ్లిపోయారు. ఇక తొలి నుంచి జగన్‌ను నమ్ముకుని ఉన్న పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయసాయిరెడ్డిని రాజ్యసభకు పంపినా.. 2019లో అధికారంలోకి వచ్చాక పార్టీ కార్యకలాపాలకు దూరంగా పెట్టారు. పార్టీలో అంతా తానై వ్యవహరించేలా పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సజ్జల రామకృష్ణారెడ్డిని అందలం ఎక్కించారు. ప్రభుత్వ శాఖలేవైనా వాటిపై మాట్లాడే అధికారాన్ని మంత్రులకు కూడా లేకుండా సజ్జలకు కట్టబెట్టారు. సజ్జలతో పాటు ఆయన కుమారుడు భార్గవరెడ్డిని కూడా జగన్ అందలం ఎక్కించారు. వైసీపీ సోషల్ మీడియా ఇన్‌చార్జిగా నియమించారు. ఇప్పుడు వారిద్దరినీ జగన్ దూరం పెట్టారని పార్టీ నేతలు అంటున్నారు. ప్రతిపక్షనేతగా ఉన్నప్పుడు జగన్ పార్టీ నిర్మాణం, బలోపేతం కోసం ఐప్యాక్ ప్రశాంత్ కిశోర్ (పీకే)తో ఒప్పందం చేసుకున్నారు. 2019 ఎన్నికల్లో వైసీపీ విజయం సాధించి అధికారంలోకి వచ్చాక జగన్... ప్రశాంత్ కిశోర్‌ను దూరం పెట్టారు. ఐప్యాక్ టీమ్ రిషిరాజ్‌ను చేరదీశారు. 2024 ఎన్నికల్లో వైసీపీ చిత్తుచిత్తుగా ఓడిపోయాక రిషిరాజ్ టీమ్‌కు కూడా జగన్ ప్యాకప్ చెప్పేశారు.

నియంతృత్వ పోకడలు

సాధారణంగా రాజకీయ పార్టీలు గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకూ బలమైన నాయకత్వాన్ని తయారు చేసుకుంటాయి. ఇందుకోసం కార్యవర్గాన్ని నియమిస్తాయి. కార్యవర్గ సమావేశాలను నిర్వహించి మార్గదర్శకం చేయడంతో పాటు సలహాలూ సూచనలూ తీసుకుంటాయి. అయితే నియంతృత్వ పోకడలకు పోయే జగన్ ఏనాడూ ప్రజాస్వామ్య పద్ధతిలో పార్టీని నడపలేదన్న విమర్శలున్నాయి. తనను జీవితకాల అధ్యక్షుడిగా జగన్ ప్రకటన చేయించుకున్నారు. ఎన్నికల కమిషన్ నుంచి అభ్యంతరాలు రావడంతో ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాల్సి వచ్చింది. అధికారంలో ఉన్నప్పుడు వందలాది మందిని సలహాదారులుగా నియమించినా వారి నుంచి ఏనాడూ ఒక్క సలహా కూడా తీసుకోలేదు. ఎవరైనా సలహాలు ఇచ్చేందుకు ప్రయత్నిస్తే వారిని తొలగించేవారు. అలాంటిది ఇప్పుడు పార్టీకి ఓ సలహాదారుని నియమించారు. ఆయన మాటైనా వింటారా లేక గతంలోలా జగన్ వ్యవహరిస్తారా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆకస్మిక నియామకంపై పార్టీలో చర్చ జరుగుతోంది.

నన్ను ఎందుకు విచారిస్తామంటున్నారు?

▸ సీఐతో ఆదిమూలం కేసులో బాధిత మహిళ

▸ వైద్య పరీక్షలకూ అంగీకరించని వైనం

▸ ఇబ్బంది పెట్టవద్దని, హాజరు కాలేనని వెల్లడి

ముందు ఎమ్మెల్యేను అరెస్టు చేయండి

తిరుపతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): "నన్ను ఎందుకు విచారిస్తామంటున్నారు? నేను ఫిర్యాదు చేశా. ముందు ఎమ్మెల్యేని అరెస్టు చేయండి!" అంటూ తిరుపతి జిల్లా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలంపై లైంగిక వేధింపుల కేసు పెట్టిన తెలుగు మహిళ నాయకురాలు తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్‌లో సోమవారం హల్‌చల్ చేశారు. ఉదయం 11 గంటలకు ఆమె భర్తతో కలసి తిరుపతి ఈస్ట్ పోలీస్ స్టేషన్ చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్న సీఐ మహేశ్వర్‌రెడ్డిని కలిసి తనను ఎందుకు ఇబ్బంది పెడుతున్నారంటూ ప్రశ్నించారు. లైంగిక వేధింపుల కేసులో బాధితులకు వైద్య పరీక్షలు నిర్వహించడమనేది చట్టబద్ధమని సీఐ చెబుతున్నా ఆమె వినిపించుకోలేదు. వైద్య పరీక్షల పేరిట తనను ఇబ్బంది పెట్టవద్దని, తాను హాజరుకానని తేల్చి చెప్పారు. తనకు రాత్రి నుంచీ గుండెల్లో నొప్పిగా వుందని, వైద్య పరీక్షల కోసం చెన్నై వెళుతున్నానని తెలిపారు. అక్కడ వైద్య పరీక్షల అనంతరం అవసరమైతే సర్జరీ చేయించుకుంటానని చెప్పారు. ఆ తర్వాత తిరుపతి రుయాస్పత్రికి వైద్య పరీక్షలకు వస్తానన్నారు. తనను ఇబ్బంది పెట్టవద్దని, తనకు ఫోన్లు కూడా చేయవద్దని స్పష్టం చేశారు. తాను బాధితురాలిగా ఫిర్యాదు చేశానని, ఎమ్మెల్యేని అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. దీంతో సీఐ మహేశ్వర్‌రెడ్డి విషయాన్ని డీఎస్పీ వెంకటనారాయణ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన సూచన మేరకు సీఐ ఆమె నుంచి లిఖితపూర్వకంగా స్టేట్‌మెంట్ తీసుకున్నారు. ఆమె వెనుదిరిగే సమయానికి పలువురు మీడియా ప్రతినిధులు అక్కడికి చేరుకోవడంతో ఆమె మళ్లీ సీఐ చాంబర్‌లోకి వెళ్లిపోయారు. మీడియాతో మాట్లాడేందుకు అంగీకరించలేదు. తర్వాత ముఖానికి ముసుగు వేసుకుని, వాహనాన్ని స్టేషన్ ఆవరణలోకి రప్పించుకుని అందులో వెళ్లిపోయారు. కాగా.. గత గురువారం బాధిత మహిళ ఎమ్మెల్యేపై ఫిర్యాదు చేశాక మరుసటి రోజు పోలీసులు వైద్య పరీక్షలకు రుయాస్పత్రికి తీసుకెళ్లిన సందర్భంలో కూడా ఆమె వైద్య పరీక్షలకు అంగీకరించలేదు. వివరాల సేకరణకు కూడా సహకరించకపోవడంతో ఏంచేయాలో తోచక పోలీసు అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఉక్కు సీఎండీకి 'సెలవు'.. ఇన్‌చార్జి సీఎండీగా ఏకే బాగ్చికి బాధ్యతలు

విశాఖపట్నం, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): విశాఖ ఉక్కు కర్మాగారం (ఆర్ఐఎన్ఎల్) సీఎండీ అతుల్ భట్‌ను కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ సెలవుపై పంపించేసింది. వాస్తవానికి నవంబరు 30వ తేదీతో ఆయన పదవీకాలం ముగియనుంది. అయితే ఈలోగానే సెలవు పెట్టి వెళ్లిపోవాలని ఆదేశించింది. ప్రస్తుతం ప్రాజెక్ట్స్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్న అరుణ్ కంటి బాగ్చిని ఇన్‌చార్జి సీఎండీగా వ్యవహరించాలని సూచించింది. మరోవైపు.. కార్మిక సంఘాలు ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా రాస్తారోకోకు పిలుపునిచ్చాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ఉక్కు మంత్రిత్వశాఖ మంగళ, బుధవారాల్లో ఢిల్లీలో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసింది. ఈ సమావేశానికి కొత్త ఇన్‌చార్జి సీఎండీ బాగ్చిని, ఇతర డైరెక్టర్లను రావాలని ఆదేశించారు.

చంద్రబాబు మాజీ పీఏ శ్రీనివాస్‌పై సస్పెన్షన్ ఎత్తివేత

▸ తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని ఉత్తర్వులు

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు మాజీ పీఏ పి.శ్రీనివాస్‌పై సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జగన్ సీఎం అయ్యాక శ్రీనివాస్‌ను టార్గెట్ చేశారు. చంద్రబాబును ఎలాగైనా ఇరికించాలన్న లక్ష్యంతో ఆయనను ఇబ్బందులకు గురిచేశారు. తర్వాత శ్రీనివాస్ విదేశాలకు వెళ్లడంతో అయన్ను సస్పెండ్ చేశారు. ఇప్పుడు తాజాగా శ్రీనివాస్‌పై మోపిన అభియోగాలను ప్రభుత్వం ఉపసంహరించుకుంటూ, సస్పెన్షన్‌ను ఎత్తివేసింది. సస్పెన్షన్ కాలాన్ని కూడా ఉద్యోగ కాలంగా పరిగణించి, తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని సీఎస్ సోమవారం ఉత్తర్వులిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అసలైన విజేతలు

ఉన్నత శిఖరాలను చేరుకోవాలంటే ఏ క్రీడాకారుడైనా కష్టాలను అధిగమించాల్సిందే. కానీ, జీవితమే కష్టతరమై, అడుగడుగునా అవరోధాలు ఎదురైనా, ముందుకు సాగుతూ లక్ష్యాన్ని చేరుకుంటారు పారా అథ్లెట్లు. తమకున్న వైకల్యాన్ని అధిగమించి ఆటల్లో సత్తాచాటి వెలుగులోకి వస్తారు. అత్యుత్తమ క్రీడా వేదికపై పోటీపడి పతకాలతో మెరిసి దేశ పతాకాన్ని రెపరెపలాడిస్తారు. ఈసారి కూడా మన దివ్యాంగ క్రీడాకారులు పారాలింపిక్స్‌లో అద్భుత ప్రదర్శనతో అలరించి అసలైన విజేతలుగా నిలిచారు.

గత పన్నెండు రోజులుగా క్రీడాభిమానులను మురిపించి అందరిలోనూ స్ఫూర్తి నింపిన పారిస్ పారాలింపిక్స్‌కు ఆదివారంతో తెరపడింది. గత టోక్యో క్రీడల తరహాలోనే ఈసారి కూడా చైనా అత్యధికంగా 220 పతకాలు సాధించి ఆటల్లో తమ ఆధిపత్యాన్ని నిలబెట్టుకుంది. ఏకంగా 94 బంగారు పతకాలతో అగ్రస్థానంలో నిలిచింది. 49 స్వర్ణాలు సహా 124 పతకాలతో గ్రేట్ బ్రిటన్ ద్వితీయస్థానాన్ని అందుకోగా, 105 పతకాలతో అగ్రరాజ్యం అమెరికా తృతీయస్థానంతో సరిపెట్టుకుంది. ఆత్మవిశ్వాసమే ఆస్తిగా, పట్టుదలే పెట్టుబడిగా, అనుక్షణం తమ పోరాట పటిమతో భారత పారాలింపియన్లు పారిస్‌లో అబ్బురపరిచారు. కనీసం పాతిక పతకాలు లక్ష్యంగా పోటీపడిన మన అథ్లెట్లు, అంతకంటే ఓ నాలుగు ఎక్కువగానే సాధించారు. 12 క్రీడాంశాల్లో 84 మంది పోటీపడి, మొత్తం 29 పతకాలు దక్కించుకున్నారు. పతకాల పట్టికలో 18వ స్థానంలో నిలిచి భళా అనిపించారు. ఇందులో ఏడు స్వర్ణాలు, తొమ్మిది రజతాలు, పదమూడు కాంస్య పతకాలున్నాయి. భారత ఆటగాళ్లు పారా క్రీడల చరిత్రలోనే అత్యుత్తమంగా రాణించి అత్యధిక పతకాలను ఖాతాలో వేసుకున్నారు. ఇప్పటిదాకా జరిగిన పారాలింపిక్ క్రీడల్లో కలిపి భారత్ మొత్తం అరవై పతకాలు సాధిస్తే.. ఇందులో ఒక్క పారిస్‌లోనే దాదాపు సగం పతకాలు లభించడం విశేషం.

పుట్టుకతోనే వచ్చిన వైకల్యంతో ఒకరు, ఊహించని ప్రమాదం బారినపడి కాలు, చేయి కోల్పోయి మరొకరు.. ఇలా పారిస్ పారాలింపిక్స్‌లో తలపడి పతకాలు సాధించిన యోధుల్లో ఒక్కొక్కరిది ఒక్కో స్ఫూర్తిగాథ. రెండు చేతులూ లేకున్నా, కాలితోనే విల్లును ఎక్కుపెడుతూ, లక్ష్యం దిశగా బాణాన్ని సంధించడంలో దిట్ట జమ్మూ కశ్మీర్‌కు చెందిన 17 ఏళ్ల శీతల్ దేవి. ఆర్చరీ క్రీడ వ్యక్తిగత విభాగంలో విఫలమైనా, రాకేశ్ కుమార్‌తో కలిసి మిక్స్‌డ్ ఈవెంట్‌లో కంచు పతకం సాధించి వహ్వా అనిపించింది. పిన్నవయసులో పారాలింపిక్స్‌లో పతకం దక్కించుకున్న తొలి భారత ఆర్చర్‌గా ఘనత వహించింది. పదిహేనేళ్ల వయసులో జరిగిన రైలు ప్రమాదంలో కాలును కోల్పోయిన నితేశ్ కుమార్ విషాదం నుంచి కోలుకొని చదువుపై దృష్టి సారించాడు. ఐఐటీలో ఇంజనీరింగ్ సీటు దక్కించుకొన్న అతడు, పారాలింపిక్స్‌లో దేశ షట్లర్ల విజయాలతో స్ఫూర్తిపొంది బ్యాడ్మింటన్‌ను కెరీర్‌గా ఎంచుకున్నాడు. కృత్రిమ పాదం అమర్చుకొని పోటీలకు సిద్ధమైన అతడు నాలుగు పదుల వయసులో బంగారు పతకం గెలిచి తన కల నెరవేర్చుకున్నాడు. నీరజ్ చోప్రా స్ఫూర్తితో జావెలిన్ త్రో క్రీడను కెరీర్‌గా ఎంచుకున్న ఒంటికాలి వీరుడు సుమిత్ అంటిల్ వరుసగా రెండో పారాలింపిక్స్‌లోనూ చాంపియన్‌గా నిలిచి తనకు తిరుగులేదని నిరూపించుకున్నాడు. చిన్నప్పుడు కారు ప్రమాదంలో రెండు కాళ్లు చచ్చుబడిపోయినా జీవితంపై ఏమాత్రం ఆశలు కోల్పోని షూటర్ అవనీ లేఖారా వరుసగా రెండో పారాలింపిక్స్‌లో విజేతగా నిలిచి తన బుల్లెట్ పవరేంటో చూపించింది. తమకెదురైన అవమానాలనే సోపానాలుగా మలచుకుంటూ ముందుకుసాగిన పరుగుల రాణి ప్రీతి పాల్, పారిస్‌లో రెండు కాంస్య పతకాలతో చరిత్ర సృష్టించగా.. కంటిచూపు తక్కువున్నా, పట్టుదలతో పోరాడిన సిమ్రన్ శర్మ పతకంతో అదరగొట్టింది. కరెంట్ షాక్‌తో చిరుప్రాయంలోనే చూపు కోల్పోయిన జూడో స్టార్ కపిల్ పర్మార్ కాంస్యం నెగ్గాడు. షాట్‌పుట్‌లో కాంస్య పతకం అందుకున్న నాగాలాండ్‌కు చెందిన హోకాటో హోటోజి సెమా.. సైన్యంలో హవల్దార్‌గా విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో నియంత్రణ రేఖ వద్ద ఉగ్రవాదులు అమర్చిన ల్యాండ్‌మైన్ పేలుడులో ఎడమ కాలిని పోగొట్టుకున్నాడు. ఆత్మవిశ్వాసంతో పారా క్రీడల్లో ప్రవేశించి, విశ్వవేదికపై విజయఢంకా మోగించాడు. కొన్నాళ్లుగా అంతర్జాతీయ ఈవెంట్లలో రాణిస్తున్న వరంగల్ జిల్లాకు చెందిన దీప్తి జీవాంజి పారిస్ క్రీడల్లోనూ వెలుగులు విరజిమ్మింది. 400 మీటర్ల రేసులో కాంస్య పతకం సాధించి, ఒకప్పుడు తన మానసిక వైకల్యాన్ని చూసి వెక్కిరించిన వాళ్లతోనే ఇప్పుడు గర్వంగా జేజేలు పలికించుకుంది. అన్ని అవయవాలు సక్రమంగా ఉండి, అన్ని వనరులు అందుబాటులో ఉన్నప్పటికీ, నిరాశలో కుంగిపోతూ, జీవితాన్ని వృథా చేసుకుంటున్న ఎందరికో ఈ పారా యోధుల విజయగాథలు స్ఫూర్తిదాయకం.

ఆసియాకు అందేనా ఈ శతాబ్దం?

ఈ శతాబ్దం ఆసియాదే! ఏదో ఒక సందర్భంలో దీన్ని వినని వారే ఉండరు! 1750ల వరకూ జనాభాలోనే కాదు.. ప్రపంచ వస్తు, పంటల ఉత్పత్తిలో ఆసియాదే అగ్రభాగం! ఒకనాడు ప్రపంచ ఉత్పత్తిలో సగం కంటే ఎక్కువే వాటా కలిగిన ఆసియా ఖండం 1950ల వరకూ తీవ్ర దుస్థితిని ఎదుర్కొంది. దాదాపు 200 ఏళ్లకు పైగా ఆసియా తన పూర్వ వైభవాన్ని ఎందుకు కోల్పోయింది? ఆ తర్వాత ఆశించిన స్థాయిలో వేగంగా అడుగులు ఎందుకు వేయలేకపోయింది? ఇందుట్లో స్వయంకృతాపరాధాలెన్ని? బాహ్య ప్రమేయ అపరాధాలెన్ని? యాదృచ్ఛిక పరిణామాలెన్ని? అని ప్రశ్నించుకుంటే చాలా విషయాలను చెప్పుకోవచ్చు. గడచిన ముప్పయి ఏళ్లలో జరిగిన పరిశోధనలతో ఎన్నో అంశాలు వెలుగులోకి వచ్చాయి.

18వ శతాబ్దం విప్లవాలకు నిలయం. పారిశ్రామిక, అమెరికా, ఫ్రెంచ్ విప్లవాలతో పాటు అపూర్వ మేధో వికాసాలు ఆ శతాబ్దంలోనే జరిగాయి. దీన్ని దాటి వందల, వేల ఏళ్లు వెనక్కి వెళితే ఆసియా ఖండ ఘనచరిత్ర మనకు కనపడుతుంది. మానవ నాగరికతల అభివృద్ధిలో ఆసియాతో పోల్చదగినది ఏదీ లేదు. హిందూ, బౌద్ధ, క్రైస్తవ, ఇస్లాం లాంటి కోట్ల మంది అనుసరించే మతాలన్నీ ఇక్కడే పుట్టాయి. నదీ తీరాల్లో వెలిసిన తొలి నాగరికతలకూ ఇక్కడి నేలలే మూలం. ప్రపంచమంతా ప్రస్తుతం తినే అనేక ఆహార పదార్థాల ఎంపికా, ఉత్పత్తీ ఆసియాలోనే మొదలయ్యాయి. జంతువుల మచ్చికా ఇక్కడే ప్రారంభమైంది. రాజ్య వ్యవస్థలు ఉనికిలోకి వచ్చిందీ ఇక్కడే. అనేక విజ్ఞాన శాస్త్రాలు, సాంకేతిక పరిజ్ఞానాలు ఆసియాలోనే ఊపిరి పోసుకున్నాయి.

ఇదంతా గతం! మనమంతా గర్వించతగిన ఘనమైన గతం! మరి భవిష్యత్తు ఏమిటి? యూరపు వలస పాలనతో అన్నింటా అట్టడుగుకు వెళ్లిన ఆసియాకు పూర్వ ప్రాభవం వచ్చేస్తోందా? ఆసియా దేశాలు చేస్తున్న ఉత్పత్తులు, సృష్టిస్తున్న సంపదలను డబ్బుగా లెక్కకట్టి చూస్తే అది సాధ్యమే అనిపించినా... దారి పొడవునా ఎన్నో సమస్యలు.. ఎన్నో ముళ్లదారులు.. సరిహద్దుల సంఘర్షణలు.. మత వైషమ్యాలు.. సైద్ధాంతిక స్పర్ధలు.. జాత్యహంకార జాతీయవాదం విసురుతున్న సవాళ్లు.. వలసపాలన సృష్టించిన విపరీత కేంద్రీకృత పాలన.. ఇవన్నీ ఆసియా వాసుల మధ్య సంఘీభావానికీ సామరస్యానికీ ప్రతిబంధకాలు! క్రమేపీ అవి తొలగుతాయా? అసలు తామంతా ప్రగాఢ సంబంధాలతో కూడిన ఘనచరిత్ర కలిగిన ఆసియా ఖండ వారసులమన్న భావన ప్రజల్లో బలంగా ఎప్పుడైనా నాటుకుందా? అలా నాటుకునే పరిస్థితులు ఉన్నాయా? ఆసియా సమాజాల మధ్య సుదీర్ఘంగా కొనసాగిన ఇచ్చిపుచ్చుకునే సంస్కృతి ఇప్పటి పరిస్థితుల్లో సాధ్యమవుతుందా? పాశ్చాత్య దేశాల ఆధిపత్యం సడలిపోతున్న నేపథ్యంలో ఆసియా దేశాల మధ్య ఒకనాటి వలసపాలనకు వ్యతిరేకంగా తలెత్తిన భావైక్యతా ధోరణులలో మిగిలింది ఎంత? ఉన్నదాంట్లో ఇప్పటికీ అభివృద్ధి చేయగలిగిన దెంత? మతం, భాష, జాతి ఆధారంగా యూరపులో ఏర్పడిన జాతి రాజ్య (నేషన్ స్టేట్) భావన రగిల్చిన దారుణాలను దాటి.. భిన్న భాషలు, మతాలు, సంస్కృతులను అవలంబించే ప్రజలను సమాన పౌరులుగా చూసే దృష్టి ఆసియాలో మళ్లీ బలంగా వేళ్లూనుకుంటుందా? లేక మైనారిటీలను అణచివేసి ఏక జాతి ప్రాబల్య రాజ్యాలను స్థాపించిన యూరపు తరహా చరిత్ర ఆసియాలోనూ పునరావృతం అవుతోందా? ఈ ప్రశ్నలన్నీ ఎంతో కీలకమైనవి.

ఆసియాలో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా వీటికెలాంటి జవాబులు ఇవ్వగలమన్నదే గాక భవిష్యత్తు పరిణామాలను స్థూలంగా సూచిస్తూ... ప్రముఖ చరిత్రకారుడు సుగత బోస్ 'ఏషియా ఆఫ్టర్ యూరోప్' పేరుతో ఇటీవలే ఒక పుస్తకాన్ని వెలువరించారు. సుగత బోస్ అంతర్జాతీయంగా గుర్తింపు ఉన్న చరిత్రకారుడే కాదు... ప్రత్యక్ష రాజకీయాల్లోనూ అనుభవాన్ని గడించారు. తృణమూల్ కాంగ్రెస్ అభ్యర్థిగా లోక్‌సభకు (2014–2019) ఎన్నికయ్యారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ పెద్దన్నకు మనవడైన సుగతది బెంగాల్‌లో పేరున్న రాజకీయ కుటుంబం. సుగత బోస్ తల్లి కృష్ణబోస్ కూడా మూడుసార్లు లోక్‌సభకు ఎన్నికయ్యారు. క్రియాశీల రాజకీయాల్లో ఉండి తిరిగి చరిత్ర అధ్యాపకుడిగా, పరిశోధకుడిగా అమెరికాలో కృషిచేయటం రాజకీయాల్లో అరుదనే చెప్పాలి.





■ రాహుల్ కుమార్

ప్రపంచ వస్తుసేవల ఉత్పత్తిలో 1820ల నాటికి కూడా భారత్, చైనాల వాటా 50 శాతం ఉండేది. 1913 వచ్చే సరికి అది 18 శాతానికి పడిపోయింది. జపాన్ ఒక్కటే దీనికి కాస్త మినహాయింపు. ఆసియా అంతటా చవిచూసిన ఆ క్షీణత వ్యక్తుల ఆర్థిక పరిస్థితిపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. అంతకంటే ఎక్కువగా ఆసియా వాసులు అందరిలోనూ తీవ్ర ఆత్మన్యూనతకు కారణమైంది. యూరపు వాసులకంటే ఎంతో ప్రాచీన చరిత్రనూ నాగరికతనూ కలిగిన తమకెందుకీ దుస్థితి.. అన్న భావన ఆలోచనాపరులను కలచివేసింది. ఈ నేపథ్యం నుంచి ఆసియా దేశాల మధ్య ఐక్యత నెలకొనాలనే భావమే గాక, చారిత్రకంగా పెనవేసుకున్న వాణిజ్య బంధాలు, సంస్కృతుల్లోని సారూప్యతలపై మేధోమథనం మొదలైంది. 1904–1905 యుద్ధంలో రష్యాపై జపాన్ గెలవటం ఆసియాలో సృష్టించిన ప్రభావం అంతా ఇంతా కాదు. బాలగంగాధర్ తిలక్ మొదలుకుని ఎంతో మంది దాన్ని ఘనంగా స్వాగతించారు. ప్రత్యక్ష, పరోక్ష వలస పాలనతో ఆసియా వాసులు పోగొట్టుకున్నవన్నీ క్రమేపీ సాధించగలరన్న భరోసాని ఆ యుద్ధం ఎంతో కొంత కలగచేసింది. 1917 నాటి రష్యను విప్లవం జాతుల స్వయం నిర్ణయాధికారాన్ని ప్రకటించటం ఆసియా ప్రజలను బాగా ప్రభావితం చేసింది. వలసపాలనలో మగ్గుతున్న ప్రజలకు మార్క్సిస్టు ఆలోచన సామ్రాజ్యవాదంపై కొత్త చూపును కల్పించింది. 1890ల నుంచి 1950ల చివరి వరకూ ఆసియా–ఆఫ్రికాల మధ్య సంఘీభావం, స్నేహం, సహకారం కోరుకుంటూ... ఎన్నో చర్చలు, సమావేశాలు, పర్యటనలు ఎడతెరిపి లేకుండా సాగాయి. పరస్పరం ఇచ్చిపుచ్చుకునే సహకార దేశాల సమాహారంగా ఆసియా ఖండాన్ని ఊహించటం, భావించటం మొదలైంది. ఆ ఊహకూ, ఆ భావనకూ మూలాలను, వాటిని వినిపించిన నేతలు, మేధావులు, కళాకారుల కృషిని ప్రధానంగా సుగత బోస్ విశ్లేషించారు. ఈ మొత్తం పరిణామంలో.. ఆసియా ఆకాంక్షలకు భిన్నంగా జపాన్ సామ్రాజ్యవాద విధానంతో సమీప దేశాలను ఆక్రమించటం ఒక విపరీతంగానే మిగిలిపోయింది. రవీంద్రనాథ్ టాగోర్ అయితే .. యూరపు దేశాల గుడ్డి అనుకరణ ప్రభావానికి లోనై జపాన్ చేసిన దారుణంగా దాన్ని పరిగణించారు. జపాన్ నుంచి స్ఫూర్తి– విరక్తి రెండూ ఏకకాలంలో కలుగుతోందన్న భావాన్ని టాగోర్ వ్యక్తపరచారు.

1950ల నాటికి ఆసియాలోని చాలా దేశాలకు ప్రత్యక్ష వలసపాలన నుంచి విముక్తి కలిగింది. 1955లో ఇండొనేషియాలో బాండుంగ్ సమావేశంలో ఆసియా–ఆఫ్రికా దేశాలు పరస్పర సహకారం గురించి, పరోక్ష వలసపాలనను ఎదుర్కోవల్సిన అవసరాన్ని గురించి చాలా మాట్లాడాయి. ఆ తర్వాత కొద్దికాలానికే ఆసియా దేశాల మధ్య పొరపొచ్చాలు మొదలయ్యాయి. అమెరికా–రష్యాల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం విభేదాలను బాగా పెంచింది. వలసపాలకులు తమ అవసరాల కోసం ఆసియా దేశాల సరిహద్దులను అసంబద్ధంగా నిర్ణయించటం శాపమై భారత్–చైనాల మధ్య యుద్ధానికి కారణమైంది. జాతి ప్రయోజనాల పేరుతో.. వలసపాలకులు గీసిన పటాల్లో (మ్యాప్స్) నిర్దేశించిన సరిహద్దుల కోసం పట్టువిడుపుల్లేకుండా వ్యవహరించటం.. వలస పాలన వారసత్వంగా వచ్చిన విపరీత కేంద్రీకృత పాలనను యథాతథంగా స్వీకరించి మైనారిటీల ఆకాంక్షలనూ వెనుకబడిన ప్రాంతాలనూ విస్మరించటంతో చాలా చోట్ల ఏదో ఒక స్థాయిలో అంతర్యుద్ధాలు, యుద్ధాలు ఆసియా ఖండాన్ని కుదిపివేశాయి.

ఇదంతా ఎందుకు జరిగింది? ఆసియా ఐక్యభావన ఏమైపోయింది? పరస్పర సహకార భూమిగా ఆసియా ఖండాన్ని ఊహించటం కాల్పనిక భావనేనా? వాస్తవికతకు దూరమైన భావుకతగానే దీన్ని పరిగణించాలా? సుగత బోస్ అభిప్రాయం ప్రకారం అంతగా నిరాశపడాల్సిన అవసరం లేదు. రెండు ప్రపంచ యుద్ధాలకూ అంతకు ముందు మరెన్నో వినాశనాలకూ కారణమైన యూరపు రాజ్యాలు.. పరస్పరం సహకారానికి యూరోపు యూనియన్‌గా సంఘటితమై ముందుకు సాగుతున్న నేపథ్యంలో ఆసియా దేశాల మధ్య అలాంటి ఏర్పాటు ఎప్పటికీ సాధ్యం కాదని చెప్పేయలేం! ఉప్పునిప్పుగా ఉన్న భారత్–చైనా సంబంధాలకూ ఇదే వర్తిస్తుంది. అందుకు కావాల్సిన స్ఫూర్తిని.. ఆసియా మేధావులు, నాయకులు, సాహిత్యవేత్తలు, కళాకారులు చేసిన కృషి నుంచి ఎంతైనా పొందొచ్చు. దీనికి తోడు 1979 నుంచి ఆసియా దేశాల మధ్య వ్యాపార సంబంధాలు బాగా బలపడుతున్నాయి. ఆసియా అంతర్జాతీయ వాణిజ్యంలో 50 శాతానికి పైగా ఖండంలోని దేశాల మధ్యనే జరుగుతోంది.. భవిష్యత్తులో ఇదింకా పెరగనుంది. దీనికి భిన్నమైన మరొక పరిణామం కూడా జరుగుతోంది. అమెరికా, యూరపులు తమ చుట్టూ రకరకాల గోడలను కట్టుకుంటూ ఆసియా తాకిడిని అడ్డుకోటానికి ప్రయత్నిస్తున్నాయి. డొనాల్డ్ ట్రంప్ లాంటి నేతల వైఖరులే దీనికి నిదర్శనం.

ఆర్థిక శాస్త్రానికి ఆద్యుడైన ఆడమ్‌స్మిత్ 250 ఏళ్ల క్రితం భవిష్యత్తుకు సూచికగా ఒక వ్యాఖ్యానం చేశారు. విజేత యూరపు రాజ్యాలు, పరాజిత పాశ్చాత్యేతర రాజ్యాల మధ్య ఒకనాటికి రాజ్యాధికారపరంగా సమతూకం ఏర్పడుతుందనీ, అప్పుడు సమానత్వం ప్రాతిపదికగా ప్రపంచ మార్కెట్ పనిచేస్తుందని చెప్పటమే దాని పరమార్థం. ప్రత్యక్ష వలసపాలన సమసిపోయినా అదిప్పటికీ పూర్తిగా సాధ్యమైందని చెప్పలేం. బలహీన రాజ్యవ్యవస్థలు ఉన్నచోట పేద దేశాల వనరులను కొల్లగొట్టటం ఆగలేదు. జాతీయ ప్రయోజనాల పేరుతో చైనా ప్రదర్శిస్తున్న సామ్రాజ్యవాద పోకడలు, భారత్‌లో బలపడుతున్న ఏక మతాధిపత్య ఉన్మత్తత, పలుచోట్ల పెచ్చరిల్లుతున్న అతివాద ఇస్లాం రాజకీయాలు ఆసియా ఐక్య భావనకు ప్రమాదంగా మారాయి. 1800లకు ముందు ఆసియాలో ఏక కేంద్ర ఆధిపత్య నాగరికత లేదు. భిన్న కేంద్రాల నాగరికతల మధ్య ఇచ్చిపుచ్చుకోవటాలు ఉండేవి. ఒక రాజ్యం లోపల కూడా అధికారం భిన్నస్థాయిల్లో వికేంద్రీకరణగా ఉండేది. ఈ చారిత్రక వాస్తవాన్ని ఆసియా దేశాలు గ్రహించి అడుగులు వేస్తేనే 21వ శతాబ్దం సుహృద్భావ ఆసియా శతాబ్దంగా మారుతుంది. దానికి భిన్నంగా గుడ్డి అనుకరణ దృష్టితో యూరోపు మార్గం తొక్కితే రక్తసిక్త చరిత్ర పునరావృతం అవుతుంది!

(ఆంధ్రజ్యోతి ఎగ్జిక్యూటివ్ ఎడిటర్)

జాతీయ ప్రయోజనాల పేరుతో చైనా ప్రదర్శిస్తున్న సామ్రాజ్యవాద పోకడలు, భారత్‌లో బలపడుతున్న ఏక మతాధిపత్య ఉన్మత్తత, పలుచోట్ల పెచ్చరిల్లుతున్న అతివాద ఇస్లాం రాజకీయాలు ఆసియా ఐక్య భావనకు ప్రమాదంగా మారాయి. 1800లకు ముందు ఆసియాలో ఏక కేంద్ర ఆధిపత్య నాగరికత లేదు. భిన్న కేంద్రాల నాగరికతల మధ్య ఇచ్చిపుచ్చుకోవటాలు ఉండేవి. ఒక రాజ్యం లోపల కూడా అధికారం భిన్నస్థాయిల్లో వికేంద్రీకరణగా ఉండేది. ఈ చారిత్రక వాస్తవాన్ని ఆసియా దేశాలు గ్రహించి అడుగులు వేస్తేనే 21వ శతాబ్దం సుహృద్భావ ఆసియా శతాబ్దంగా మారుతుంది.

జిల్లాలవారీ వర్గీకరణ సరైన నిర్ణయం!

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో షెడ్యూల్డ్ కులాల్లోని మొత్తం 59 ఉపకులాలకు భారత రాజ్యాంగం ద్వారా కల్పించబడిన 15శాతం రిజర్వేషన్లను జనాభా ప్రాతిపదికన జిల్లాల వారీగా వర్గీకరణ చేయడమే సరైనది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు సరైన సమయంలో సరైన నిర్ణయాలు తీసుకుంటారన్న ఖ్యాతి ఉన్నది. ఈ సామాజిక సంస్కరణ కోణంలోనే ఎస్సీల్లోని అసమానతలను తొలగించాలంటే ఎస్సీ రిజర్వేషన్లను జిల్లా యూనిట్‌గా వర్గీకరణ చేయడమే మార్గమని చంద్రబాబు నాయుడు నిర్ణయించారు.

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) ముపె□ళ్ల పాటు చేసిన ఎన్నో పోరాటాల తర్వాత, భారత ప్రధాని మోదీ హామీతో ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ సుప్రీంకోర్టులో వేగంగా ముందుకు కదిలింది. ఇదే సమయంలో మందకృష్ణ మాదిగ విజ్ఞప్తి మేరకు తెలుగుదేశం పార్టీ అధినేతగా మాజీ ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబునాయుడు మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చేసి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అందువల్లనే మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని మాదిగలు 2024 సార్వత్రిక ఎన్నికల సందర్భంలో వాడవాడలా ఎన్డీఏ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం శ్రమించారు. ఎన్డీఏ గెలుపే మాదిగల గెలుపుని నినదించారు. ఎట్టకేలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అఖండ మెజారిటీతో విజయం సాధించింది. మళ్లీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం చిత్తూరు జిల్లా కుప్పంలో జరిగిన బహిరంగ సభలో చంద్రబాబునాయుడు ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి స్థాయిలో పునరుద్ఘాటించారు. ఎట్టకేలకు 2024 ఆగస్టు 1న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ఆధ్వర్యంలోని ఏడుగురు సభ్యులు గల రాజ్యాంగ ధర్మాసనం ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చేసే అధికారం రాష్ట్ర ప్రభుత్వాలకు ఉందని ఒక చారిత్రాత్మక తీర్పును వెల్లడించింది.



మాదిగల అభ్యున్నతి పట్ల తెలుగుదేశం పార్టీకి సానుకూల దృక్పథం ఉండడం వల్లనే నేడు సుప్రీంకోర్టు తీర్పును ఆహ్వానిస్తూ విద్య, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణ చేయడానికి ముందుకు వచ్చింది. ఈ మేరకు జిల్లాల యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న చంద్రబాబు నాయుడు నిర్ణయాన్ని మాదిగ, ఉప కులాలు వేనోళ్ల కొనియాడుతున్నాయి.

ఈ తీర్పు వెలువడిన నాడు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఉమ్మడి కర్నూలు జిల్లా శ్రీశైలంలో ఏర్పాటు చేయబడిన సభలో మాట్లాడుతూ ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని, జిల్లాల వారీగా వర్గీకరణ చేసి ఎస్సీలోని అన్ని ఉపకులాలకు సమన్యాయం చేస్తామని, గతంలోనే ఎస్సీ వర్గీకరణ చేసి ఎస్సీ ఉపకులాలకు సామాజిక న్యాయం చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే అంటూ సుప్రీంకోర్టు తీర్పుపై సానుకూలంగా స్పందించారు. ఆ తర్వాత జరిగిన తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సమావేశంలో కూడా ఎస్సీ వర్గీకరణ చేస్తామని తీర్మానం చేశారు. ఆగస్టు 15న భారత స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా అమరావతిలో జరిగిన సభలో కూడా ఎస్సీ వర్గీకరణకు కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. అయితే జిల్లాల యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేస్తామని చంద్రబాబునాయుడు హామీ ఇవ్వడంతో అనంతపురం జిల్లా మాదిగలు సంబరపడిపోతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోనే మాదిగలు అత్యధికంగా జనాభా కలిగిన జిల్లా అనంతపురం జిల్లా. అందువల్ల ఈ జిల్లాలో పేదరికం, వెనుకబాటుతనం, నిరుద్యోగిత ఎక్కువగా ఉంది. ఈ జిల్లాలో మాదిగలకు దాదాపు 12 శాతం రిజర్వేషన్లు రావడానికి అవకాశం ఉందని, మా బతుకులు బాగుపడిపోతాయని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా ప్రస్తుత ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీల జనాభా 16శాతం. అందులో మాలలు 7.5శాతం, మాదిగలు 6.5శాతం, రెల్లి, ఇతర ఉపకులాలు 2శాతం జనాభా కలిగి ఉన్నాయి. ఇందులో వర్గీకరణ కోరుతున్న కులాల జనాభా 9.5శాతం, వర్గీకరణను వ్యతిరేకిస్తున్న మాలల జనాభా 8.5శాతం మాత్రమే, అంతిమంగా ఎస్సీ వర్గీకరణ కోరుకుంటున్న కులాల జనాభానే 1 శాతం ఎక్కువ ఉంది.

తెలుగుదేశం పార్టీ ఆది నుండి మాదిగ సమాజానికి అండగా నిలుస్తూనే ఉంది. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో మాదిగ సామాజికవర్గానికి చెందిన మహేంద్రనాథ్‌ను ఆర్థికశాఖ మంత్రిగా చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే. అదేవిధంగా ఇదే తెలుగుదేశం పార్టీ ప్రస్తుతం రాష్ట్ర హోం మంత్రిగా మాదిగ సామాజిక వర్గానికి చెందిన వంగలపూడి అనిత పదవీ బాధ్యతలు చేపట్టారు. ప్రత్యేకంగా ఎస్సీల విద్యాభివృద్ధి కోసం ఎన్టీఆర్ విద్యోన్నతి పథకం, అంబేద్కర్ విదేశీ విద్యా పథకం లాంటి 27 పథకాలు అమలు చేసిన ఘనత తెలుగుదేశం పార్టీదే. మాదిగల అభ్యున్నతి పట్ల తెలుగుదేశం పార్టీకి సానుకూల దృక్పథం ఉండడం వల్లనే ఈనాడు సుప్రీంకోర్టు తీర్పును ఆహ్వానిస్తూ విద్య, ఉద్యోగ రంగాల్లో వర్గీకరణ చేయడానికి ముందుకు వచ్చింది. ఈ మేరకు జిల్లాల యూనిట్‌గా ఎస్సీ వర్గీకరణ చేస్తామన్న చంద్రబాబునాయుడు నిర్ణయాన్ని మాదిగ, ఉపకులాలు వేనోళ్ల కొనియాడుతున్నాయి.

● బండారు శంకర్
జాతీయ అదనపు ప్రధాన కార్యదర్శి,
మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎమ్ఇఎఫ్)

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై సదస్సు

గత నెలలో రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇచ్చిన తీర్పు యం.ఆర్.పి.ఎస్ చేసిన మూడు దశాబ్దాల ఉద్యమ పోరాట విజయం. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ రాజ్యాంగబద్ధమేనని ఈ తీర్పు స్పష్టం చేసింది. అయితే ఈ వర్గీకరణ ఎలా చేయాలనే అంశానికి సంబంధించి ఎలాంటి తీర్పూ ఇవ్వలేదు. మార్గదర్శకత్వం కూడా చేయలేదు. పైగా ఈ కేసుకు సంబంధంలేని అంశంలోకి వెళ్లి ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమిలేయర్ విధానాన్ని అమలు చేయాలని చెప్పింది. ఇది తీవ్ర అన్యాయమైనది. కుడిచేత్తో ఇచ్చి ఎడమచేత్తో లాగేసుకున్న చందంగా మొత్తం రిజర్వేషన్లకే ఎసరుపెట్టే మార్మికత ఈ తీర్పులో దాగి ఉంది. ఈ రిజర్వేషన్ల విషయంలో దేశవ్యాప్తంగా ఒక పాలసీని గైడ్ చేసి అమలు చేయమని కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాలను ఆదేశించాల్సిన సుప్రీంకోర్టు కేంద్రాన్ని మినహాయించి రాష్ట్రాలపైకి విభజన అమలును నెట్టడం అంటే కేంద్ర ప్రభుత్వ సంస్థలలో రిజర్వేషన్లను నిరాకరించడమే. ఇలా చేయడం తగదు. ఈ తీర్పు నేపథ్యంలో మరోమారు మాల సోదరులు వర్గీకరణ వ్యతిరేక పోరాటాన్ని కొనసాగించే అవకాశం ఉంది. డా. బాబాసాహెబ్ అంబేడ్కర్ బోధించిన సామాజిక న్యాయ సిద్ధాంతానికి లోబడి ఎటువంటి ప్రయత్నా□ ఆపాలి. మాదిగ సోదరులు కూడా సంయమనాన్ని పాటించాలి. ఇప్పటికైనా అన్ని వర్గాల మేధావులు, నాయకత్వాలు కూర్చొని ఒక న్యాయమైన పరిష్కారాన్ని రూపొందించుకోవాలి. ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణపై తీర్పును స్వాగతిస్తున్నాం. క్రీమిలేయర్ విధానాన్ని వ్యతిరేకిస్తున్నాం. కుల జన గణన చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆదేశించకపోవడాన్ని తప్పుబడుతున్నాం. ఈ సందర్భంగా నేటి మధ్యాహ్నం ఒంటిగంటకు దళిత మహాసభ ఆధ్వర్యంలో రాష్ట్ర సదస్సు జరగనున్నది. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం దొడ్డి కొమురయ్య హాల్‌లో బత్తుల వెంకన్న అధ్యక్షతన జరిగే ఈ సభకు సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఈశ్వరయ్య ముఖ్య అతిథి. ప్రొ. కాశీం, వైకె., డా. ఎం.ఎఫ్ గోపీనాథ్, సాదు మాల్యాద్రి ప్రధానవక్తలు.

—బహుజన మహాసభ రాష్ట్ర కమిటీ, తెలంగాణ

విపత్తులోనూ జగన్ విధ్వంసక రాజకీయం

నవంబర్ 19, 2021న అన్నమయ్య డ్యాం కొట్టుకుపోయింది. ఆ వరదలో 33 మంది ప్రాణాలు కోల్పోయారు. దాదాపు పది పల్లెలు మునిగిపోయాయి. వేలాదిగా ప్రజలు తమ ఇళ్లతో పాటు సర్వస్వం కోల్పోయారు. వేలాది ఎకరాల పొలాలు ఇసుక మేటలు వేసి పంటలు కోల్పోయారు. పశువులు, గొర్రెలు వరదల్లో కొట్టుకుపోయి జగన్‌రెడ్డి సొంత జిల్లా ప్రజలు దిక్కులేనివారయ్యారు. దీనికి బాధ్యులెవరు? అంతకు ముందు రోజు రాత్రి 11 గంటల ప్రాంతంలో కొట్టుకుపోయిన పింఛా డ్యాం వరద అన్నమయ్య డ్యాంలో పడడానికి 6 గంటలకు పైగా సమయం పట్టింది. ఈ వ్యవధిలో జగన్ ప్రభుత్వం, వాలంటీర్లు గ్రామస్థుల్ని తగు స్థాయిలో అప్రమత్తం చేయలేదు. పైగా నదిలో ఉన్న వైకాపా ఇసుక మాఫియా యంత్రాల్ని, లారీల్ని కాపాడుకోవడానికి అన్నమయ్య డ్యాం గేట్లు కూడా ఎత్తలేదు. దీంతో 33 మంది గ్రామస్థులు ప్రాణాలు కోల్పోయారు. వందలాది పశువులు, గొర్రెలు, ఇళ్ళల్లోని సర్వస్వం వరదపాలైంది.

అన్నమయ్య డ్యాం విపత్తు జరిగిన 13 రోజుల తర్వాత అంటే డిసెంబర్ 2న జగన్‌రెడ్డి బాధితుల పరామర్శకు పులపత్తూరుకు పరదాల మధ్య మొక్కుబడి పర్యటన చేశారు. కొట్టుకుపోయిన ఇళ్లకు బదులు మూడు నెలల్లో ఇళ్లు నిర్మించి తాళాలు బాధితుల చేతుల్లో పెడతామని హామీ ఇచ్చారు. మూడేళ్ల□ 40 ఇళ్లు మాత్రమే నిర్మించారు. మిగతా వందలాది వరద బాధితులు గుడిసెలు వేసుకుని పాముల మధ్య కాపురం చేస్తున్నారు. అప్పుచేసి బేస్మెంట్ వేసుకున్న బాధితులకు బిల్లులు ఇవ్వక మొండి చేయి చూపారు. ఇప్పటికీ పొలాల్లో ఇసుకమేటలు తీయలేదు. దీంతో బాధితులు హైకోర్టును ఆశ్రయించారు. చెయ్యేరుకు కాంక్రీట్ ప్రొటెక్షన్ వాల్ నిర్మిస్తామన్న హామీని జగన్ నెరవేర్చలేదు. మూడేళ్లయినా కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యామ్‌ను తిరిగి నిర్మించలేదు. సొంత జిల్లా ప్రజలకే ఎగనామం పెట్టిన జగన్‌రెడ్డి, విజయవాడ వరద సహాయక చర్యలపై నోరు పారేసుకుంటున్నారు. పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నారు. అన్నమయ్య బాధితులని చంద్రబాబు విపత్తు జరిగిన మూడు రోజులలోనే పరామర్శించారు. చనిపోయిన బాధిత కుటుంబాలకు ఎన్టీఆర్ ట్రస్టు నుండి నారా భువనేశ్వరి ద్వారా ఒక్కో కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున 48 లక్షలు ఆర్థిక సహాయం అందించారు. టిడిపి నేతలు, కార్యకర్తలు బాధితులకు పెద్ద ఎత్తున సహాయ కార్యక్రమాలు చేశారు.

బుడమేరు వరద బాధితులకు సాయం చేయడానికి జగన్‌కు చేతులు రాలేదు. ఆయన కేవలం కోటి ఇస్తానని ఒక ప్రకటన చేసి చేతులు దులుపుకున్నారు. సినిమా నటులు, దాతలు జగన్ కన్నా పెద్ద మొత్తంలో బాధితులకు సహాయం చేశారు. ఆయన సహాయం చేయకపోగా, బెంగుళూరులో కూర్చుని, నిద్రాహారాలు మాని పనిచేస్తున్న చంద్రబాబుపై బురద జల్లుతున్నారు. బుడమేరు ప్రజల రక్షణ నిమిత్తం చంద్రబాబు ప్రభుత్వం రూ.220 కోట్లతో కాంట్రాక్టుకు పనులు అప్పగించగా.. జగన్ ఆ పనులను నిలిపివేశారు. ఆ పనులు జరిగి ఉంటే నేడు ఈ విపత్తు జరిగేది కాదు. బుడమేరు పాపం జగన్‌రెడ్డిదే. ఆ దుర్మార్గాన్ని కప్పిపుచ్చుకోవడానికి అబద్ధాలు చెబుతున్నారు. వెలగలేరు నుంచి వరద కృష్ణా నదిలో కలిసే స్థితి లేదు. కృష్ణా నది వరద ఎగతన్నింది. బుడమేరు ఆ వరద తీసుకొనే స్థితి లేదనేది వాస్తవం. వెలగలేరు గేట్లు ఎత్తకపోతే పై గ్రామాలు, ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంట్ పూర్తిగా దెబ్బతినేవి. అన్నమయ్య డ్యాం లాగా మొత్తం వెలగలేరు డ్యామ్ కొట్టుకుపోయి పెద్దఎత్తున విజయవాడలో ప్రాణ నష్టం జరిగేది. బుడమేరును వైసీపీ మంత్రులు, నేతలు దురాక్రమణ చేశారు. కాంట్రాక్టు పనులు నిలిపేశారు. ఈ రెండు కారణాల వల్ల విజయవాడ సగం మునిగిపోయింది. వెంటనే చంద్రబాబు క్షేత్రస్థాయికి మకాం మార్చి అక్కడే ఉంటూ ప్రభుత్వ యంత్రాంగాన్ని, ఎన్డీఏ పార్టీల యంత్రాంగాన్ని, కేంద్రాన్ని, స్వచ్ఛంద సంస్థల్ని, సైన్యాన్ని, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్‌లను కదిలించి ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించగలిగారు. త్వరగానే బాధితులకు ఎక్కువ భాగం రిలీఫ్ అందించారు. 1.10 లక్షల కుటుంబాలకు నిత్యావసర సరుకులు అందించడం రికార్డు. అలాగే 97 లక్షల మందికి భోజనాలు, 94 లక్షల వాటర్ బాటిల్స్ పంపిణీ, 28 లక్షల లీటర్ల పాలు సరఫరా, 41 లక్షల బిస్కెట్స్ పాకెట్స్, 163 మెట్రిక్ టన్నుల కూరగాయలు, 2,090 ట్రిప్పుల వాటర్ ట్యాంకర్స్, ఫైరింజన్ల ద్వారా 27 వేల ఇళ్లు క్లీనింగ్ చేయడం దేశానికే ఆదర్శం. ఈ యజ్ఞంలో సీఎం చంద్రబాబు, నారా లోకేష్‌తో పాటు 11 మంది ఎన్డీయే మంత్రులు, 36 మంది ఎమ్మెల్యేలు, టీడీపీ డివిజన్, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌ఛార్జ్‌లు 1,700 మందితో పాటు వేలమంది కార్యకర్తలు నిద్రాహారాలు మాని సహాయక చర్యలు చేస్తున్నారు.

ప్రజలు ఎక్కడ ఆపదలో ఉంటే వెంటనే అక్కడ ఉండడం చంద్రన్న స్వభావం. జగన్ తాడేపల్లి లేదా బెంగుళూరు ప్యాలెస్‌లకు పరిమితం అవుతారు. జగన్ తన దుర్మార్గాల్ని కప్పిపుచ్చుకోవడానికి... సీఎం క్షేత్రస్థాయికి వెళితే పనులకు ఆటంకం కలుగుతుందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. బుడమేరు పాపం జగన్‌రెడ్డిదే. బుడమేరును వైసీపీ మంత్రులు, నేతలు దురాక్రమణ చేశారు. కాంట్రాక్టు పనులు నిలిపేశారు. వారి చర్యలవల్లనే విజయవాడ సగం మునిగిపోయింది.



ప్రకాశం బ్యారేజీలో వరద సమయంలోనే 17 టన్నుల బరువు గల 3 కౌంటర్ వెయిట్ బార్లను యుద్ధప్రాతిపదికన ఏర్పాటు చేయించారు. వర్షంలోనే బుడమేరుకు ఏర్పడ్డ మూడు గండ్లను పూడ్చించారు. వరద నష్టాన్ని అంచనా వేయించి రూ.6,800 కోట్ల కేంద్ర సహాయం కోరారు. కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ వరద ప్రాంతాల్లో పర్యటించారు. వైసీపీ జెండా రంగులు కలిగిన 3 పెద్ద ఐరన్ పడవలను ఒకటిగా ఇనుప గొలుసులతో కట్టి ప్రకాశం బ్యారేజీని ఢీ కొట్టించారు. దీంతో కౌంటర్ వెయిట్‌లు పగిలిపోయాయి. ఆ పెద్ద ఇనుప పడవలు గేటు దిమ్మెలను ఢీ కొట్టి ఉంటే ప్రకాశం బ్యారేజ్ గల్లంతయ్యి పెను ఉపద్రవం జరిగి ఉండేది. ఈ కుట్రపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి విచారణ చేయిస్తున్నారు. ప్రతి ఇంటికి 25 కేజీల బియ్యం, రెండు కేజీల బంగాళాదుంపలు, రెండు కేజీల కందిపప్పు, ఒక కేజీ చక్కెర, ఒక లీటర్ పామాయిల్, బిస్కెట్లు వరద బాధితులకు చంద్రన్న ప్రభుత్వం అందించింది. ఉండవల్లి ఇల్లు మునిగిపోతుంది కాబట్టి చంద్రబాబు విజయవాడకు మకాం మార్చారని జగన్ పచ్చి అబద్ధాలు చెప్పారు. నేడే కాదు హుదుహుద్ తుఫాన్ సమయంలో విశాఖలో 9 రోజులు మకాం వేశారు. కోనసీమ తుఫాన్ సందర్భంగా రాజమండ్రిలో మకాం వేసి చంద్రన్న బాధితులను ఆదుకున్నది నిజం కాదా? ప్రజలు ఎక్కడ ఆపదలో ఉంటే వెంటనే అక్కడ చంద్రన్న ఉండడం ఆయన స్వభావం. జగన్ తాడేపల్లి లేదా బెంగుళూరు ప్యాలెస్‌లకు పరిమితం అవుతారు. తన దుర్మార్గాల్ని కప్పిపుచ్చుకోవడానికి... సీఎం క్షేత్రస్థాయికి వెళితే పనులకు ఆటంకం అంటూ జగన్ తప్పుడు సిద్ధాంతాలు చెబుతున్నారు. జగన్ క్షేత్రస్థాయిలో ఉండకుండా గాలిలో హెలికాప్టర్లలో తిరిగినప్పుడు గోదావరి వరదల్లో, అన్నమయ్య డ్యాం వరద సహాయ చర్యలు ఎందుకు వైఫల్యం చెందాయి? నాయకుడు ముందుండి జట్టును విజయం వైపు నడిపించడం నేటి నాయకత్వం కళ. స్మార్ట్, హార్డ్ వర్క్ చంద్రబాబు ప్రత్యేకత. అందుచేతనే 17 మంది ఏపీ సీఎంలలో చంద్రబాబు ఒక్కరే 14 ఏళ్లు సీఎంగా ఉండగలిగారు. చంద్రబాబు నాయకత్వ విధానమే అడ్వాన్స్‌డ్ లీడర్‌షిప్ మోడల్.

జగన్ ఐదేళ్ల తన పాలనా దుర్మార్గాల్ని కప్పిపుచ్చుకోవడానికి చంద్రబాబుపై పచ్చి అబద్ధాలు చెబుతూ ప్రజల్ని మోసగించే పనులు చేస్తున్నారు. అవినీతి, అబద్ధాలు, నేరాలు, కుట్రలు, విద్వేష రాజకీయాలు ఎల్లకాలం సాగవని, ప్రజలు ఎక్కువ కాలం మోసపోరని వాస్తవం తెలుసుకుని జగన్ తన తీరు మార్చుకోవాలి.



■ పల్లా శ్రీనివాస్ యాదవ్
రాష్ట్ర అధ్యక్షులు, తెలుగుదేశం పార్టీ



చెప్పుకోలేని కష్టం : వైఎస్సార్ కాలనీలో ఓ చెప్పుల దుకాణంలో ఇలా..



ముంచెత్తగా..: ఇళ్లలో పనికిరాకుండా పోయిన వస్తువులను లారీకి ఎక్కిస్తున్న పారిశుధ్య సిబ్బంది

వరద నీరు వెనక్కి తగ్గుతున్నా.. కన్నీరు మాత్రం ఇంకా ఏరులై ఎగసిపడుతూనే ఉంది. ఎవరినీ కదిలించినా కష్టాల కథలు, వరద మిగిల్చిన వ్యథలే వినిపిస్తున్నాయి. ఇన్నాళ్లూ ప్రాణాలు గుప్పెట పట్టి బతికిన వారంతా.. గుండెలు నిండిన కష్టంతో గూడులోకి అడుగు పెడుతున్నారు. అస్తవ్యస్తమైన ఇళ్లను చూసి గుండెలవిసేలా విలపిస్తున్నారు. దేవుడా.. ఏమిటీ కష్టమంటూ రోదిస్తున్నారు.



చెర వీడేనా..? : ఇంకా ముంపులోనే అంబాపురం

విలవిలా..

వరద మిగిల్చిన కన్నీటి కథలు



దిశానిర్దేశం : చనమోలు ఫ్లై ఓవర్ నుంచి అధికారులకు ఆదేశాలు ఇస్తున్న సీఎం చంద్రబాబు

ఎన్యుమరేషన్ ప్రారంభం

విజయవాడ, ఆంధ్రజ్యోతి : వరద నష్ట అంచనాకు సంబంధించిన ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. ఫ్లడ్ ఎన్యుమరేషన్ మొదలైంది. ఇందుకు వీలుగా ప్రభుత్వం మొబైల్ అప్లికేషన్‌ను అభివృద్ధి చేసింది. ఈ యాప్‌లోనే వివరాలు నమోదు చేస్తున్నారు. సింగ్‌నగర్ ప్రాంతంలో సోమవారం ట్రయల్ ఎన్యుమరేషన్ జరిగింది. మంగళవారం నుంచి ఉధృతంగా జరగనుంది.



కదలదు.. వదలదు.. : వైఎస్సార్ కాలనీలో నిలిచి ఉన్న వరద నీరు



వ్యూ.. : కొండపల్లి ఖిల్లా నుంచి బుడమేరు

నగరంలో తగ్గుతున్న వరద

ఇంటిముఖం పడుతున్న బాధితులు

రూపురేఖలు మారిపోయిన ఇళ్లు

భారీగా పేరుకుపోయిన బురద

ఇంటి పరిస్థితి చూసి కన్నీటిపర్యంతం

సామాన్లన్నీ అస్తవ్యస్తం..

పనికిరాకుండాపోయిన ఎలక్ట్రిక్ వస్తువులు



స్ప్రే : డ్రోన్‌తో రసాయనాలు పిచికారీ

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : బుడమేరు వరద ముంచెత్తడంతో అజిత్‌సింగ్‌నగర్, పాయకాపురం, వాంబేకాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లోని వారంతా ఇళ్లకు చేరుతున్నారు. దాదాపు వారంపాటు నరకయాతన అనుభవించిన వారంతా ఇంటిముఖం చూస్తున్నారు. అజిత్‌సింగ్‌నగర్, వాంబేకాలనీ, రాజీవ్‌నగర్, డాబాకొట్ల సెంటర్, పైపులరోడ్డు ప్రాంతాల్లో వరద నీరు పూర్తిగా తగ్గుముఖం పట్టింది. వీధుల్లో మాత్రం పాదాలకు తగిలేలా నీరు నిలిచి ఉంది. దీంతో సోమవారం చాలామంది తమ ఇళ్లను శుభ్రం చేసుకున్నారు. వరద రాకతో సొంతూర్లకు వెళ్లినవారంతా వెనుదిరుగుతున్నారు. అలాగే, బంధువుల ఇళ్ల వద్ద, పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారు తమ ఇంటికి చేరుకుంటున్నారు. పూర్తిగా బురదమయంగా మారిన ఇళ్లను చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు.

అమ్మో దొంగలు

వరద ముంపు ప్రాంతాల్లో దొంగలు చెలరేగిపోతున్నారు. బాధితులకు సహాయక చర్యలు చేస్తున్నట్టు బయల్దేరి తాళాలు వేసి ఉన్న ఇళ్లలో చోరీలు చేస్తున్నారు. చాలాచోట్ల బంగారం, నగదు, విలువైన వస్తువులను కాజేశారు. చోరీల భయంతో చాలామంది బాధితులు ఇళ్లకు వచ్చేస్తున్నారు. పోలీసు కమిషనరేట్ పరిధిలోని పోలీసులంతా పూర్తిగా వరద సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. పోలీసులు ఎక్కడికక్కడ బిజీగా ఉండటంతో దొంగలు చేతివాటం చూపిస్తున్నారు. ఇళ్ల బురదలో ఉన్నా కనిపించిన వస్తువులను మాయం చేస్తున్నారు. ప్రస్తుతానికి బాధితులెవరూ పోలీసులను ఆశ్రయించకపోయినప్పటికీ ముందుందు ఫిర్యాదులు వచ్చే అవకాశాలున్నాయి.

బురద బురద

వరద ప్రాంతాల్లో నష్టాన్ని అంచనా వేయడానికి ప్రభుత్వం సోమవారం ఎన్యుమరేషన్ మొదలుపెట్టింది. దీంతో బాధితులు ఆగమేఘాలపై ఇళ్లకు చేరుకుంటున్నారు. ఇప్పటికే అగ్నిమాపక శాఖ బురదతో ఉన్న ఇళ్లను శుభ్రం చేసే పనులు ప్రారంభించింది. కొంతమంది బాధితులు స్వయంగా వారే ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. ఒక్కో ఇంట్లో సుమారు రూ.లక్ష నుంచి రూ.రెండు లక్షల వరకు నష్టం జరిగిందని బాధితులు చెబుతున్నారు. విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించారు.

నిలకడగా..

- దిగువ ప్రాంతాల్లో తగ్గుతున్న వరద
- నాగాయలంక మండలంలో ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, కలెక్టర్ పర్యటన

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : కృష్ణాజిల్లాలో వరద నిలకడగా కొనసాగుతోంది. సోమవారం వర్షం కురవకపోవడంతో రైతులు కొంతమేర ఊపిరి పీల్చుకున్నారు. వారం రోజులుగా వరి నీటిలోనే మునిగి ఉండటంతో కుళ్లిపోయే పరిస్థితికి చేరుకుంది. కాగా, పులిగడ్డ ఆక్విడెక్టును అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, కలెక్టర్ బాలాజీ సోమవారం పరిశీలించారు. నాగాయలంక మండలంలో కొట్టుకుపోయిన గొల్లమంద-జింకపాలెం రహదారిని పరిశీలించారు.

తగ్గుముఖం

కృష్ణానదికి వరద ఉధృతి కొంతమేర తగ్గుముఖం పట్టింది. ప్రకాశం బ్యారేజీ నుంచి సముద్రంలోకి ఆదివారం 4,28,322 క్యూసెక్కుల నీటిని విడుదల చేయగా, సోమవారానికి 3 లక్షల క్యూసెక్కులు విడుదల చేశారు. నందివాడ మండలంలోని అన్ని గ్రామాల్లో వరదనీరు నిలకడగా కొనసాగుతోంది. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు రుద్రపాక, తమిరిశ తదితర గ్రామాల్లో పర్యటించారు. బాపులపాడు మండలం రామన్నగూడెం, రంగయ్య అప్పారావుపేట, ఓగిరాల గ్రామాల్లో వరద ఉధృతి తగ్గలేదు. హనుమాన్ జంక్షన్ నుంచి గుడివాడ వెళ్లే రహదారిపై అరుగొలను వద్ద బుడమేరు మూడడుగుల మేర ప్రవహిస్తుండటంతో రాకపోకలు నిలిపివేశారు. ఉంగుటూరు మండలంలో వరద ఉధృతి తగ్గుముఖం పడుతోంది. మండలంలోని ముక్కపాడు, కొయ్యగూరపాడు, ఆముదాలపల్లి, ఎలుకపాడు, వేంపాడు గ్రామాల్లోని ఇళ్లు, వరిపైరు ఇంకా వరద నీటిలోనే ఉన్నాయి. పెదపారుపూడి మండలంలో పంటకాల్వలకు నీటిని తగ్గించడంతో పొలాలు ఇప్పుడిప్పుడే బయటపడుతున్నాయి.

రేపు కేంద్రబృందం రాక

కేంద్రబృందం బుధవారం జిల్లాలో పర్యటించి, వరద నష్టాన్ని అంచనా వేస్తుందని కలెక్టర్ బాలాజీ తెలిపారు. కలెక్టరేట్‌లోని మినీ సమావేశపు హాల్లో జిల్లా అధికారులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి వరి పొలాలు, చేపలు, రొయ్యల చెరువులను కేంద్రబృందం పరిశీలిస్తుందన్నారు. జిల్లాలో జరిగిన నష్టాన్ని పవర్‌పాయింట్ ప్రజెంటేషన్, ఫొటో ఎగ్జిబిషన్ ద్వారా వివరించేందుకు పూర్తిస్థాయి నివేదికను తయారు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

● జలజలా..



కొండపల్లి ఖిల్లాపై జలపాతం సోయగాలు



అస్తవ్యస్తం : వైఎస్సార్ కాలనీలో దారుణంగా దారులు



వరదపాలు : పాయకాపురంలో బియ్యం షాపులో పాడైన బియ్యం



బు..రొద : లూనా సెంటర్‌లో ఇల్లు శుభ్రం చేస్తూ..



అద్దెదారుల కష్టాలు

ఇంకా భయంతోనే బతుకుతున్న అద్దెదారులు

- అందరివీ రెక్కాడితే కానీ డొక్కాడని బతుకులు
- దగ్గర్లో బంధువులు లేక.. పునరావాసాలకు వెళ్లలేక..
- ఇంకా వరదలోనే 25 వేల మంది

ప్రభుత్వ సాయంతోనే జీవనం

చేతిలో డబ్బులేక..

చేతిలో డబ్బులు లేకపోవటం వల్ల కుటుంబ సభ్యులతో కలిసి ఇంట్లోనే ఉండిపోయాను. స్థానికుల సాయంతో పక్కనే ఉన్న ఓ బిల్డింగ్‌లోకి వెళ్లి తలదాచుకున్నాం. రోజువారీ కూలి చేసుకుంటేనే డబ్బులొస్తాయి. **- కె.రాజేందర్, సుందరయ్యనగర్**

బయటకు రాలేకపోయాం..

వరద నీరు ఎక్కువగా రావటం వల్ల అంబాపురం నుంచి బయటకు రాలేకపోయాను. అద్దెకు ఉంటున్న ఇల్లు మొదటి అంతస్థులో కుటుంబ సభ్యులతో కలిసి ఉండిపోయాను. మేము ఉంటున్న ఇంటి యజమాని సహాయం చేశాడు. అంబాపురం బాధితులకు ప్రభుత్వ సాయం అందలేదు. **- కె.సాంబశివరావు, అంబాపురం**

బంధువులెవరూ లేరు

విజయవాడలో మాకు బంధువులెవరూ లేరు. ఎక్కడికి వెళ్లాలో తెలియక పక్కింట్లో ఉంటున్నాం. మూడు రోజుల తరువాత నుంచి ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థల తరఫున భోజనం, వాటర్ బాటిళ్లు అందుతున్నాయి. **- వై.వెంకటేశ్వర్లు, వాంబేకాలనీ**

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్) : రెక్కాడితే కానీ, డొక్కాడని బతుకులు వారివి. అద్దెలు తక్కువన్న కారణంతో బుడమేరు పరివాహక ప్రాంతంలోని కాలనీల్లో నివాసముంటున్నారు. వరద తగ్గుముఖం పడుతున్నా.. పునరావాస కేంద్రాలకు కానీ, బంధువుల ఇళ్లకు కానీ వెళ్లకుండా ఇంకా బిక్కుబిక్కుమంటూనే జీవిస్తున్నారు. జక్కంపూడి, కండ్రిక, అంబాపురం, ఆంధ్రప్రభ కాలనీ (ఎగువ), రాజీవ్‌నగర్, వాంబేకాలనీల్లో ఇంకా మోకాలు లోతు నుంచి నడుము లోతు వరకూ వరద నీరుంది. ఈ ప్రాంతాల్లో ఇంకా 50 వేల మంది ప్రజలు నివసిస్తున్నారు. వీరిలో దాదాపు సగంమంది అద్దెకు ఉంటున్నవారే. వీరందరిదీ రోజువారీ జీవనవిధానమే. జక్కంపూడిలో దాదాపు రోజువారీ కూలీలే కాగా, కండ్రిక వంటి ప్రాంతాల్లో ఆటోవాలాలు, చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకునే వారున్నారు. ఇక వాంబేకాలనీలో మూడొంతుల మంది ఉపాధి కూలీలే. వీరిలో చాలామంది వన్‌టౌన్‌లోని ట్రేడర్లు, మర్చంట్లు, హోల్‌సేల్, రిటైల్ దుకాణాల్లో పనిచేస్తున్నారు. అలాగే, రాజీవ్‌గాంధీ హోల్‌సేల్ మార్కెట్, కూరగాయల మార్కెట్, పూలు, పండ్ల మార్కెట్‌తో పాటు గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్‌లో ఉపాధి పనులు చేస్తుంటారు. ఎక్కువ భాగం ముఠా కార్మికులే. రాజీవ్‌నగర్‌లో అన్నివర్గాల వారున్నారు. ఈ ప్రాంతంలో ప్రభుత్వ ఉద్యోగులు కూడా ఉన్నారు. వీరంతా బయట హోటళ్లలోనూ, బంధువుల ఇళ్లలోనూ ఉంటున్నారు. పీఎన్‌బీఎస్, రైల్వేస్టేషన్, కాళేశ్వరరావు మార్కెట్, కృష్ణవేణి క్లాత్ మార్కెట్, వన్‌టౌన్‌లోని క్లాత్ మార్కెట్లలో హమాలీలు, చిరువ్యాపారులు ఉన్నారు. వీరిలో చాలామందికి నగరంలో బంధువులు లేరు. కొంతమంది దూరప్రాంతంలో ఉన్నా సంబంధాలు పూర్తిగా తెగిపోయాయి. ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు ఇస్తున్న ఆహారంతోనే పొట్ట నింపుకొంటున్నారు. అయితే, ఎక్కువ రోజులు వరదలో ఉంటే రోగాల బారిన పడే అవకాశం ఉంది. కాబట్టి వారిని అక్కడి నుంచి తరలించే ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది.



6G టెక్నాలజీ భారత్ సంసిద్ధత

కొన్ని ఆవిష్కరణలు ప్రపంచ గతినే మార్చివేస్తాయి. అలాంటి ఆవిష్కరణలుగా నిప్పు, చక్రం, ఆవిరి యంత్రాలు, కరెంటు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి వాటిని పేర్కొనవచ్చు. అయితే ఈ ఆవిష్కరణలు పనిలో మానవ ప్రమేయాన్ని తగ్గిస్తూ వచ్చాయి. కానీ మరో అయిదారేళ్లలో అందుబాటులోకి రాబోతున్న 6జీ టెక్నాలజీ పనిలో మానవ ప్రమేయాన్ని ఆసాంతం తగ్గించనుంది. ప్రస్తుత 5జీ టెక్నాలజీ మానవ-రోబో సమన్వయంతో పనులు చక్కబెట్టడానికి వీలుకల్పిస్తుండగా, రాబోతున్న 6జీ టెక్నాలజీ కృత్రిమ మేధకు మరింత వేగాన్ని అందించి అనేక రంగాల్లో మానవ ప్రమేయాన్ని దాదాపు శూన్యం చేయనుంది. ఉదాహరణకు స్వయంచోదక వాహనాలు(డ్రైవర్‌లెస్ కార్లు)ను చెప్పుకోవచ్చు.

- ఈ అధునాతన 6జీ సాంకేతికతను అందిపుచ్చుకుని అందరికన్నా ముందుగా ప్రపంచ విపణిలో మార్కెట్ అవకాశాలను కొల్లగొట్టడానికి ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో భారత్ కూడా రంగంలోకి దిగింది. 2030 నాటికల్లా 6జీ టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి గల సాధ్యాసాధ్యాల పరిశీలన, సూచనల నిమిత్తం ఎ.కె.తివారీ అధ్యక్షతన ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది.
- తదనంతరం '6 మూలస్తంభాల వ్యూహంతో 6జీ విజన్'ను తదుపరి '6జీ మిషన్'ను భారత టెలీ కమ్యూనికేషన్స్ శాఖ ప్రవేశపెట్టడమే కాక అంతర్జాతీయ పరస్పర సహకారం నివిత్తం భారత్ 6జీ అలయెన్స్(బీ6జీఏ)ను కూడా ఏర్పాటు చేసింది. ఈవిధమైన కార్యాచరణల నేపథ్యంలో అసలు 6జీ టెక్నాలజీ అంటే ఏమిటి? ప్రస్తుత తరం 5జీ టెక్నాలజీతో పోల్చిన ఏవిధంగా మెరుగైనది? 6జీ సాంకేతికత కోసం జాతీయంగా అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రయత్నాలేమిటి? అన్న కోణంలో పరిశీలన జరపాల్సి ఉంది.

6జీ అంటే?

- వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీని దాని పరిణామ క్రమం ఆధారంగా వివిధ జనరేషన్లుగా విభజించి పేర్కొంటారు. ఈవిధంగా ఇప్పటివరకూ 1 నుంచి 5 తరాలు అందుబాటులోకి రాగా, మరింత అభివృద్ధి చెందిన తరంగా రాబోతున్న తదుపరి తరాన్ని 6వ తరం గా పేర్కొంటున్నారు.

5జీతో పోల్చితే 6జీ ఏవిధంగా మెరుగైనది?

- వేగపరంగా 5జీ ఒక మిల్లీ సెకన్(1000 మైక్రో సెకన్లు)లో 20 గిగాబైట్ల డేటాను అందిస్తుంది. అదే 6జీ 1 మైక్రో సెకన్‌లో వెయ్యి గిగాబైట్ల(ఒక టెరాబైట్) డేటాను అందిస్తుంది. అంటే 6జీ సాంకేతికత వేగంలో 5జీ కన్నా వెయ్యిరెట్లు మెరుగైనది.
- అదేవిధంగా లేటెన్సీ అనగా నెట్‌వర్క్‌లోని ఒక పాయింట్ నుంచి మరో పాయింట్‌కు సమాచారం(డేటా) చేరడానికి పట్టే సమయం(జాప్యం)ను, 5జీతో పోల్చిన 6జీ విపరీతంగా తగ్గిస్తుంది. 5జీలో ఈ లేటెన్సీ 5 మిల్లీ సెకన్లు కాగా, 6జీతో 'అల్ట్రాలో లేటెన్సీ(అతి తక్కువ జాప్యం)' సాధ్యపడి ఒక మైక్రో సెకనుకు ఈ జాప్యం పరిమితం అవుతుందని అంచనా. ఇంతవరకూ ఉపయోగించని 'టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలను 6జీ సాంకేతికతలో వినియోగించనుండటంతో అల్ట్రాలో లేటెన్సీ సాధ్యం కానుంది. టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలు విద్యుదయస్కాంత వర్ణ పటంలో పరారుణ తరంగాలు, మైక్రోవేవ్ తరంగాల మధ్య ఉంటాయి. చాలా సూక్ష్మంగానూ, సున్నితంగానూ ఉండే ఈ తరంగాలు భారీస్థాయిలో డేటాను వేగంగా చేరవేయగలవు.
- 5జీ సాంకేతికత 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'ను ప్రవేశపెట్టడానికి సహకరించి, మానవుల నుంచి యంత్రానికి కమ్యూనికేషన్‌ను సాధ్యం చేసింది. ఈ పునాదిపై మరింత విస్తృతీకరించిన 6జీ సాంకేతికత మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్‌ను(యంత్రాల మధ్య సమాచార బదిలీ) సాధ్యపరిచింది. ఇది చాలా వేగంగా జరిగే కమ్యూనికేషన్ కావడంతో మానవ మెదళ్లు గ్రహించగలవు.

6జీ టెక్నాలజీ ద్వారా రానున్న మార్పులు

1. కమ్యూనికేషన్ల పరంగా: నెట్‌వర్క్ స్లైసింగ్ ప్రక్రియ ద్వారా విస్తృత నెట్‌వర్క్‌లను అతి చిన్న ప్రత్యేక నెట్‌వర్క్‌లుగా విభజించడం వల్ల వివిధ రకాల సమాచార రద్దీని ప్రాధాన్యతల ఆధారంగా విభజించి నిర్వహించడానికి అవకాశం ఉంది. అదేవిధంగా సమాచార ప్రసారంలో విస్తృతస్థాయిలో భద్రత లభిస్తుంది. ఎన్‌క్రిప్షన్, హోలో గ్రాఫిక్ కమ్యూనికేషన్, మెరుగైన కృత్రిమమేధ, ఎక్స్‌టెండెడ్ రియాలిటీల ద్వారా మరింత భద్రతతో పాటు స్పష్టత, నిజ సమయ సమాచార బదిలీ(రియల్ టైమ్ డేటా ట్రాన్స్‌ఫర్) సాధ్యమవుతాయి. మరింత వేగంగా ఫైల్ డౌన్ లోడింగ్, వెబ్‌సెర్ఫ్, వర్చువల్ రియాలిటీ, సమాచార మార్పిడి సాధ్యమవుతాయి.

2. రవాణారంగం: వేగం, లేటెన్సీల పరంగా, మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్స్, కృత్రిమ మేధ, త్రీడీ సాంకేతికతలతో ఈ 6జీ టెక్నాలజీ తీసుకువచ్చే మార్పుల కారణంగా స్వయం చోదిత వాహనాలు(డ్రైవర్ లెస్ కార్లు), ఎయిర్ ట్రాఫిక్ నియంత్రన; బుల్లెట్ ట్రైన్స్ వంటి రవాణారంగ అంశాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

3. స్మార్ట్ సిటీస్, గ్లోబల్ కనెక్టివిటీ: రియల్ టైమ్ మానిటరింగ్, గ్లోబల్ కనెక్టివిటీ(ప్రజలు, పరికరాలు, సిస్టమ్స్, వివిధ సంస్థల మధ్య నిరంతర అనుసంధానత) వల్ల ట్రాఫిక్ నుంచి, ఫ్రిజ్‌లో సరుకుల వరకూ అన్నిటి సమాచారం అప్రయత్నంగా బదిలీ అయిపోతున్నాయి. అనుసంధానతలు పెరగడం వల్ల పట్టణ-గ్రామ అంతరాలు తొలగిపోతాయి.

4. విద్య, పరిశోధన రంగాలు: విద్యార్థులకు విద్యారంగంలో ప్రపంచవ్యాప్త అనుసంధానత ఏర్పడుతుంది. వర్చువల్ క్లాసెస్, టీచర్స్, క్లాస్‌మేట్స్‌తోపాటు సమాచార విశ్లేషణ రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్(అనుభవ పూర్వక అధ్యయనం) సాధ్యమవుతాయి. అదేవిధంగా అన్ని రంగాల్లో సంక్లిష్ట అంశాలపరంగా కూడా పరిశోధనకు అవకాశం ఏర్పడుతుంది. పరిశోధనల్లో వేగం సాధ్యమవుతుంది.

5. ఆరోగ్యరంగం: టెలీ మెడిసిన్, కృత్రిమమేధ మద్దతుతో క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా రోబోటిక్ పద్ధతిలో నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో వేగం, వైద్యులతో అనుసంధానత మొదలైన సౌలభ్యాలు కలుగనున్నాయి.

6. వ్యవసాయ, వ్యాపార, ఆర్థిక రంగాలు: వ్యవసాయ, వ్యాపార రం గాల్లో డిమాండ్ - సప్లయ్ - ఉత్పత్తి నియంత్రణపరంగా తక్షణ సమాచార బదిలీ విస్తృతస్థాయిలో వివిధ వ్యవస్థల మధ్య జరిగి మార్కెట్లు విస్తరిస్తాయి. నష్టభయం తగ్గుతుంది. వేగవంతమైన కృత్రిమమేధతో నిర్ణయాలు, విశ్లేషణ, ఆచరణపరమైన జాప్యాన్ని నివారించవచ్చు. ఇవి సమిష్టిగా ఆర్థికవ్యవస్థ పురోభివృద్ధికి దోహదం చేస్తాయి.

7. అంతరిక్ష రంగం, రక్షణ రంగం, విపత్తు నిర్వహణ: అంతరిక్ష ప్రయోగాల్లో రియల్ టైమ్ మానిటరింగ్ అండ్ కంట్రోల్ ద్వారా వాహక నౌకలు, రోబోలు వంటి వాటిని తక్షణం నియంత్రిస్తూ వైఫల్యాలను తగ్గించవచ్చు. అత్యధిక రిజల్యూషన్‌తో కూడిన చిత్రాలు ఖగోళ పరిస్థితుల, పదార్థాల విస్పష్ట అంచనాకు సహకరిస్తాయి. అదేవిధంగా సుదూర ఖగోళ అన్వేషణ సాధ్యమై దూరాన ఉన్న నక్షత్రాలు, గ్రహాల సమాచారం లభ్యమవుతుంది. మెషిన్ టు మెషిన్ కమ్యూనికేషన్, వేగం వల్ల వివిధ రకాల భౌగోళిక పరిస్థితుల్లో, సరిహద్దుల్లో, యుద్ధ, విపత్తు పరిస్థితుల్లో ఎంతో ప్రయోజనకరం.

8. పర్యావరణం: ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వల్ల ప్రయాణ అవసరాలు తగ్గి కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గుతుంది. అదేవిధంగా స్మార్ట్ సిటీస్, స్మార్ట్ మీటర్స్ వంటి వాటివల్ల విద్యుత్, నీరు వృథా తగ్గి పర్యావరణానికి మేలు చేకూరుతుంది.

(మిగతా రేపటి దిక్సూచిలో..)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

దిక్సూచి DIKSUCHI

నవ్య | చిత్రజ్యోతి



జాగ్రత్త సుమా!

సోషల్ మీడియాలో చురుగ్గా ఉండే తారల్లో రష్మిక మందన్న ఒకరు. అయితే ఆమె పోస్టులు పెట్టి నెల రోజులయింది. ఈ స్వల్ప విరామానికి గల కారణాన్ని ఆమె తాజాగా అభిమానులతో పంచుకున్నారు. "నెల క్రితం నాకు ఓ ప్రమాదం జరిగింది. ఎవరూ కంగారు పడాల్సిన పనిలేదు. గాయం చిన్నదే. వైద్యుల సలహా మేరకు ఇంటిపట్టునే ఉండి విశ్రాంతి తీసుకుంటున్నాను. త్వరలోనే సినిమా సెట్స్‌లోకి అడుగుపెడతాను. జీవితం చాలా విలువైంది. ప్రతీ క్షణం అప్రమత్తంగా ఉండండి. రేపనేది ఉంటుందో లేదో తెలీదు. జాగ్రత్త సుమా" అంటూ ఇన్‌స్టాగ్రామ్‌లో పేర్కొన్నారు. రష్మిక ప్రస్తుతం 'పుష్ప 2', 'కుబేర', 'గర్ల్‌ఫ్రెండ్' చిత్రాల్లో నటిస్తున్నారు.



అడ్వాన్స్ బుకింగ్స్‌లో దుమ్మురేపుతున్న దేవర

జూనియర్ ఎన్టీఆర్ నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'దేవర'. రెండు భాగాలుగా తెరకెక్కుతున్న ఈ చిత్రానికి కొరటాల శివ దర్శకత్వం వహిస్తుండగా, సుధాకర్ మిక్కిలినేని, కొసరాజు హరికృష్ణ నిర్మిస్తున్నారు. జాన్వీ కపూర్ ఇందులో కథానాయికగా నటిస్తుండగా, సైఫ్ అలీఖాన్ ప్రతినాయకుడి పాత్రను పోషిస్తున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్, ఫస్ట్ సింగిల్ 'ఫియర్' సినిమాపై అంచనాలను తారాస్థాయిలో పెంచాయి. 'దేవర పార్ట్ 1' ఈ నెల 27న విడుదలవుతోంది. ఈ సినిమా రిలీజ్ కాకముందే బాక్సాఫీస్ వద్ద రికార్డులు సృష్టిస్తోంది. నార్త్ అమెరికాలో ఈ చిత్రం ప్రీమియర్ షో టిక్కెట్లు హాట్ కేకుల్లా అమ్ముడయిపోయాయి. ఇప్పటికే 8 లక్షల డాలర్లను (25 వేల టిక్కెట్లు) అడ్వాన్స్ బుకింగ్స్ రూపంలో వసూలు చేసి దుమ్మురేపుతోంది. 'దేవర' చిత్రం ట్రైలర్ ఈ రోజు విడుదల కానుంది.

ఇన్ ప్రోగ్రెస్

రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్ కలసి నిర్మించే 'కాంత' చిత్రం షూటింగ్ సోమవారం ఉదయం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ జంటగా నటించే ఈ సినిమాకు సెల్వమణి సెల్వరాజ్ దర్శకుడు. సముద్రఖని కీలక పాత్రధారి.



నాటి మద్రాసు నేపథ్యంలో కాంత

రామానాయుడు స్టూడియోలో తొలి క్లాప్ ఇచ్చి 'కాంత' చిత్రానికి శ్రీకారం చుట్టారు విక్టరీ వెంకటేశ్. 1950 నాటి మద్రాసు బ్యాక్‌డ్రాప్‌లో మానవ భావోద్వేగాల లోతుల్ని ఆవిష్కరించే ఇతివృత్తంతో ఈ సినిమా రూపుదిద్దుకుంటుందని దర్శకుడు చెప్పారు. సురేశ్ ప్రొడక్షన్స్ సంస్థ 60వ సంవత్సరం సందర్భంగా స్పిరిట్ మీడియా కొత్త శకానికి నాంది పలుకుతూ తీస్తున్న సినిమా ఇదనీ రానా చెప్పారు. తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ భాషల్లో విడుదలయ్యే ఈ సినిమాను ప్రశాంత్ పొట్లూరి, రానా దగ్గుబాటి, దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు

విడిపోయిన జయం రవి దంపతులు



కోలీవుడ్ హీరో జయం రవి, ఆరతి జంట విడిపోయింది. తన భార్య ఆరతికి విడాకులు ఇస్తున్నట్లు జయం రవి ప్రకటించారు. 2009లో జయం రవి ఇరువైపు కుటుంబీకుల అంగీకారంతో ఆరతిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. వీరి వైవాహిక జీవితం 15 ఏళ్లపాటు సాఫీగా కొనసాగింది. కొద్ది నెలలకు ముందు ఇరువురి మధ్య మనస్పర్థలు ఏర్పడటంతో విడిపోయారు. ఈ నేపథ్యంలో సోమవారం మధ్యాహ్నం జయం రవి తన విడాకుల విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. సినిమాల్లోనూ, నిజజీవితంలోనూ తాను ఎల్లప్పుడు పారదర్శకంగానే ఉంటానని, ఎలాంటి దాపరికాలకు తావులేదని భారమైన హృదయంతో ఓ చేదు విషయాన్ని చెప్పదలిచానని పేర్కొంటూ ఆరతితో వైవాహిక జీవితానికి స్వస్తి పలకాలని నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. తొందరపడి ఈ నిర్ణయం తీసుకోలేదని, ఆచితూచి, తనవారి సంక్షేమం దృష్ట్యా తీసుకున్న నిర్ణయమని జయం రవి తెలిపారు.

- చెన్నై (ఆంధ్రజ్యోతి)



మెరుపై వచ్చిండే..

'జై భీమ్' ఫేమ్ టి.జె.జ్ఞానవేల్ రాజా దర్శకత్వంలో రజనీకాంత్ నటిస్తున్న చిత్రం 'వేట్టయాన్' (వేటగాడు). అమితాబ్ బచ్చన్, రానా దగ్గుబాటి, ఫహాద్ ఫాజిల్, మంజు వారియర్, రితికా సింగ్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఇందులో ఓ రిటైర్డ్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో రజనీ కనిపించనున్నారు. ఈ సినిమా దసరా కానుకగా అక్టోబరు 10న ప్రేక్షకులను పలకరించనుంది. సోమవారం ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ 'మనసిలాయో'ను మేకర్స్ విడుదల చేశారు. 'మెరుపై వచ్చిండే.. మడత పెట్టి వచ్చిండే.. మనసు పెట్టి వచ్చిండే' అంటూ సాగే ఈ హుషారైన మాస్ గీతంలో రజనీ సరసన మంజూ వారియర్ ఆడిపాడారు. అనిరుధ్ సంగీతం అందించిన ఈ పాటకు శ్రీనివాస మౌళి లిరిక్స్ అందించారు. నకాశ్ ఆజీజ్, అరుణ్ కౌండిన్య, దీప్తి సురేశ్ ఆలపించారు.



దసరాకి వస్తున్నాం

సుహాస్, సంగీర్తన జంటగా దిల్ రాజు ప్రొడక్షన్స్ సంస్థ నిర్మించిన 'జనక అయితే గనక' చిత్రం కొత్త రిలీజ్ డేట్ ప్రకటించారు. దసరా సందర్భంగా అక్టోబరు 12న విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు. సందీప్‌రెడ్డి దర్శకుడు. శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత రెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా ఇంట్రెస్టింగ్ వీడియో విడుదల చేశారు. ఈ సినిమా ఓవర్‌సీస్ హక్కులు సొంతం చేసుకున్న సుహాస్‌కి అందరూ ఫోన్ చేసి రిలీజ్ ఎప్పుడు అని అడుగుతుంటారు. ఈ గోల భరించలేక సుహాస్ దిల్ రాజుకు ఫోన్ చేసి రిలీజ్ డేట్ గురించి అడగడం, 'మనది ఫ్యామిలీ ఆడియన్స్‌కు కనెక్ట్ అయ్యే సినిమా కనుక దసరా సందర్భంగా అక్టోబర్ 12న విడుదల చేస్తున్నాం' అని చెప్పడం .. ఇలా ఆసక్తికరంగా ఆ వీడియో రూపొందించారు.

అన్ని ఎలిమెంట్స్‌తో నిండిన చిత్రం



'క్రేజీ బాయ్' ఫేమ్ దిలీప్‌ప్రకాశ్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'ఉత్సవం'. ప్రకాశ్‌రాజ్, రాజేంద్రప్రసాద్, నాజర్, రెజీన కసాండ్ర కీలక పాత్రలు పోషించారు. అర్జున్ సాయి దర్శకత్వంలో సురేశ్ పాటిల్ నిర్మించారు. ఈ నెల 13న సినిమా విడుదలవుతున్న సందర్భంగా దిలీప్ మీడియాతో ముచ్చటించారు.

"ఇది ఎంతో ఉన్నతమైన కథాంశంతో తెరకెక్కిన చిత్రం. ఇందులో కథనే హీరో. రంగస్థల కళాకారుల జీవితాలతో ముడిపడిన చిత్రమిది. ఎంతో అనుభవమున్న నటులు ఇందులో నటించారు. మంచి సందేశం, ప్రేమ కథ, వినోదంతో పాటు ప్రేక్షకులు కోరుకునే అన్ని రకాల ఎలిమెంట్స్‌తో నిండిన చిత్రమిది. అనూప్ రూబెన్స్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఈ సినిమాకు బ్రహ్మ కడలి అందించిన ఆర్ట్ వర్క్ ప్రత్యేకాకర్షణ. నాకు యాక్షన్ సినిమాలంటే ఇష్టం. నా నెక్ట్స్ సినిమా అదే తరహాలో ఉండబోతోంది'.

నా ఇంటి పేరు అది కాదు



నటిగా సెలక్టివ్ పాత్రలు ఎంచుకుని తన నటనతో అందరినీ ఫిదా చేస్తుంటారు నిత్యామేనన్. ఇటీవలే మీడియాతో ముచ్చటించిన ఆమె.. అందర్నీ ఆశ్చర్యానికి గురిచేసే ఓ విషయాన్ని పంచుకున్నారు. "చాలా మంది నా ఇంటి పేరు మేనన్. నా స్వస్థలం కేరళ అనుకుంటారు. నిజానికి నా ఇంటి పేరు మేనన్ కాదు. నా పేరు ఎన్.ఎస్.నిత్య. ఎన్ అంటే మా అమ్మ నళిని. ఎస్ అంటే మా నాన్న సుకుమార్. మాది బెంగుళూరు. మా కుటుంబం మూడు తరాలుగా బెంగుళూరులోనే ఉంటోంది. మేమంతా ఇంటి పేరును గొప్పంగా ఉంచడానికి ఇష్టపడతాం. మా కులమిదని చెప్పుకోవడం కూడా మాకు ఇష్టం ఉండదు. కేవలం న్యూమరాలజీ ఆధారంగా నా పేరు తర్వాత 'మేనన్' జతచేసుకున్నాను" అని చెప్పారు.

డబుల్ థ్రిల్‌తో...



శ్రీసింహ కోడూరి ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'మత్తు వదలరా 2'. ఇది 2019లో విడుదలై సూపర్ సక్సెస్ సాధించిన 'మత్తు వదలరా' సినిమాకు రెండో భాగం. ఈ నెల 13న సినిమా విడుదలవుతున్న సందర్భంగా శ్రీసింహ మీడియాతో మాట్లాడారు.

"మొదటి భాగంతో పోల్చితే ఇందులో చాలా మార్పులు జరిగాయి. రెండో భాగం ఒక డిఫరెంట్ థ్రిల్లర్‌గా ఎన్నో ట్విస్టులు, సర్‌ప్రైజ్‌లతో అలరిస్తుంది. ఇందులో నేను, సత్య పోషించిన పాత్రలు డెలివరీ బాయ్స్ నుంచి స్పెషల్ ఏజెంట్స్‌గా మారే క్రమం ఆసక్తికరంగా ఉంటుంది. దర్శకుడు రితేష్ రాణాకు ఫిల్మ్ మేకింగ్‌లో చాలా అవగాహన ఉంది. ప్రతీ విషయంలో క్లారిటీగా ఉంటారు. ఫరియా అబ్దుల్లా తనకు సరిపోయే పాత్రను ఇందులో పోషించారు. ఆమె ఓ పాట పాడటమే కాకుండా కొరియోగ్రఫీ కూడా అందించారు. ఈ సినిమా మొదటి భాగం కంటే డబుల్ థ్రిల్‌ను పంచుతుంది. ఈ మూవీ ఫ్రాంచైజీని కొనసాగించే ఆలోచనల్లో ఉన్నాం" అని చెప్పారు.

యూత్, ఫ్యామిలీ ఆడియన్సే టార్గెట్



చంద్రహాస్ హీరోగా నటిస్తున్న 'రామ్‌నగర్ బన్నీ' చిత్రం ఫస్ట్ లుక్, గ్లింప్స్ విడుదల చేశారు. విస్మయశ్రీ, రిచా జోషి, అంబికా వాణి, రీతూ మంత్ర హీరోయిన్లుగా నటిస్తున్నారు. శ్రీనివాస్ మహత్ (వెలిగొండ శ్రీనివాస్) దర్శకత్వంలో మలయజ ప్రభాకర్, పొడకండ ప్రభాకర్ నిర్మిస్తున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు వరద బాధితుల సహాయార్థం తన వంతు ఆర్థిక సహాయాన్ని చంద్రహాస్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చంద్రహాస్ మాట్లాడుతూ 'ప్రేక్షకుల్ని ఎంటర్‌టైన్ చేయాలని హీరోగా మారాను. ప్రస్తుతం మూడు సినిమాల్లో నటిస్తున్నాను. వాటిల్లో ఫస్ట్ మూవీ 'రామ్‌నగర్ బన్నీ'. అక్టోబరులో విడుదలవుతుంది. యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌కు నచ్చే సినిమా అవుతుంది' అని చెప్పారు.

మధ్యతరగతి మందహాసం



సుధీర్‌బాబు నటిస్తున్న తాజా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్‌రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మిస్తున్నారు. దసరాకి ఈ సినిమా విడుదల కానుంది. ప్రమోషన్స్‌లో భాగంగా సినిమా ఫస్ట్‌లుక్ పోస్టర్ విడుదల చేశారు. మధ్యతరగతి యువకుడి పాత్ర పోషిస్తున్న సుధీర్‌బాబు స్కూటర్ నడుపుతూ చిరునవ్వుతో స్కూల్ పిల్లలను పలకరిస్తూ కనిపించారు. ప్రేమ, అనుబంధాలకు అర్థం చెప్పే సినిమా ఇదని దర్శకుడు చెప్పారు. ఈ నెల 12న టీజర్ విడుదల చేస్తున్నట్లు నిర్మాత తెలిపారు. ఆర్ణ ఈ సినిమాలో కథానాయిక.



జాతకం పూర్తి

ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా రూపొందుతున్న 'సారంగపాణి జాతకం' షూటింగ్ పార్ట్ పూర్తయింది. మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శివలెంక కృష్ణప్రసాద్ ఈ సినిమా నిర్మిస్తున్నారు. ఆయన మాట్లాడుతూ 'నాకు ఎప్పటినుంచో పూర్తి వినోదాత్మక సినిమా తీయాలనే కోరిక ఉంది. జంధ్యాలగారితో ఓ కామెడీ ఫిల్మ్ తీయాలనుకున్నాను కానీ కుదరలేదు. ఆ కోరిక ఇప్పుడు 'సారంగపాణి జాతకం' సినిమాతో తీరుతోంది. మనిషి భవిష్యత్ అతని చేతి రేఖల్లో ఉంటుందా, లేక అతని చేసే చేతల్లో ఉంటుందా అని ప్రశ్నకు జవాబు ఇచ్చే పూర్తి హాస్య రస చిత్రం ఇది. మా సంస్థలో రెండు విజయవంతమైన సినిమాలు చేసిన మోహనకృష్ణ వినోదభరితంగా చిత్రాన్ని తీర్చిదిద్దారు. ఖర్చు పరంగా, టెక్నికల్ పరంగానూ ఎక్కడా రాజీ పడకుండా ఈ సినిమా చేస్తున్నాం' అని చెప్పారు

సినిమాగా యండమూరి అంతర్ముఖం



ప్రముఖ రచయిత, దర్శకుడు యండమూరి వీరేంద్రనాథ్ రాసిన నవలల్లో అగ్ర తాంబూలం అందుకొన్న 'అంతర్ముఖం' నవల ఇప్పుడు సినిమాగా రూపొందనుంది. భీమవరం టాకీసు పతాకంపై 117వ చిత్రంగా ఇది రూపొందుతుందని నిర్మాత తుమ్మలపల్లి రామసత్యనారాయణ చెప్పారు. యండమూరి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తారని ఆయన తెలిపారు. సీనియర్ ఛాయాగ్రాహకుడు మీర్ ఈ సినిమాకు పని చేస్తున్నారు. అలాగే అల్లాణి శ్రీధర్, నరసింహ నంది దర్శకత్వంలో రెండు సినిమాలు కూడా తీసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయని రామసత్యనారాయణ చెప్పారు.



మలయాళ హక్కులు కొన్నారు

కిరణ్ అబ్బవరం హీరోగా నటిస్తున్న భారీ పీరియాడికల్ థ్రిల్లర్ 'క' చిత్రం మలయాళ థియేట్రికల్ రైట్స్ హీరో దుల్కర్ సల్మాన్‌కు చెందిన వేఫరర్ ఫిల్మ్స్ సంస్థ సొంతం చేసుకుంది. ఈ సినిమా ఫస్ట్ లుక్, టీజర్ చూసి దుల్కర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. 'క' తెలుగు హక్కుల్ని నిర్మాత వంశీ నందిపాటి ఇప్పటికే పొందారు. నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్లుగా నటిస్తున్న ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది.

సర్వ శక్తులూ ఒడ్డి..

- వరద బాధిత ప్రాంతాల్లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల పర్యటన
- పంట, ఆస్తి నష్టంపై ఆరా
- సహాయ చర్యలపై సమీక్ష
- నిత్యావసర సరుకుల పంపిణీ
- పారిశుధ్య పనులు, వైద్య శిబిరాలు

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	114, 123, 134
చికెన్ విత్ స్కిన్	218
చికెన్ స్కిన్‌లెస్	228

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.20

అధిక వర్షాలు, వరదల వల్ల కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. గత పది రోజులుగా అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు సర్వశక్తులూ ఒడ్డి సేవలందిస్తున్నారు. సోమవారం కూడా మంత్రులు, జిల్లా ఉన్నతాధికారులు వరద ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితులను పరామర్శించారు. సహాయ చర్యలను సమీక్షించారు. వరద నష్టంపై అంచనాలు సిద్ధం చేయాలని ఆదేశాలిచ్చారు. పారిశుధ్య చర్యలు, వైద్య శిబిరాల నిర్వహణను పరిశీలించారు. పంట నష్టాన్ని పరిశీలించేందుకు కేంద్ర బృందం కూడా వస్తున్నట్లు అధికారులు తెలిపారు.



విద్యాధరపురంలో పర్యటిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే పత్తిపాటి తదితరులు



పాయకాపురంలో మంత్రి నారాయణ పర్యటన



ఎదురుమొండి దీవుల్లో కలెక్టర్, మండలి

విద్యాధరపురం, సెప్టెంబరు 9 : గతంలో ఎప్పుడూ లేని విధంగా విజయవాడ నగరాన్ని వరద ముంచెత్తిందని, ఇలాంటి పరిస్థితి మరోసారి రాకుండా భద్రతా చర్యలు తీసుకుంటామని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. సోమవారం పశ్చిమ నియోజకవర్గం పరిధిలోని 43, 44, 45 డివిజన్ల పరిధిలో ముంపు ప్రాంతాలను ఎంపీ కేశినేని చిన్ని, మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు, గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్, ఇతర పార్టీ నాయకులతో కలిసి పరిశీలించారు. ఎంపీ ట్రాక్టర్‌పై ఊర్మిళానగర్‌లోని రెడ్డికాలనీ, ఏకలవ్యనగర్, తదితర ప్రాంతాల్లో ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్‌తో కలిసి పర్యటించి బాధితులను పరామర్శించారు. 45వ డివిజన్‌లో ఎంపీ, ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావుతో కలిసి వరద బాధితులను పరామర్శించి కూరగాయలను పంపిణీ చేశారు. మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి ఫ్లై ఓవర్ పై నుంచి మెయిన్‌రోడ్డులో నిలిచిపోయిన వాహనాలను పరిశీలించి సమస్య పరిష్కారానికి అధికారులకు పలు సూచనలు చేశారు. 44వ డివిజన్‌లో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్‌తో కలిసి ముంపు ప్రాంతాలను పరిశీలించారు. ఎంపీ శివనాథ్ మాట్లాడుతూ వరద కారణంగా నీట మునిగిన టీవీలు, ఫ్రిజ్‌లు, చెడిపోయిన ఎలక్ట్రానిక్ వస్తువులను బాగుచేయించే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వమే తీసుకుంటుందన్నారు. నష్టపోయిన ప్రతి ఒక్కరికీ నష్టపరిహారం అందజేస్తామన్నారు. నగరాన్ని, ప్రజలను సాధారణ స్థితికి తీసుకురావటమే లక్ష్యంగా సీఎం చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని తెలిపారు. టీడీపీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎం.ఎస్.బేగ్, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా, కార్పొరేటర్ మైలవరపు లావణ్య, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పాయకాపురంలో మంత్రి నారాయణ

కృష్ణలంక : పాయకాపురంలోని వరద ముంపు ప్రాంతాల్లో మున్సిపల్ మంత్రి పి.నారాయణ సోమవారం పర్యటించారు. పారిశుధ్య పనుల తీరును పరిశీలించారు. వరద బాధితులను పరామర్శించిన మంత్రి నారాయణ శానిటేషన్‌లో భాగంగా బ్లీచింగ్‌ను చల్లారు. నీరు తగ్గిన 24 గంటల్లోగా సాధారణ పరిస్థితి తీసుకొస్తామన్నారు. వరద తగ్గిన ప్రాంతాల్లో మంగళవారం నాటికల్లా శానిటేషన్ పూర్తి అవుతుందన్నారు. డ్రైనేజీ పనులపై కూడా పూర్తిస్థాయిలో దృష్టి పెట్టామన్నారు. నీరు వున్నప్పటికీ చెత్తను తొలగించకుంటే అంటువ్యాధులు వస్తాయని, అందుకే నీటిలో వున్న చెత్తను తొలగిస్తున్నట్లు నారాయణ తెలిపారు.

దివిసీమలో కలెక్టర్ బాలాజీ పర్యటన

అవనిగడ్డ : కృష్ణానది వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన అవనిగడ్డ నియోజకవర్గంలోని వరద ప్రభావిత ప్రాంతాలను కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్‌తో కలిసి పరిశీలించారు. ఆక్విడెక్ట్‌ను సందర్శించిన కలెక్టర్ బాలాజీ దాని పరిరక్షణ కోసం తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ డీఈ రావెళ్ల రవికిరణ్‌ను ఆదేశించారు. నాగాయలంక మండలంలోని ఎదురుమొండి దీవుల్లో ఎదురుమొండి - జింకపాలెం గ్రామాల నడుమ వరదల కారణంగా కోతకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. గొల్లమంద - బ్రహ్మయ్యగారి మూల నడుమ రహదారి మొత్తం నదిలోకి కలసిపోగా, జింకపాలెం, బ్రహ్మయ్యగారి మూల, గొల్లమంద గ్రామాల ప్రజలు కోతకు గురైన ప్రాంతానికి వచ్చి కలెక్టర్‌తో నేరుగా మాట్లాడారు. నది కోత పెరిగి రహదారి మొత్తం నదిలో కలసిపోయిందని, తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇంత వరకు రేషన్ అందలేదని అక్కడి ప్రజలు కలెక్టర్ వద్ద వాపోగా, సాయంత్రానికి వారందరికీ రేషన్ అందించాలని ఆదేశించారు. ఏటిమొగలోని పునరావాస శిబిరంలో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన రేషన్ పంపిణీని ఆయన ప్రారంభించారు. ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్, ఆర్డీవో ఎం.వాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వాహనదారులకు నిస్సాన్ హెల్ప్ డెస్క్

వన్‌టౌన్ : వరద ప్రభావిత ప్రాంతాల్లో వాహన వినియోగదారులకు సహాయం చేసే క్రమంలో నిస్సాన్ సంస్థ ప్రత్యేక హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయడంతో పాటు ఉచిత రోడ్ సైడ్ అసిస్టెంట్స్ సేవలను అందించనున్నట్లు నిస్సాన్ మోటార్ ఇండియా ప్రై లిమిటెడ్ ఎండీ సౌరబ్ వత్స సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరద ప్రభావిత ప్రాంతాలలో వాహనాలకు రూ.1000 వరకు బీమా క్లెయిమ్ ప్రాసెసింగ్ ఫీజును కూడా మినహాయిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ వెసులుబాటు ఈనెల 30వ తేదీ వరకు కొనసాగుతుందని చెప్పారు. వరద ప్రభావిత ప్రాంతాల్లోని వాహన వినియోగదారులకు తాము సహాయం చేయడానికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. వినియోగదారులు 1800 209 34 56 హెల్ప్ డెస్క్‌లో సంప్రదించవచ్చునని తెలిపారు. వివరాల కోసం డైరెక్టర్ నారాయణ కన్నన్‌తో మాట్లాడవచ్చునని పేర్కొన్నారు.

ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా రెవెన్యూ

వన్‌టౌన్ : రాష్ట్రంలో ఎటువంటి విపత్తు వచ్చినా సహాయ సహకారాలు అందించేందుకు రెవెన్యూ ఉద్యోగులు ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పని చేస్తారని ఏపీ రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొప్పరాజు వెంకటేశ్వర్లు, రామిశెట్టి వెంకట రాజేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎడతెరపిలేని వానలు, బుడమేరు వరదలతో అతలాకుతలమైన విజయవాడ నగరంలోని 32 వార్డులలో వరద నష్ట వివరాల ను సేకరించేందుకు 11 జిల్లాల నుంచి 1864 మంది రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు విజయవాడ తరలివచ్చారన్నారు. ఈనెల 11వ తేదీ వరకు వీరంతా ఫ్రంట్‌లైన్ వారియర్స్‌గా పనిచేస్తారని ఆయన పేర్కొన్నారు. రెవెన్యూ అధికారులు, ఉద్యోగులు వరద బాధితుల వద్ద ఎంతో బాధ్యతతో, ఓర్పు, సహనంతో వ్యవహరించాలని తెలిపారు.

ఆరు వేల ఎకరాల్లో పంటలకు నష్టం

తోట్లవల్లూరు : మండలంలోని లంకల్లో కృష్ణానది వరదకు దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు కేంద్ర బృందం వస్తున్నట్లు తహసీల్దార్ ఎం కుసుమకుమారి తెలిపారు. 2,277 ఎకరాల్లో అరటి, 2,691 ఎకరాల్లో పసుపు, 100 ఎకరాల్లో బొప్పాయి, 96 ఎకరాల్లో తమలపాకు, 1,053 ఎకరాల్లో కంద, 217 ఎకరాల్లో కూరగాయలు, 30 ఎకరాల్లో పూలతోటలు ఇంకా ఆయిల్‌పామ్, కొబ్బరి తదితర తోటలు మొత్తం 6,546 ఎకరాల్లో పంటలు వరదకు దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

నీటి ముంపులోనే గృహాలు

కూచిపూడి : విస్తారంగా కురుస్తున్న వర్షాలు, వరదల కారణంగా మండల పరిధిలోని పలు గ్రామాల్లోని పల్లపు ప్రాంతాల్లో నేటికీ నీటిముంపులోనే గృహాలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు నీటి ముంపులో ఉన్న గృహాలు, గోడలు చెమ్మగిల్లటం తదితర అంశాలపై సర్వే చేపట్టారు. నిడుమోలు ఎస్టీ కాలనీలో 17, చినముత్తేవిలో 34, కూచిపూడిలో మూడు గృహాల్లోకి నీరు చేరగా, కాజ శివారు మందపాలెంలో 10, కళాయిగుంటలో మూడు గృహాల్లో గోడలు చెమ్మగిల్లినట్లు రెవెన్యూ అధికారుల పరిశీలనలో తేలింది.

గవర్నర్‌ను కలిసిన ఎంపీ కేశినేని



వన్‌టౌన్ : గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను రాజ్‌భవన్‌లో సోమవారం విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని శివనాథ్ (చిన్ని) మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు ఎంపీ పుష్పగుచ్ఛం అందజేశారు. గవర్నర్‌తో వరద ముంపు గురించి వివరించారు. వరద విపత్తు నుంచి నగరాన్ని, ప్రజలను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు చేస్తున్న కృషిని గవర్నర్‌కు వివరించారు. ఎంపీతో పాటు గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు, ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సానా సతీష్ ఉన్నారు.

నందివాడ మండలంలో..

నందివాడ (పోలుకొండ) : ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు మూడవ రోజు మండలంలోని తమిరిశ, అనమనపూడి, పోలుకొండ, శంకరంపాడు, రుద్రపాక పరిసర ప్రాంతాలను సోమవారం ముంపు ప్రాంతాలను పరిశీలించారు. వారి వెంట టీడీపీ మండల అధ్యక్షులు దానేటి సన్యాసిరావు, చాట్రగడ్డ రవి, పిన్నమనేని పూర్ణ వీరయ్య, సురేష్, ఉప్పల వెంకటేశ్వరరావు, సర్పంచ్ ఝాన్సీ కుమారి, శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కామినేనికి త్రుటిలో తప్పిన ప్రమాదం

కైకలూరు : కొల్లేరులో వరద ఉధృతిని పరిశీలించేందుకు వెళ్లిన కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్‌కు తృటిలో పెను ప్రమాదం తప్పింది. సర్కారు కాల్వ వద్ద నుంచి కొల్లేరు లంక గ్రామాలను పరిశీలించేందుకు సోమవారం ఎమ్మెల్యే బొలేరో వ్యానులో బయల్దేరారు. కిలోమీటరు వరకు నీటిలో వెళ్లిన తర్వాత వ్యాను రోడ్డుపై గొయ్యిలో పడి పెద్దశబ్దంతో పక్కకు ఒరిగిపోయింది. వ్యాను పైన ఉన్న ఎమ్మెల్యేతో పాటు మిగిలినవాళ్లు ఆందోళనకు గురయ్యారు. అప్రమత్తమైన మిగిలిన నాయకులు, అధికారులు వ్యాను నుంచి ఎమ్మెల్యేతో పాటు ఒక్కొక్కరిని కిందికి దించారు. డ్రైవర్ ఏసురాజు వ్యానును కొద్దిసేపటికి రహదారి పైకి తీసుకురాగా అనంతరం ఎమ్మెల్యే పర్యటనను యథావిధిగా కొనసాగించారు.

ముఖ్యమంత్రి సహాయనిధికి డాక్టర్ రాజారావు రూ.10 లక్షల విరాళం



కృష్ణలంక : ఏపీ మెడికల్ కౌన్సిల్ మాజీ ఛైర్మన్ డాక్టర్ యలమంచిలి రాజారావు వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.10 లక్షలు అందజేశారు. ఈ మేరకు చెక్కును ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సోమవారం ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో అందజేశారు.

ప్రభుత్వ వైద్యుల సంఘం రూ.6 లక్షల విరాళం



వన్‌టౌన్ : వరద బాధితుల సహాయార్థం సీఎం రిలీఫ్ ఫండ్‌కు రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం కేంద్ర కమిటీ సభ్యుడు డాక్టర్ బాబ్జి శ్యామ్ కుమార్ ఆధ్వర్యంలో సోమవారం సీఎం చంద్రబాబు నాయుడును కలిసి రూ.6 లక్షల చెక్కును అందజేశారు. సిదార్థ వైద్య కళాశాల గ్యాస్ట్రో ఎంట్రాలజీ ప్రొఫెసర్ మెట్లపల్లి జగన్మోహన్‌రావు, గైనకాలజీ ప్రొఫెసర్ డాక్టర్ హిమబిందు, డాక్టర్ చిక్కిలం శ్రీలలిత, డాక్టర్ బి.ఆదిలక్ష్మి, డాక్టర్ బి.యాదవ్, డాక్టర్ వి.వి.నారాయణరావు, డాక్టర్ స్వరూపకాంత్, చిట్టేటి భానుకుమార్ తదితరులు ఉన్నారు. కృష్ణాజిల్లా, పెదపారుపూడి మాజీ సర్పంచ్ గారపాటి శ్రీలక్ష్మి, వీరనాగ బాబూరావు దంపతులు ముఖ్య మంత్రికి లక్ష రూపాయల చెక్కును అందజేశారు.



విభిన్న ప్రతిభావంతుల విరాళం

ధర్నాచౌక్ : వరద బాధితులకు అండగా మేము సైతం అంటూ విభిన్న ప్రతిభావంతులు ముందుకు వచ్చారు. విజువల్లి చాలెంజ్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు రవీంద్రబాబు ఆధ్వర్యంలో లక్ష రూపాయల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేశారు. వీరభద్రరావు, జమలయ్య, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మునేటిలో యువకుడి గల్లంతు

నందిగామ : మునేటి వరద చూసేందుకు వెళ్లి ఈతకు దిగిన యువకుడు గల్లంతయ్యాడు. సోమవారం సాయంత్రం నందిగామ పట్టణానికి చెందిన మాడుగుల చంటి, పసుపులేటి రోశయ్య నదిలో ఈతకు దిగారు. వరద ఉధృతికి ఇద్దరూ కొట్టుకుపోగా పసుపులేటి రోశయ్య అతి కష్టం మీద ఒడ్డుకు చేరుకున్నాడు. మాడుగుల చంటి వరదలో కొట్టుకుపోయాడు. సీఐ లచ్చునాయుడు గాలింపు ముమ్మరం చేశారు.

హంసలదీవి వద్ద50 మీటర్లు వెనక్కి వెళ్లిన సముద్రం



కోడూరు : హంసలదీవి సమీపంలోని పాలకాయి తిప్ప బీచ్ వద్ద విచిత్ర పరిస్థితి నెలకొంది. పాలకాయి తిప్ప బీచ్ వద్ద సముద్రం 50 మీటర్ల మేర వెనక్కి వెళ్లింది. ఈ కారణంగా తీరం ఒడ్డు వెంట సుమారు మూడు అడుగుల మేర ఇసుక దిబ్బలు ఏర్పడ్డాయి. దీంతో మత్స్యకారులు ఆశ్చర్యాన్ని వ్యక్తం చేస్తున్నారు. పవిత్ర సంగమ ప్రాంతంలో కృష్ణవేణమ్మ పాదుకలకు ఆరు మీటర్ల దూరంగా ఉన్న కృష్ణానది భారీ కోతకు గురై కృష్ణమ్మ పాదాల వద్దకు చేరింది. వాయుగుండ ప్రభావానికి సముద్రంలో ఎటువంటి అల్లకల్లోలం లేకుండా ప్రశాంతంగా ఉండటం వల్లే వరద ముంపు తీర ప్రాంత గ్రామాలపై పడలేదని పలువురు పేర్కొంటున్నారు.

వరద ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు

మచిలీపట్నం టౌన్ : వరద ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ గీతాబాయి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. బుడమేరు ప్రభావిత ప్రాంతాలతో పాటు దివిసీమ, నందివాడ తదితర ప్రాంతాల్లో 60 ప్రత్యేక వైద్య శిబిరాలు ప్రారంభించామన్నారు. బుడమేరు వరద ప్రాంతాల్లో ప్రస్తుతం 32 శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఒక వైద్యుడు, ఒక ఏఎన్ఎంలతో మందులను శిబిరాల్లో అందుబాటులో ఉంచుతున్నామన్నారు. కృష్ణాపరివాహక ప్రాంతాల్లో సీజనల్ జ్వరాలు ఉండడంతో రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్ల ద్వారా పునరావాస కేంద్రాల్లో వైద్య సేవా శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇప్పటికి 15 వేల మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇచ్చామన్నారు. ఎవరూ ప్రాణాపాయ స్థితిలో లేరన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఎక్కువగా వరద వచ్చినందున కృష్ణా నుంచి 10 మొబైల్ మెడికల్ యూనిట్లు, డాక్టర్లు, నర్సులను పంపామన్నారు.

లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా నేరెళ్ల తేజ



ఉయ్యూరు : ఉయ్యూరు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా నేరెళ్ల తేజ సాయివెంకట్ పదవీ బాధ్యలు చేపట్టారు. క్లబ్ జిల్లా గవర్నర్ గద్దె శేషగిరి ఆయనతో ప్రమాణస్వీకారం చేయించారు. జోన్ ఛైర్‌పర్సన్ ఎండి ఇస్మాయిల్, మాజీ గవర్నర్ జేఎస్ శంకర్ గుప్తా, నూకల సాంబశివరావు, వి ఎరియాల వెంకటేశ్వరరావు, వైస్ గవర్నర్ ఆంజనేయులు హాజరై క్లబ్ అధ్యక్షుడు తేజసాయి వెంకట్, కార్యదర్శి నెల్లి రాంబాబు, ట్రెజరర్ దినవహి ప్రసాద్ ఇతర కార్యవర్గసభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు.

టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా 'అరిటాకుల'

విజయవాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : ఎన్టీఆర్ పోలీసు కమిషనర్ టాస్క్‌ఫోర్స్ ఏడీసీగా అరిటాకుల శ్రీనివాసరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గుంటూరులో అదనపు ఎస్పీ (క్రైమ్స్)గా పని చేసిన ఆయనను కొద్దిరోజుల క్రితం ఇక్కడికి బదిలీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం సీపీ రాజశేఖరబాబును కలిశారు. ఆయన ఇంతకుముందు కాకినాడ రూరల్ సీఐగా, పెద్దాపురం డీఎస్పీగా పనిచేశారు.

పాముకాటుతో మున్సిపల్ స్వీపర్ మృతి

గుడివాడ : కార్మికనగర్‌లోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల స్వీపర్ చనపతి బేబమ్మ సోమవారం ఉదయం పాముకాటుతో మృతి చెందింది. పాఠశాల పరిసరాలను శుభ్రం చేస్తుండగా పాము కాటు వేసింది. అక్కడే ఉన్న టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ నీరుడు సురేష్ హుటాహుటిన బేబమ్మను ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే ఆమె మృతి చెందారు. తాచుపామును గుర్తించి దానిని చంపేశారు.

ఆపన్న హస్తం

వరద ముంపు ప్రాంతాల్లో ఇప్పటికే ప్రభుత్వం నిత్యావసర సరుకులు, భోజనం అందజేస్తూ నిరంతరం అండగా నిలిచింది. ప్రభుత్వంతో పాటు ఎందరో దాతలు, స్వచ్ఛంద సంస్థలు అన్నదానం చేయడంతో పాటు నిత్యావసర సరుకులు, దుస్తులు అందజేస్తూ ఆపన్న హస్తం అందిస్తున్నారు.



చల్లపల్లి : రావెళ్ల ఫౌండేషన్ సేవలు అభినందనీయమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రశంసించారు. చల్లపల్లి మండలం ఆముదార్లంకలో 500 మంది వరద బాధితులకు రావెళ్ల ఫౌండేషన్ ఛైర్మన్ రావెళ్ల ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో రూ.90వేల విలువైన చీరలు పంపిణీ చేయగా, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్‌లు పాల్గొని బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు నిడమానూరి దిలీప్‌కుమార్, రావెళ్ల విజయ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు. పాత ఎడ్లంకలోనూ రావెళ్ల ఫౌండేషన్, మచిలీపట్నంకు చెందిన సూర్య సెక్యూరిటీస్ అండ్ మాన్‌పవర్ కంపెనీ ప్రొప్రయిటర్ రంగన్ వెంకట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రూ.60వేల వ్యయంతో 400 మందికి చీరలు అందించారు. వరద బాధితులకు ప్రభుత్వం మంజూరుచేసిన బియ్యం, నూనె, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలను పంపిణీ చేశారు. తహసీల్దార్ డి.వనజాక్షి ఆధ్వర్యంలో ఇన్‌చార్జి డీటీ ఘంటసాల కృష్ణమోహన్ పర్యవేక్షణలో మొత్తంగా 475 మందికి పంపిణీ చేపట్టారు. **పెడన :** పెడన పట్టణానికి చెందిన ప్రముఖ స్వచ్ఛంద సంస్థ సహాయ ఫౌండేషన్ విజయవాడ నగరంలోని పైపులరోడ్డు సెంటర్, రాజీవ్‌నగర్‌కాలనీలకు చెందిన వరద బాధితులకు రూ. 2 లక్షల విలువ గల చీరెలు, రేడీమేడ్ డ్రస్సులు పంపిణీ చేసింది. సహాయ ఫౌండేషన్ ప్రతినిధులు ఎండి ఉస్మాన్ బాషా, రౌతుల ప్రసాద్, సుమంత్, చొప్పరపు రాజు, శాంత రాజు తదితరులు పాల్గొన్నారు.

చీరలు, దుప్పట్ల పంపిణీ

వన్‌టౌన్ : వరద ప్రభావానికి తీవ్రంగా నష్టపోయిన 64వ డివిజన్ కండ్రిక ప్రాంతంలోని బాధితులకు సోమవారం టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆయన మిత్రబృందం సుమారు రూ.50 లక్షలు విలువ చేసే చీరలు, దుప్పట్లు, టవల్స్ అందచేశారు. వీటితో పాటు గ్యాస్ స్టవ్‌లు, కుక్కర్లు, సబ్బులు, షాంపులు, స్కూల్ పిల్లలకు పుస్తకాలు కూడా పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ద్వారా అందించినట్లు పట్టాభిరామ్ తెలిపారు.

పలమనేరు లారీ యజమానుల సంఘం

పటమట : ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్, ది కృష్ణా డ్రిస్టిక్టు లారీ ఓనర్స్ అసోసియేషన్‌ల సహకారంతో విజయవాడ వరద బాధితులకు చిత్తూరు జిల్లా పలమనేరు లారీ యజమానులు, వ్యాపారులు, హిందూ ముస్లిం సోదరులు సోమవారం రూ. 6 లక్షల విలువైన నిత్యావసర సరుకుల పంపిణీ చేపట్టారు. ఏపీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వైవీ. ఈశ్వరరావు, కృష్ణా డిస్ట్రిక్టు లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు నాగుమోతు రాజా, సభ్యులు రౌతు చినబాబులు పర్యవేక్షించారు. పలమనేరు లారీ యజమానుల సంఘం నాయకులు, రాష్ట్ర సంఘ సభ్యులు జిలానీ, వివిధ వ్యాపార సంఘాల నేతలు సయ్యద్ మన్సూర్, టమోటా మండి యజమాని జాఫర్, దాతలు శంకర్, కుమార్, రాజాలు పాల్గొన్నారు.

అగ్ని మినిస్ట్రీస్

ధర్నాచౌక్ : దహించు అగ్ని మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో సుమారు 400 మంది బాధితులకు రూ.1100 విలువైన నిత్యావసర సరుకులతో పాటు దుప్పట్లను పంపిణీ చేసినట్టు దహించు అగ్ని మినిస్ట్రీస్ అధ్యక్షుడు డాక్టర్ థామస్ తెలిపారు. నర్సింగ్ ఇన్స్టిట్యూట్ ప్రిన్సిపల్ విక్టోరియా, గుణదల ఆల్మైటీ లయన్స్‌క్లబ్ ఛైర్మన్ క్రిస్టోఫర్, పాస్టర్ జోసఫ్ అలెక్స్, సిస్టర్ కరిష్మా ప్రైజీ తదితరులు పాల్గొన్నారు.

వెయ్యి మందికి దుప్పట్ల పంపిణీ

భవానీపురం : అఖిల భారత యాదవ సంఘం రాష్ట్ర నాయకులు, భవానీపురం బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు మాదాల తిరుపతిరావు ఊర్మిళానగర్‌లో రూ. 2లక్షల వ్యయంతో వెయ్యి మందికి దుప్పట్లను ఆయన సోమవారం పంపిణీ చేశారు.

ఉప్పలపాటి సీతా మహాలక్ష్మి ట్రస్టు



రామలింగేశ్వరనగర్ : ఉప్పలపాటి సీతా మహాలక్ష్మి ట్రస్ట్ తరఫున రామలింగేశ్వరనగర్ వరద బాధితులకు దుప్పట్లు, వినాయక చవితి ప్రసాదంగా పులిహోర, పూర్ణాలు, కుడుములు, ఉండ్రాళ్ల కిట్‌లను 750 మందికి అందజేశారు. డీఎస్పీ గాంధీ, ట్రస్ట్ నిర్వాహకులు పాల్గొన్నారు.


జనసేన ఆధ్వర్యంలో

ఎ.కొండూరు : తిరువూరు జనసేన పార్టీ ఇన్‌చార్జీ మనుబోలు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బుడమేరు ముంపు ప్రాంతాలైన శాంతినగర్, కొండపల్లిలోని వరద బాధితులకు ఆరు క్వింటాళ్ల కూరగాయలు 300 మంది అందజేశారు. కుమార్, శ్రీకాంత్, కృష్ణారావు, పూర్ణ, నరసింహారావు, శ్రీనివాసరావు, ఫిరోజ్ పాల్గొన్నారు. **అవనిగడ్డ రూరల్ :** పులిగడ్డ పల్లెపాలెం, రేగుల్లంక గ్రామాల వరద బాధితులకు జనసేన కమిటీ మెంబర్ మండలి దయాకర్, కొట్టే వెంకటేశ్వరరావు, ఆర్గానిక్ ప్రసాద్, మహీంద్ర, డి.సంజయ్, డి.శ్రీకాంత్, సుందర్, రామిరెడ్డిల ఆర్థిక సహకారంతో మహిళలకు చీరలు, దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు అందజేశారు. సర్పంచ్ దాసరి విజయ్, ఉపసర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, పిచ్చేశ్వరరావు, మండలి శేషు, మండలి సుధీర్, గుంటూరు వినయ్, మెరుగ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం సీఎంకు చెక్కులు అందజేసిన ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు : వరద బాధితుల సహాయార్థం వివిధ ప్రాంతాల దాతలు తనకు అందించిన షుమారు ఏడున్నర లక్షల విలువైన చెక్కు లను స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ సోమవారం సీఎం చంద్రబాబుకు అందజేశారు. కానూరుకు చెందిన భవిష్య విద్యాసంస్థలు ఇచ్చిన రూ.మూడులక్షలు, కొత్తపల్లి గాంధీ రూ.లక్ష, కోనేరు బేబీ సరోజిని లక్ష, అనుమోలు బాలాజీ రూ.50 వేలు, మొగల్రాజపురానికి చెందిన తోటకూర రాజానందబాబు రూ.లక్ష, విజయవాడకు చెందిన యలమంచిలి విమలాబాయి రూ.లక్ష విలువైన చెక్కులను ఇవ్వగా సోమవారం ఎన్టీఆర్ కలెక్టరేట్‌లో చంద్రబాబుకు బోడె ప్రసాద్ అందజేశారు. దాతలకు సీఎం అభినందనలు తెలిపారు. టీడీపీ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు ఉన్నారు. **ఉయ్యూరు :** వరదబాధితుల సహాయార్థం ఉయ్యూరుకు చెందిన పరుచూరి సేవాసమితి లక్ష రూపాయల విరాళం అందజేసింది. సమితి అధ్యక్షుడు పరుచూరి శ్రీనివాసరావు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుని కలసి చెక్కును అందజేశారు. సమితి సభ్యులు రాజేంద్రప్రసాద్, అజయ్, శివ, చైతన్య, నరసింహారావు తదితరులు చంద్రబాబును కలసిన వారిలో ఉన్నారు. **హనుమాన్‌జంక్షన్‌రూరల్ :** ఓగిరాల, రామన్నగూడెం, అరుగొలను, రంగయ్యప్పారావుపేట, తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాసకేంద్రాల్లో పుట్టగుంట సతీష్‌కుమార్, చలసాని పూర్ణబ్రహ్మయ్య, చలసాని ఆంజనేయులు, ఆర్యవైశ్య సంఘం మూల్పూరి సాయికళ్యాణి, జనసేన, టీడీపీ నేతలు, దాతల సహకారంతో సుమారు 1200 మందికి పైగా వరద బాధితులకు భోజనం అందజేశారు. **చిట్టినగర్ :** కె.ఎల్.రావునగర్ వరద ముంపు బాధితులకు ఆంధ్రప్రదేశ్ ప్రయివేట్ స్కూల్స్ అసోసియేషన్ సహకారంతో సోమవారం చిట్టినగర్‌లో దుప్పట్లు, బిస్కెట్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్‌ను పంపిణీ చేశారు. జనార్థన్, సుందరరావు, గణపతి, ఎంఎస్.బేగ్, గుర్రం కొండ, డీ. ప్రభుదాస్ పాల్గొన్నారు

టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో..



గుడివాడ రూరల్ : గుడివాడ రూరల్ మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వాసే మురళీ తదితరుల ఆధ్వర్యంలో 1500 మందికి ఆహార పొట్లాలను నందివాడ మండలం తదితర ప్రాంతాలకు పంపించారు. అట్లూరి వెంకట రమణ ప్రసాద్, అంగడాల వీర్రాజు, సమ్మెట బ్రహ్మాజీ, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. **నందివాడ :** నందివాడ జిల్లా పరిషత్ హైస్కూల్ పునరావాస కేంద్రంలో ఎన్నై కుడిపూడి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు పండ్లు పంపిణీ చేశారు. పెద్ది రమణ, మొగసాల అప్పలదాసు, రాజేష్, వెంకటరమణ, జ్యోతి, తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. **పెనుగంచిప్రోలు :** అనిగండ్లపాడు వరద బాధితులు 50 మందికి అమ్మానాన్న సోషల్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 మందికి బియ్యం, నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. దోర్నాల నాగయ్య, సభ్యులు దోసపాటి దానయ్య, దానయ్య, దోసపాటి నాగేశ్వరరావు పాల్గొన్నారు

పవన్ కళ్యాణ్ స్ఫూర్తితో పంచాయతీలు అభివృద్ధి పథంలో పయనించాలి

అవనిగడ్డ, సెప్టెంబరు 9 : జనసేన అధ్యక్షులు, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను స్ఫూర్తిగా తీసుకుని గ్రామపంచాయతీలు అభివృద్ధి పథంలో పయనించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. వరద ప్రభావిత గ్రామాలకు పవన్ కళ్యాణ్ ప్రకటించిన నాలుగు కోట్ల విరాళంలో భాగంగా నియోజకవర్గంలో వరద ముంపుకు గురైన తొమ్మిది పంచాయతీలకు రూ.9 లక్షల మొత్తాన్ని అందజేయగా, చెక్కులను బుద్ధప్రసాద్ సోమవారం గాంధీక్షేత్రంలో అందజేశారు. గుడివాక శేషుబాబు మల్లిఖార్జునరావు, రాజులపాటి కళ్యాణి, ఎంపీపీ సుమతిదేవి, సర్పంచ్‌లు పాల్గొన్నారు. **కంకిపాడు :** గ్రామ పంచాయతీలకు డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అందించిన రూ.లక్ష చెక్కులను సోమవారం ఎంపీ బాలశౌరి సర్పంచ్‌లకు అందజేశారు. టీడీపీ, జనసేన పార్టీ సమన్వయ కర్త ముప్పా రాజా అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పెనమలూరు, పామర్రు ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వర్ల కుమార్ రాజా జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మండవ రాజేష్, టీడీపీ మండల అధ్యక్షులు సుదిమళ్ల రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

ముస్తాబాద మార్గంలో గంజాయిబ్యాచ్ హల్‌చల్

- సామాన్యులపై దాడులు ● ఓ వ్యక్తికి తీవ్ర గాయాలు

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

రామవరప్పాడు నుంచి ముస్తాబాద వెళ్లే దారిలో బ్లేడ్ బ్యాచ్..గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేస్తోంది. ఫ్లైవోవర్ దిగి ముస్తాబాద వైపు తిరిగే మలుపులో కొద్ది రోజుల క్రితం ఓ మద్యం దుకాణాన్ని ఏర్పాటు చేశారు. ఇక్కడ అనధికారికంగా బార్ నిర్వహిస్తున్నారు. గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ యువకులు ఇక్కడ మద్యం తాగి ఆ దారిన పోయేవారిపై దాడులకు తెగబడుతున్నారు. వర్షాలకు ఈ రో డ్డంతా మునిగిపోవడంతో ముస్తాబాద రోడ్డులోని గోడౌన్లు, ఇతర కార్యాలయాల వారు తమ వాహనాలను మలుపు వద్ద ఉంచి వెళుతున్నారు. సోమవారం సాయంత్రం అక్కడ నిలిపి ఉంచిన కారుపై గంజాయి బ్యాచ్ కూర్చొని మద్యం తాగారు. వాహన యజమాని వచ్చి వాహనం దిగమని వారిని కోరడంతో దాడికి తెగబడ్డారు. ఇదేమని ప్రశ్నించిన స్థానికులపైన కత్తులతో దాడి చేయడం గమనార్హం. గంజాయిబ్యాచ్ చేసిన దాడిలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడగా ఆయన్ను ఆంధ్రా ఆసుపత్రిలో చేర్చారు. గంజాయి బ్యాచ్ నిత్యం గొడవలకు దిగడంతో ముస్తాబాద వెళ్లే మహిళలు బిక్కుబిక్కుమంటూ వెళ్లాల్సిన పరిస్థితి. ఈ మ ద్యం షాపు సమీపంలోనే ఎస్ఎల్వీ గ్రాండ్ విల్లాల్లో రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత నివాసం ఉంటున్నారు. హోం మం త్రి నివాసానికి కూతవేటు దూరంలోనే గంజాయి బ్యాచ్, బ్లేడ్ బ్యాచ్ ఆగడాలను పోలీసులు అదుపు చేయలేకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మద్యం దుకాణం వద్ద అనధికార మద్యం విక్రయాలను అడ్డుకోవాలని.. పోలీసు గస్తీ ఏర్పాటు చేయాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

ప్రాంతీయ కార్యాలయం, ప్లాట్ నెం. 41, యస్.బి.ఐ. ఎదురుగా, గురునానక్ రోడ్, శ్రీ కనకదుర్గా ఆఫీసర్స్ కాలనీ, విజయవాడ.

పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ వాయిదా ప్రకటన

ఆంధ్రజ్యోతి దినపత్రికలో తేది: 10-08-2024న ప్రచురించబడిన శ్రీ బి. త్రివిక్రమ్ వారిచే సర్వే నెం: 801, పరిటాల గ్రామం, కంచికచర్ల మండలం, యన్.టి.ఆర్. జిల్లా నందు 2.361 హెక్టార్ల విస్తీర్ణంలో సాలీనా 25,000 క్యూబిక్ మీటర్ల రోడ్ మెటల్, బిల్డింగ్ స్టోన్, బండరాళ్లు & రైల్వే బాలాస్ట్ మైనింగ్ త్రవ్వకమునకు సంబంధించిన ప్రజాభిప్రాయ సేకరణ తేది: 11-09-2024న మధ్యాహ్నం గం॥ 12-30 ని॥లకు జరగవలసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిరవధికంగా వాయిదా వేయడం జరిగినది. EIA ప్రకటన నెం. ఎస్.ఒ.1533 తేది: 14-09-2006 ననుసరించి తదుపరి ప్రజాభిప్రాయ సేకరణ తేదిని పత్రికా ప్రకటన ద్వారా తెలియజేయబడును.

సం/- పర్యావరణ ఇంజనీర్
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి
ప్రాంతీయ కార్యాలయం, విజయవాడ

ప్రదేశం: విజయవాడ
తేది: 09-09-2024



పాయకాపురంలో వరదనీటిలోనే కాలనీలు

కనీవినీ ఎరుగని.. కష్ట కాలం!

కష్టాల్లో ముద్రణా రంగం

- రూ. 450 కోట్ల భారీ నష్టం
- 18 ప్రింటింగ్ ప్రెస్‌లు, పబ్లిషింగ్ హౌస్‌లు
- మెషినరీకి రూ. 50 కోట్లు
- స్కూలు పాఠ్యపుస్తకాల నష్టం రూ.200 కోట్లు
- 1500 టన్నుల పేపర్ డ్యామేజీ
- 30 లక్షల పుస్తకాలు వరద పాలు
- 5 వేలమంది కార్మికులకు ఉపాధి దెబ్బ

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

బుడమేరు విలయంలో అనేక రంగాలు చిక్కుకుని విలవిల్లాడుతున్నాయి. స్వయం ఉపాధి, అసంఘటిత రంగాలు వరద అంతులేని నష్టాన్ని మిగిల్చింది. వాటిలో ముద్రణా రంగం తీవ్ర నష్టాన్ని చవిచూసింది. బుడమేరు ప్రభావం ప్రింటింగ్ ప్రెస్ రంగాన్నే కాదు.. ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను ముంచేసి అపార నష్టాన్ని కలిగించింది. ప్రింటింగ్ ప్రెస్‌లు, ఆఫ్‌సెట్ ప్రింటర్స్, వినైల్ ప్రింటింగ్ ప్రెస్‌లు, పబ్లిషింగ్ హౌస్‌లు, పబ్లిషర్ల కార్యాలయాలు ఎక్కువగా మధ్య నియోజకవర్గంలో రాజరాజేశ్వరిపేట (పాత, కొత్త), కండ్రిక, ప్రకాష్‌నగర్, పాయకాపురం, సింగ్‌నగర్ వంటి ప్రాంతాలలోనే నెలకొల్పారు. భారీ ఎత్తున మెటీరియల్ తరలించటానికి రవాణా పరంగా అందుబాటులో ఉండటం వల్లనే ఇక్కడ వీటిని ఏర్పాటు చేశారు. ముంపునకు గురైన ప్రాంతంలో 18 ప్రింటింగ్ ప్రెస్‌లు ఉన్నాయని ఏపీ వెబ్‌ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు మోహన్ చెబుతున్నారు.

అంతులేని నష్టం..

ప్రింటింగ్ ప్రెస్‌ల్లో ఎనిమిది అడుగుల మేర నీరు రావటంతో వరద అంతులేని నష్టం విగిల్చింది. రూ. 450 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు తెలుస్తోంది. దీనిలో మెషినరీకి రూ.50 కోట్లు నష్టం వాటిల్లగా.. రూ.200 కోట్లు ముద్రించిన పుస్తకాలకు జరిగింది. వీటిలో వచ్చే విద్యా సంవత్సరానికి అందించాల్సిన 30 లక్షల పాఠ్యపుస్తకాలు వరదపాలయ్యాయని పబ్లిషింగ్ యజమానులు చెబుతున్నారు. పేపర్ బండిల్స్ 1500 టన్నుల వరకు డ్యామేజీ ఏర్పడిందని గుర్తించారు. ఈ పేపర్ బండిల్స్ వల్ల వచ్చిన నష్టం రూ.150 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. రూ.450 కోట్ల భారీ నష్టాన్ని ఎలా భర్తీ చేసుకోవాలన్న దానిపై ప్రింటింగ్ యాజమాన్యాలు అంతర్మథనం చెందుతున్నాయి. తమకు జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళతామని మోహన్ చెబుతున్నారు.

కార్మికులకు కష్టకాలం..

ముద్రణా సంస్థల్లో సుమారు ఐదు వేలమందికి పైగా పనిచేస్తున్నారు. వరద ముంపు వల్ల మెషినరీని లైన్‌లో పెట్టడానికి చాలా రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. వీరందరికీ కొద్దికాలం జీవనోపాధి కోల్పోయే ప్రమాదం ఉందని ముద్రణా సంస్థలు భావిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం నుంచి సహాయాన్ని కోరాలని ప్రింటింగ్ రంగం భావిస్తోంది. సబ్సిడీపై కొత్త మెషీన్లు, విద్యుత్ బిల్లుల రద్దు, రుణాల రీ షెడ్యూలింగ్, బ్యాంకు రుణాలపై ఆరునెలల మారటోరియం, ఇతర సబ్సిడీలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు వంటి సహాయ సహకారాలను, ప్రోత్సాహాలను రాష్ట్ర ప్రభుత్వం నుంచి కోరాలని భావిస్తున్నాయి.



ముంపులో బంకులు!


వరద నీటిలో పెట్రోలు బంకు

- నీట మునిగిన 15 పెట్రోల్, డీజిల్ బంకులు
- 6,75,000 లీటర్ల ఆయిల్‌లోకి నీరు
- ప్యానెల్ బోర్డులు, మెషినరీ, ఎలక్ట్రానిక్స్ డ్యామేజీ
- ఇన్సూరెన్స్, ఆయిల్ కంపెనీల నుంచి కొంత మేర రికవరీకి అవకాశం
- రూ. 60 లక్షల వరకు నష్టం అంచనా
- ఇన్సూరెన్స్ కట్టని బంకులు సగానికి పైగానే
- పాత బకాయిలు చెల్లించాలని ప్రభుత్వానికి డీలర్ల అభ్యర్థన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/వన్‌టౌన్)

బుడమేరు వరద ముంపులో ఉన్న పెట్రోల్, డీజిల్ బంకులకు భారీ నష్టం వాటిల్లింది. నష్టంపై ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి ఎంత మేర సహాయం రావచ్చు.. మెషినరీ నష్టానికి ఆయిల్ కంపెనీల నుంచి సహకారం.. ఇన్సూరెన్స్ లేని బంకుల యాజమాన్యాలకు ఎంత నష్టం వస్తుంది.. తదితర అంశాలపై ఉమ్మడి కృష్ణాజిల్లా పెట్రోల్ అండ్ డీజిల్ డీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కసరత్తు ప్రారంభించింది. బంకుల్లో ఇప్పటికీ నాలుగు అడుగుల మేర వరద నీరు ఉండటం వల్ల పూర్తిస్థాయి నష్టం అంచనా వేయలేకపోతున్నారు.

● ప్రాథమిక అంచనా ప్రకారం 15 బంకులు బుడమేరు వరద ముంపునకు గురైనట్టు గుర్తించారు. వాటిలో పెట్రోల్, డీజిల్‌తో పాటు సీఎన్‌జీ ప్లాంట్స్ కూడా రెండు, మూడు ఉన్నాయి. సీఎన్‌జీ ప్లాంట్లకు సంబంధించి వరద తగ్గితే కానీ ఏమీ చెప్పలేని పరిస్థితి. పెట్రోల్, డీజిల్ బంకులకు మొత్తం 6,75,000 లీటర్ల డీజిల్, పెట్రోల్‌కు నష్టం వాటిల్లినట్టు సమాచారం. పెట్రోల్ 3,75,000లీటర్లు, డీజిల్ 3,00,000 లీటర్ల చొప్పున వరద ముంపునకు గురైనట్టు గుర్తించారు.

● సాధారణంగా బంకుల ఆయిల్స్ అంతా అండర్ గ్రౌండ్ ట్యాంకుల్లో స్టోర్ చేస్తారు. పైన మ్యాన్‌హోల్స్‌తో కవర్ చేస్తారు. సాధారణంగా వర్షాలను దృష్టిలో ఉంచుకుని వర్షపునీరు చేరకుండా ప్లాస్టిక్ కవర్లను వీటిపై ఏర్పాటు చేస్తారు. అయితే ఇవి కేవలం వర్షానికి ఇబ్బందులు రాకుండా ఉంటుంది. ఐదారడుగుల వరద నాలుగు రోజుల పాటు నిల్వ ఉండటంవల్ల ఆయిల్‌లోకి నీరు చేరిపోయిందని, ఆయిల్ అంతా వృథా అయినట్టు 15 బంకుల యజమానులు జిల్లా సంఘం దృష్టికి తీసుకువచ్చారు. ఒక్కో బంకుకు డీజిల్, పెట్రోల్, మెషినరీ, ప్యానెల్ బోర్డుల పరంగా అన్నీ కలిపితే రూ.50లక్షల నుంచి రూ.60 లక్షల వరకు నష్టం జరిగిందని తెలుస్తోంది. 15 బంకులకు కలిపి రూ. 9 కోట్ల మేర నష్టం వాటిల్లినట్టు ప్రాథమిక అంచనా. ఇది ఇంకా పెరిగే అవకాశం ఉందని సంఘ నేతలు చెబుతున్నారు.

● పెట్రోల్ బంకుల యాజమాన్యాలు చాలా వరకు నష్టాన్ని ఇన్సూరెన్స్ కంపెనీల నుంచి క్లెయిమ్ పొందే అవకాశం ఉంది. కొంతమంది చిన్న బంకుల నిర్వాహకులు కమీషన్లు గిట్టుబాటు కాక ఇన్సూరెన్స్‌లు కట్టలేదని తెలుస్తోంది. ఈ బంకులు సగానికి పైగా ఉన్నాయి. వీటికి ఇన్సూరెన్స్ వచ్చే అవకాశం ఎంతమాత్రం లేదు. మెషినరీ, ప్యానెల్ బోర్డులకు నష్టం మాత్రం కొంత మేర ఆయిల్ కంపెనీలు పూడ్చే అవకాశం ఉంది. ఇన్సూరెన్స్ లేని బంకుల నష్టాన్ని ఎలా పూడ్చుకోవాలన్నదానిపై సంఘం మల్లగుల్లాలు పడుతోంది. తమకు సంబంధం లేదని ఇప్పటికే ఆయిల్ కంపెనీలు తేల్చి చెప్పాయని చెబుతున్నారు. తమను ప్రభుత్వమే ఆదుకోవాలని, వరద పూర్తిగా తగ్గితే ఖచ్చితమైన అంచనాతో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రతిపాదనలు అందజేయనున్నట్టు చెప్పారు. పెట్రోల్, డీజిల్ డీలర్లను ఆదుకోవాలని సంఘం కోరుతోంది.

● ఆయిల్ కంపెనీలు గతంలో అప్పుమీద ఆయిల్ ఇచ్చేవని.. పదేళ్ల నుంచి ఇవ్వటం లేదని అంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వ కార్యక్రమాలకు సంబంధించి వినియోగించే వాహనాలకు అప్పు ప్రాతిపదికన ఆయిల్ అందించటం జరిగిందని చెబుతున్నారు. బుడమేరు విపత్తు సందర్భంలో కూడా ప్రజలకు ఆహారం, నిత్యావసరాలు అందించే వాహనాలకు పెద్ద ఎత్తున డీజిల్‌ను అప్పుగా అందిస్తున్నామంటున్నారు. బకాయి బిల్లులను వెంటనే చెల్లించి ఆదుకోవాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నారు.

బకాయిలు చెల్లిస్తే ఒడ్డున పడతాం


చుంచు నరసింహారావు, ఉమ్మడి కృష్ణా జిల్లా పెట్రోలియం అండ్ డీజిల్ డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

బుడమేరు బంకులకు నష్టాన్ని తెచ్చి పెట్టింది. ఇన్సూరెన్స్‌లు లేని వాటికి కొంతయినా నష్టపరిహారం ప్రకటించాల్సిందిగా కోరుతున్నాం. ప్రభుత్వాలకు ఎంతగానో సహకరిస్తుంటాం. ప్రభుత్వ కార్యక్రమాలకు అప్పు ప్రాతిపదికన డీజిల్‌ను అందిస్తూ సహకారం అందించాం. ఇప్పుడు కూడా అందిస్తూనే ఉన్నాం. మాకు కష్టం వచ్చింది. బంకులను నిర్వహించలేని పరిస్థితి. పెండింగ్ బిల్లులు చెల్లించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.


వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటిస్తున్న మంత్రి పార్థసారథి

సహాయ చర్యల్లో మరింత ముందుకు..

- ముంపు ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి పార్థసారథి పర్యటన

విజయవాడ లీగల్ : 'మాకేం కాదు.. ప్రస్తుతం మమ్మల్ని బాగా చూసుకొనే ముఖ్యమంత్రి, మంత్రులు వున్నారు.. అంటూ మేము ఎక్కడికి వెళ్లినా ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.. ఆ విశ్వాసం, ఆ నమ్మకమే సహాయక చర్యలను మరింత ముమ్మరంగా చేపట్టేందుకు ముందుకు నడిపిస్తోంది.' అని రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార, పౌరసరఫరాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం కృష్ణలంకలోని 21వ డివిజన్ పాత స్టేషన్ వీధి చివర వరద ప్రభావిత ప్రాంతాల్లో ఆయన పర్యటించి బాధితులను పరామర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న సహాయంపై ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం భారీ వర్షాలు, వరదల వల్ల నష్టపోయిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సహాయం అందించాలనే కృత నిశ్చయంతో వుందని, ఈ రోజు నుంచి అంచనాలను రూపొందించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయని తెలిపారు. ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు.


క్షేత్రస్థాయిలో విధులు నిర్వహించండి

- వైద్య ఆరోగ్యశాఖ అదనపు డైరక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి



విజయవాడ లీగల్, సెప్టెంబరు 9 : పునరావాస కేంద్రాల్లో తలదాచుకొంటున్న ప్రజలకు వైద్యసహాయం అందిస్తున్నట్టు వైద్య ఆరోగ్య శాఖ అదనపు డైరక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వరద ముంపునకు గురైన 32 ప్రాంతాల్లో 161 మొబైల్ మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశామని, అంటువ్యాధులు సోకకుండా అధికారులందరూ అప్రమత్తంగా వున్నారన్నారు. మొబైల్ మెడికల్ క్యాంపుతో పాటుగా పునరావాస కేంద్రాల్లో ఒక మెడికల్ అధికారి, నలుగురు సిబ్బంది 24 గంటలూ విధులు నిర్వహిస్తున్నట్టు తెలియజేశారు. విజయవాడ నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో అంటు వ్యాధులు సోకకుండా సర్వే నిర్వహించేందుకు, కృష్ణా, గుంటూరు, నెల్లూరు జిల్లాలోని క్షేత్ర స్థాయి సిబ్బందికి 24 గంటల నుంచి పూర్తిగా శిక్షణ ఇచ్చి వరదకు గురైన ప్రాంతాలను క్లస్టర్‌గా విభజించి డోర్ టు డోర్ సర్వే నిర్వహించి మెడికల్ కిట్స్ అందచేయనున్నట్టు తెలిపారు. అవసరమైతే ఎమర్జన్సీ వైద్య సేవలు అందించేందుకు 104 ద్వారా మొబైల్ క్లినిక్‌లు నిర్వహిస్తున్నట్టు ఆమె తెలిపారు. వైద్య ఆరోగ్య, మలేరియా సిబ్బంది అందరూ అప్రమత్తంగా వుండాలన్నారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని ఆమె స్పష్టం చేశారు.

రాష్ట్ర అభివృద్ధే చంద్రబాబు లక్ష్యం : యార్లగడ్డ



గన్నవరం, సెప్టెంబరు 9 : రాష్ట్రం కోసం నలభైనాలుగు సంవత్సరాలు సేవ చేసిన చంద్రబాబును గతేడాది అరెస్టు చేసి న్యాయానికి సంకెళ్లు వేశారని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. అక్రమ కేసులు పెట్టి రాజకీయ లబ్ధి పొందుదామని వైసీపీ భావించిందని.. కానీ అది వికటించిందన్నారు. సోమవారం విజయవాడలో చంద్రబాబును అరెస్టు చేసి ఏడాది అయిన సందర్భంగా జరిగిన సభలో యార్లగడ్డ మాట్లాడారు. చంద్రబాబుపై తప్పుడు కేసులు పెట్టి అరెస్టు చేయటం దుర్మార్గమన్నారు. పెళ్లి రోజునా కలెక్టరేట్‌లోనే ఉండి చంద్రబాబు పని చేస్తున్నారని ఇది ఆయన పనితీరుకు నిదర్శనమన్నారు. జగన్ ఇప్పటికైనా తీరు మార్చుకోవాలని హితవు పలికారు. తల్లికే నచ్చనివాడు రాష్ట్ర ప్రజలకు ఎలా నచ్చుతాడన్నారు. వైసీపీ నాయకులు ఇప్పటికైనా చంద్రబాబును చూసి ప్రజాస్వామ్యంలో ప్రజల కోసం పని చేయాలని హితవు పలికారు.


పాలకవర్గ సమావేశంలో మాట్లాడుతున్న చలసాని ఆంజనేయులు

చంద్రబాబు స్ఫూర్తిగా.. అభివృద్ధే ధ్యేయం

- కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, సెప్టెంబరు 9 : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్ఫూర్తితో విపత్కర పరిస్థితుల్లోనూ పాడిరైతు సంక్షేమంతో పాటు వినియోగదారులకు నాణ్యమైన పాల ఉత్పత్తులను అందించడమే కృష్ణామిల్క్ యూనియన్ ధ్యేయమని చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. వీరవల్లి విజయ ఫ్యాక్టరీలో సోమవారం పాలకవర్గ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. వరదల వల్ల విజయవాడలోని ఫ్యాక్టరీ నీటమునిగి నష్టం వాటిల్లినా పాడిరైతులకు చెల్లింపులు చేసామని, వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను సకాలంలో అందించామని తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన ఉత్పత్తులను అందిస్తూ వచ్చిన లాభాల్లో 78శాతం పైగా పాడిరైతు సంక్షేమానికి, పాడి పరిశ్రమ అభివృద్ధికి సహకారమందించేందుకు పాలకవర్గం నిర్ణయం తీసుకున్నదని చైర్మన్ అన్నారు.


ఫైరింజన్లతో వీధులను శుభ్రం చేస్తున్న సిబ్బంది


జేసీబీతో డ్రెయిన్లలో పూడికతీత


ముంపు ప్రాంతాల్లో చెత్త, వ్యర్థాలను తొలగిస్తున్న కార్మికులు

శరవేగంగా సహాయ చర్యలు

పారిశుధ్య పనుల్లో వేలాది కార్మికులు.. 66 సచివాలయాల్లో 100 శాతం పనులు పూర్తి



చిట్టినగర్ : పారిశుధ్య పనులకు నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రణాళిక సిద్ధం చేసింది. వేలాది మంది పారిశుధ్య కార్మికులతోపాటు, వందలాది వాహనాలతో వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపడుతోంది. వీధులు శుభ్రం చేయటంతోపాటు చెత్త వ్యర్థాలను తొలగించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటికే 66 సచివాలయాల్లో 100 శాతం పనులను పూర్తి చేసింది. మిగిలిన సచివాలయాల్లో పనులు శరవేగంగా పూర్తి చేసేందుకు కమిషనర్ ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు సోమవారం కండ్రిక, గుణదల ఇన్నర్ రింగ్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో వీఎంసీ కమిషనర్ హెచ్.ఎం.ధ్యాన చంద్ర పర్యటించి పనులను పరిశీలించారు. పురపాలక పట్టణాభివృద్ధి శాఖ నుంచి 32 మంది ఐఏఎస్ ఆఫీసర్లు, 149 మంది వార్డు సచివాలయ స్పెషల్ ఆఫీసర్లు, 62 మంది పారిశుధ్య నోడల్ ఆఫీసర్లు, 950 మంది శానిటేషన్ సూపర్‌వైజర్లు, 6830 మంది పారిశుధ్య కార్మికులతో వరద ప్రభావిత ప్రాంతాల్లో శరవేగంగా పనులు చేయిస్తున్నట్టు చెప్పారు. 154 ట్రాక్టర్లు, 100 టిప్పర్లు, 59 జేసీబీలు, 14 బాబ్‌కాట్‌లు, 10 డోజర్లు, ఆరు పొక్లైనర్లు, రెండు క్రేన్లు, 25 కంపెక్టర్లు మొత్తం 370 వాహనాలను వినియోగిస్తున్నారు. పేరుకుపోయిన బురద శుభ్రం చేసేందుకు 110 ఫైర్ ఇంజన్‌లు ఏర్పాటు చేసి 30545 ఇళ్లను ఫైర్ గన్స్‌తో శుభ్ర పర్చారు. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు బయటకు తీసేందుకు 238 డీ వాటరింగ్ పంపులు నిత్యం పనిచేస్తున్నాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో 458 కిలోమీటర్ల రోడ్లను 90శాతం శుభ్రం చేశామన్నారు. 574 మెట్రిక్ టన్నుల వ్యర్థాలను బయటకు తరలించారు. ప్రతి రోజు బ్లీచింగ్, డ్రోన్‌ల సహాయంతో లిక్విడ్స్ స్ప్రే చేస్తున్నారు. ప్రతి రోజు డ్రెయిన్లలో డీసిల్టింగ్ పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. 421 కిలోమీటర్ల మేరకు డీసిల్టింగ్ పనులు చేశామని, 20 డ్రోన్ల సహాయంతో బయో ఎంజీం మలేరియా లార్వా సైడ్ ఆయిల్ స్ప్రే చేస్తున్నామన్నారు.

ముంపులో పారిశుధ్య కార్మికులు

- విధులకు రావాలని అధికారుల ఆదేశాలు
- లేకపోతే తొలగిస్తామని నోటీసులు

చిట్టినగర్, సెప్టెంబరు 9 : వీఎంసీలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులు ఎక్కువ మంది అజిత్‌సింగ్ నగర్, పాయకాపురం, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో నివాసం ఉంటారు. ముంచుకొచ్చిన వరద ఆ కుటుంబాలను ముంచేసింది. ఆ బాధల్లో ఉన్న వారికి వీఎంసీ అధికారులు నోటీసులతో షాక్‌లు ఇస్తున్నారు. వరద ప్రభావం తగ్గడంతో నగరంలో పారిశుద్ధ పనులు జోరుగా సాగుతున్నాయి. ఇందుకోసం ఇతర మున్సిపాలిటీల నుంచి సిబ్బందిని రప్పించారు. వరద కారణంగా విధులకు దూరంగా ఉన్న కార్మికులకు వీఎంసీ అధికారులు ఇప్పుడు నోటీసులు జారీ చేస్తున్నారు. పారిశుధ్య విధులకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. కానిపక్షంలో విధుల నుంచి తొలగిస్తామని అందులో హెచ్చరించారు. దీనితో వారు మనోవేదనకు లోనవుతున్నారు. అధికారులు జారీ చేసిన ఈ నోటీసులను తక్షణమే వెనక్కి తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. వరదల్లో సర్వం కోల్పోయిన పారిశుధ్య కార్మికులకు 15రోజులపాటు వేతనంతోక ఊడిన సెలవు ఇవ్వాలి కోరారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి..

లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు వెంటనే సురక్షిత ప్రాంతాలకు తరలిరావాలని కమిషనర్ ధ్యానచంద్ర సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పలు ప్రాంతాల్లో భారీగా వర్షాలు కురుస్తుండటంతో బుడమేరుకు ఎప్పుడైనా ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం ఉందని పేర్కొన్నారు. ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రజలు సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్లాలన్నారు.

చంద్రబాబు లేకుంటే భయానకమే..

- ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని)


వరద బాధితులకు భోజనం వడ్డిస్తున్న ఎంపి కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే బొండా ఉమా తదితరులు

వన్‌టౌన్ : విజయవాడను ముంచెత్తిన వరద ధాటికి ముఖ్యమంత్రిగా చంద్రబాబు కాకుండా వేరొకరు ఉన్నట్టయితే పరిస్థితి భయానకంగా ఉండేదని ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అన్నారు. విపత్తును ఎదుర్కోవటం చంద్రబాబు వల్లే సాధ్యమైందని ఆయన స్పష్టం చేశారు. 64వ డివిజన్ కండ్రికలో ఎంపీ సొంత నిధులతో వరద బాధితులకు అన్నవితరణ చేశారు. ఈ సందర్భంగా సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్‌లతో కలిసి బాధితులకు భోజనాలను వడ్డించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ జగన్ రెడ్డి బురద రాజకీయాలు మానుకోవాలన్నారు. బాధితులకు సాయం చేయడంలో ఎన్డీయే కార్యకర్తలు, నాయకులు ఎక్కడా వెనకడుగు వేయలేదని చెప్పారు. మరో రెండు రోజుల్లో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని తెలిపారు. బుడమేరు వరద విపత్కర పరిస్థితిని సీఎం చంద్రబాబు అహర్నిశలు సమీక్షిస్తూ స్వయంగా ముంపు ప్రాంతాల్లో పర్యటించి బాధితుల కష్టాలను తెలుసుకుని సకల చర్యలు తీసుకున్నారని కొనియాడారు. చంద్రబాబే లేకుంటే ఎంతో భయానక పరిస్థితులు ఎదురయ్యేవన్నారు. మంగళవారం నుంచి దుస్తులు, దుప్పట్లు ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో పంపిణీ చేస్తారని తెలిపారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం..

వరద బాధితులను ఆదుకునేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ఆర్థిక సహాయం ప్రకటించనున్నారని ఎంపీ అన్నారు. 61వ డివిజన్‌లో యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల కిట్ల పంపిణీ కార్యక్రమంలో ఎంపీ పాల్గొని మాట్లాడుతూ, పాడైపోయిన టీవీలు, ఫ్రిజ్‌లు, వాషింగ్ మిషన్లను రిపేరు చేయించేందుకు ప్రభుత్వ సహకారంతో బొండా ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. బాధితులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రముఖ కంపెనీలు ముందుకు రావాలన్నారు.

సుధీర్ టింబర్ డిపో వ్యవస్థాపకుడు, పారిశ్రామికవేత్త నూకల లింగమూర్తి కన్నుమూత



తోట్లవల్లూరు, సెప్టెంబరు 9 : యాకమూరుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, సుధీర్ టింబర్ డిపో వ్యవస్థాపకులు, ఆలిండియా ఆర్యవైశ్య మహాసభ మాజీ ఉపాధ్యక్షులు నూకల లింగమూర్తి(82) సోమవారం కన్నుమూశారు. అస్వస్థతతో కొద్ది రోజులుగా విజయవాడ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందారు. లింగమూర్తి మృతదేహాన్ని యాకమూరు స్వగృహానికి తీసుకురాగా రాజకీయ, వ్యాపార ప్రముఖులు సందర్శించి ఘన నివాళులర్పించారు. పామర్రు మండలం కురుమద్దాలిలో నూకల సత్యనారాయణ, లక్ష్మీకాంతంకు జన్మించిన లింగమూర్తి అంచెలంచెలుగా పారిశ్రామికవేత్త స్థాయికి ఎదిగారు. సుధీర్ టింబర్ డిపోను రాష్ట్రంలోనే ప్రముఖ కలప వ్యాపార సంస్థగా తీర్చిదిద్దారు. అనేక వ్యాపార సంస్థలను నెలకొల్పి సుధీర్ గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్‌గా పేరుగాంచారు. రాష్ట్ర ఉత్తమ పారిశ్రామికవేత్త అవార్డును లింగమూర్తి పొందారు. లింగమూర్తికి నూకల వెంకట శేషగిరిరావు, నూకల వెంకట సాంబశివరావు ఇద్దరు కుమారులు, కుమార్తె శేషారత్నం ఉన్నారు. లింగమూర్తి అంత్యక్రియలను సాయంత్రం నిర్వహించారు.

ఫణి కృష్ణ మృతదేహం లభ్యం



గన్నవరం : కేసరపల్లి బుడమేరులో కొట్టుకుపోయిన కలిదిండి ఫణి కృష్ణ మృతదేహం సోమవారం లభ్యమైంది. గన్నవరం సీఐ శివ ప్రసాద్ పర్యవేక్షణలో ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టగా.. బుడమేరుకు కొద్ది దూరంలోనే ముళ్ల కంచెల్లో చిక్కుకుని ఉన్నాడు. సోమవారం మధ్యాహ్నం ఫణికృష్ణ మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. శనివారం రాత్రి ఫణికృష్ణ గన్నవరం నుంచి కంకిపాడు వైపు వెళుతూ బుడమేరులో కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే.


బాధితులకు దుస్తులు పంపిణీ చేస్తున్న పోలీసులు

బాధితులకు అండగా 'కాప్స్'

విజయవాడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి) : నిన్నటి వరకు వరద సహాయక చర్యల్లో నిమగ్నమైన పోలీసులు ఇప్పుడు వారికి అండగా నిలుస్తున్నారు. అనేక స్వచ్ఛంద సంస్థలు, సేవా సంఘాలు బాధితులకు ఆహారాన్ని అందజేశాయి. వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులకు పోలీసులు తమ వంతు సహకారం చేస్తున్నారు. సీపీ రాజశేఖరబాబు విజయవాడలో వచ్చిన వరదల గురించి హైదరాబాద్‌లో ఉన్న ఐటీ కంపెనీలతో మాట్లాడారు. వారి సహకారంతో దుప్పట్లు, దుస్తులు, మాస్క్‌లను న్యూరాజరాజేశ్వరిపేటలో సోమవారం అందజేశారు. బాధితులు పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఊర్మిళానగర్‌లో డ్రైనేజ్ పనులను పరిశీలిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు



వరదలో బయటకెళ్లొద్దు

- పెన్షన్ వచ్చే నెలలోనైనా తీసుకోవచ్చు: సీఎం
- బెజవాడ ముంపు ప్రాంతాల్లో పర్యటన
- ఉత్సాహంగా ఆయన వద్దకు వచ్చిన బాధితులు

విజయవాడ(వన్‌టౌన్), సెప్టెంబరు 9: సామాజిక భద్రతా పెన్షన్‌ను మరుసటి నెలలో అయినా తీసుకోవచ్చని, వరదలో ప్రాణాలకు తెగించి బయటకు వెళ్లవద్దని సీఎం చంద్రబాబు సూచించారు. సోమవారం తొమ్మిదో రోజు కూడా ఆయన బెజవాడ వరద బాధిత ప్రాంతాల్లో పర్యటించారు. ఊర్మిళానగర్, కబేలా సెంటర్, సింగ్‌నగర్, పైపుల రోడ్డు తదితర ప్రాంతాల బాధితులతో మాట్లాడారు. వారంతా ఎంతో ఉత్సాహంగా ఆయన వద్దకు వచ్చారు. గత తొమ్మిది రోజులుగా వరద ప్రభావిత ప్రాంతాలలో పర్యటించి తమ కష్టాలను తెలుసుకుంటూ సాయం చేస్తున్నందుకు ధన్యవాదాలు తెలియజేశారు. కొందరు మహిళలైతే మీ ఆరోగ్యం కూడా జాగ్రత్తగా చూసుకోవాలని ఆయన్ను కోరారు. నిలువు లోతు నీళ్లలో ప్రాణాలకు తెగించి బయటకు వెళ్లి పెన్షన్ తీసుకుంటున్నామని ఓ బాధితురాలు చెప్పింది. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. పెన్షన్లు వచ్చేనెలలో తీసుకోవచ్చని, అందుకు ఎలాంటి ఇబ్బంది లేదని తాను చెప్పానని గుర్తుచేశారు. అందరూ అర్థం చేసుకోవాలని, ఇబ్బందులు పడకూడదని అన్నారు. ఈ సందర్భంగా ఎంఏ ఎకనామిక్స్ చదివిన షేక్ జానీ మాట్లాడుతూ తనకు అవుట్ సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని సీఎంను కోరారు. ఆయన స్పందిస్తూ.. ఈ దిశగానే తాను కొన్ని ప్రయత్నాలు చేస్తున్నానని, ఇంటి వద్దే ఉండి ఉద్యోగం చేసుకుని జీవించేలా కొన్ని ఉపాధి కార్యక్రమాలను రూపొందిస్తున్నామని తెలిపారు. ఈలోపు అవకాశం ఉంటే ఉద్యోగం ఇప్పిస్తామని హామీ ఇచ్చారు వరద సాయం, సేవలకు సంబంధించి తాను ఇంటరాక్టివ్ వాయిస్ రెస్పాన్స్ సిస్టమ్ (ఐవీఆర్ఎస్) ద్వారా మాట్లాడుతున్నప్పుడు ప్రజలు స్పందించాలని, వారు స్పందిస్తేనే మరింతగా నాణ్యమైన సేవలు అందించేందుకు వీలుంటుందని సీఎం పేర్కొన్నారు.

‘గులకరాయి’ ప్రస్తావన

- సీఎంను కలిసిన ఆ కేసులోని బాధితుడి తల్లి

విజయవాడ సింగ్ నగర్ ఫ్లై ఓవర్ దిగిన తర్వాత వచ్చిన కూడలిలో ఆయన ఆగినప్పుడు గులకరాయి కేసు ప్రస్తావన వచ్చింది. ఎన్నికల ముందు అప్పటి ముఖ్యమంత్రి జగన్మోహన రెడ్డిపై గులకరాయి వేశామని, తమ కొడుకుపై అక్రమ కేసు పెట్టారని, కూలి పనులు చేసుకొనే తాము ఆ సమయంలో చాలా వేధింపులకు గురయ్యామని ఒక మహిళ చెప్పారు. దీనిపై చంద్రబాబు స్పందిస్తూ.. "ఎన్నికల్లో సానుభూతి కోసం వైసీపీ పార్టీ ఆ గులకరాయి కేసు సృష్టించింది. ఇదే కూడలిలో ఆ సంఘటన సృష్టించారు. జగన్‌పై దాడి చేయబోయారని కొందరు అమాయకులను అప్పట్లో కేసుల్లో ఇరికించి ఇబ్బంది పెట్టారు. మీకు ఎలా న్యాయం చేయాలో ఆలోచిస్తాను' అని చంద్రబాబు ఆ మహిళకు చెప్పారు. విజయవాడ నగరానికి మళ్లీ వరదలు రాకుండా చేస్తామని, ప్రజలకు వారికి కలిగిన నష్టానికి ఎంతో కొంత సాంత్వన కలిగిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు.



కబేలా సెంటర్‌లో బాధితులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

బాబూ చల్లగా ఉండండి!

- మీరు బాగుండాలి..మమ్మల్ని బాగా చూసుకోవాలి
- సీఎంను చూసేందుకు బాధితుల్లో ఉత్సాహం
- ప్రతి కూడలిలో ఆగి బాధలు విన్న చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలోని వరద ప్రాంతాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఘనస్వాగతం లభించింది. ఆయనను చూసి దారి పొడవునా బాధితులు చిరునవ్వులు చిందించారు. నగరంలోని అత్యధిక ప్రాంతాల్లో సోమవారం చాలావరకూ వరద తగ్గిపోయింది. సాధారణ జనజీవనం ప్రారంభమైంది. ప్రవాహం తగ్గిన ప్రాంతాల్లో బాధితులను పరామర్శించడానికి... వారు చెప్పింది వినడానికి ఆయన పర్యటించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు కనకదుర్గ ఆలయానికి సమీపంలో ఉన్న భవానీపురం నుంచి ప్రారంభమైన పర్యటన పైపుల రోడ్డు, మధురా నగర్ మీదుగా రామలింగేశ్వర్‌నగర్ వరకూ కొనసాగి సాయంత్రం ముగిసింది. ఇన్ని రోజులూ ముంపు ప్రాంతాల్లో జేసీబీ యంత్రంపై కూర్చుని ప్రయాణించిన ఆయన సోమవారం తన కార్లోనే తిరిగారు. ముంపు ప్రాంతాల్లో సీఎం స్థాయి వ్యక్తి కనిపిస్తే ప్రజలు తమ బాధలు, సమస్యలు, అధికారులపై ఫిర్యాదులతో చుట్టుముట్టడం సాధారణంగా కనిపించే దృశ్యం. కానీ చంద్రబాబు పర్యటనలో భిన్నమైన దృశ్యాలు కనిపించాయి. ప్రతి కూడలిలో ఆయనకు స్వాగతం పలకడం, జైజై బాబు అంటూ నినాదాలు చేయడం, కాన్వాయ్ వెంట పరుగులు తీయడం కనిపించింది. ఆయన కాన్వాయ్‌ను చూడగానే రోడ్ల మీద ఉండేవారు పరుగుపరుగున వస్తుండటంతో ప్రతి కూడలిలో ఆగి కొద్దిసేపు ప్రసంగించాల్సి వచ్చింది. భవానీపురం, ఊర్మిళా నగర్, కబేలా సెంటర్, డాబా కొట్లు సెంటర్... ఇలా అనేకచోట్ల ఆగి మాట్లాడారు. ఊర్మిళానగర్‌లో కొంతనీటి ప్రవాహం రోడ్డుమీద ఇంకా ఉంది. ఆ నీళ్లలోనే అనేకమంది మహిళలు కారు వద్దకు వచ్చి చంద్రబాబు ప్రసంగాన్ని ఆసక్తిగా విన్నారు. తమ ఫోన్లలో ఆయనను ఫొటో తీయడానికి... వీడియో తీయడానికి అనేక మంది పోటీపడ్డారు. డాబాకొట్లు సెంటర్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఉండగా 'బాబు గారూ మీ ఆరోగ్యం బాగా చూసుకోండి... మీరు చల్లగా ఉండాలి' అని ఒక వ్యక్తి అరిచారు. దానికి ప్రతిస్పందనగా అనేకమంది అవును... అవును అంటూ కేకలు పెట్టారు. మరో వ్యక్తి 'మీ పాలన బాగుంది బాబుగారూ' అని అరుచుకొంటూ వెళ్లారు. ఇదే సెంటర్‌లో ఆయన తన కారుపై నిలబడి మాట్లాడుతుండగా ట్రాక్టర్లు, బస్సులు, ఆటోల్లో వెళ్తున్నవారు ఆయనకు నమస్కారాలు పెడుతూ వెళ్లడం కనిపించింది. ఊర్మిళానగర్‌లో ఒక వ్యక్తిని బాబుగారిని ఏమైనా అడిగావా అని మీడియా ప్రతినిధులు అడిగారు. 'ఆయన ఆరోగ్యం బాగుండాలని, నూరేళ్లు చల్లగా ఉండి మమ్మల్ని చూసుకోవాలని చెప్పి వచ్చాను' అని అన్నారు. సహాయ కార్యక్రమాలు బాగా జరుగుతుండటం... బాధితులకు సాయం అందుతూ ఉండటం ఆయన పట్ల ఈ సానుకూలతకు కారణంగా కనిపించింది. కొందరు బాధితులతో సీఎం మాట్లాడిస్తున్నారు. ఇళ్లలో బట్టలు పూర్తిగా పాడైపోయి ఇబ్బంది పడుతున్నామని కబేలా సెంటర్లో ఒక మహిళ చెప్పారు. ఆ సమావేశం ముగిసి కార్లో కూర్చోగానే ఆయన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజనకు ఫోన్ చేసి ఆప్కో నుంచి... ఇతర సంస్థల నుంచి వస్త్రాలు పోగు చేసి స్త్రీలకు, పురుషులకు చెరో జత ఉచితంగా పంపిణీ చేయడంపై కసరత్తు చేయాలని ఆదేశించారు.



వైఎస్సార్ కాలనీలో కరెంట్ లైన్లకు మరమత్తులు చేస్తున్న విద్యుత్ సిబ్బంది



విజయవాడ లూనా సెంటర్‌లో నిన్నటి వరకూ నీటితో నిండిన రహదారిలో సోమవారం నాటి పరిస్థితి

బోట్లు గేట్లను ఢీకొంటే భారీనష్టం జరిగేది: నిమ్మల

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీని బోట్లు ఢీకొట్టడంపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు చేస్తున్నారని జలవనరుల మంత్రి నిమ్మల రామానాయుడు చెప్పారు. ఇవి ఒక్కొక్కటీ 40-50 క్వింటాళ్ల బరువుతో ఉన్నాయని.. 67, 69, 70 గేట్ల కౌంటర్ వెయిట్లను బలంగా ఢీకొట్టడంతో ఆ సిమెంటు దిమ్మెలు దెబ్బతిన్నాయని తెలిపారు. అదృష్టవశాత్తూ ప్రధాన కట్టడానికి ఎలాంటి నష్టం కలుగలేదన్నారు. వాస్తవానికి అవి గేట్లను గనుక ఢీకొట్టి ఉంటే.. భారీగా నష్టం వాటిల్లేదని చెప్పారు. ఈ మొత్తం ఘటనపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, దీనిని సీఎం చంద్రబాబు తీవ్రంగా పరిగణిస్తున్నారని సోమవారం విజయవాడ కలెక్టరేట్‌లో చెప్పారు. విచారణలో ఒక్కో అంశం బయటకు వస్తోందన్నారు. అందరికీ అన్నం పెట్టే రైతన్నకు నష్టం చేకూర్చడానికి ప్రయత్నించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. దాదాపు 170 ఏళ్ల చరిత్ర కలిగిన ప్రకాశం బ్యారేజీకి ఇటీవల రికార్డు స్థాయిలో 11.42 లక్షల క్యూసెక్కుల వరద నీరొచ్చిందని.. ఈ సమయంలో కుట్రపూరితంగా ఐదు బోట్లు గేట్లను బలంగా ఢీకొన్నాయని తెలిపారు.'ఒక్కొక్కటీ రూ.40-50 లక్షల విలువైన బోట్లను అంత అలక్ష్యంగా ప్లాస్టిక్ తాడుతో ఎలా కడతారు? ఇంతటి విలువైనవాటికి ఇనుప గొలుసుల లంగరు వేస్తారు. ప్లాస్టిక్ తాడుతో కట్టడం అనుమానం కలిగిస్తోంది. ఉద్దేశపూర్వకంగానే బ్యారేజీని ఢీకొట్టేలా చేశారా అనే సందేహాలు కలుగుతున్నాయి. ఐదు బోట్లలో మూడు కౌంటర్ వెయిట్లను ఢీకొట్టి అక్కడే ఉన్నాయి. ఒకటి గేట్ల మధ్య నుంచి కిందకు వెళ్లిపోయింది. మరోదాని ఆచూకీ తెలియాల్సి ఉంది. ఈ బోట్ల యజమానులు ఉషాద్రి, కోమటి రామ్మోహన్ వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాంకు అనుచరులు. వైసీపీ అధికారంలో ఉండగా.. అప్పటి ఎంపీ నందిగం సురేశ్, తలశిల, ఉషాద్రి, రామ్మోహన్ సిండికేట్‌గా ఏర్పడి ఇసుక అక్రమ రవాణా చేశారు. బోట్లకు వైసీపీ రంగులున్నాయి. దీంతో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. స్థానికులు చెప్పినా వాటికి ఎందుకు లంగర్ వేయలేదు' అని నిలదీశారు. 1857 నుంచి దాదాపు 13.8 లక్షల ఎకరాలకు సాగునీరు, లక్షలాది మందికి తాగునీటిని బ్యారేజీ అందిస్తోందని.. అలాంటి బ్యారేజీకి నష్టం చేకూర్చేలా చేసి టీడీపీ కూటమి ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కుట్ర పన్నారని ధ్వజమెత్తారు. బోట్లు ఢీకొట్టడం వల్ల దెబ్బతిన్న 3 కౌంటర్ వెయిట్ల పునరుద్ధరణ పూర్తవుతోందని నిమ్మల చెప్పారు.

విజయవాడ ధ్వంసానికి వైసీపీ కుట్ర: అనిత

నక్కపల్లి, సెప్టెంబరు 9: విజయవాడ వరద ముంపు వెనుక వైసీపీ కుట్ర ఉందని హోంమంత్రి వంగలపూడి అనిత ఆరోపించారు. సీఎం చంద్రబాబును, ఎన్‌డీఏ ప్రభుత్వాన్ని ఇబ్బంది పెట్టేందుకు నగరాన్ని ధ్వంసం చేసేందుకు వ్యూహరచన చేసిందని అన్నారు. సోమవారం సాయంత్రం అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆమె విలేకరులతో మాట్లాడారు. ప్రజల ప్రాణాలను పణంగా పెట్టడానికి సైతం వైసీపీ నేతలు సిద్ధమయ్యారని, జగన్ సైకోయిజం, నేర ప్రవృత్తి వల్లే ఇలా జరుగుతోందని అన్నారు. విజయవాడ ప్రజల అదృష్టం కొద్దీ మూడు బోట్లు ప్రకాశం బ్యారేజీని ఢీకొట్టలేదని, లేకపోతే చాలా పెద్ద ప్రమాదం జరిగేదని అన్నారు. ఈ వ్యవహారంలో ఇప్పటికే ఇద్దరిని అరెస్టు చేశామని, సమగ్ర దర్యాప్తు జరుగుతోందని చెప్పారు. వరద బాధితులకు ఒక పులిహోర ప్యాకెట్ కూడా పంచలేని వైసీపీ నేతలు, రేయింబవళ్లు పనిచేస్తున్న కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. రాష్ట్రవ్యాప్తంగా వరద ముంపునకు గురైన గ్రామాల్లో బాధితులను ఆదుకోవడంలోనూ, వారికి సహాయక చర్యలు చేపట్టడంలో ఐఏఎస్ నుంచి వీఆర్‌ఏ స్థాయి ఉద్యోగులు, ఎమ్మెల్యేలు, కూటమి నాయకులు ముందున్నారని హోంమంత్రి చెప్పారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో వరద నష్టంపై మంగళవారం కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

కష్ట కాలంలో ఖాకీల సేవ!

- వరద బాధితులకు అండదండలు
- సహజ శైలికి భిన్నంగా పోలీసు విధులు
- బాధితులకు ఆహారం, తాగునీరు పంపిణీ
- బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడంలోనూ ఫస్ట్
- శివారుల్లో సహాయం ముమ్మరం
- అధికారులు, సిబ్బంది సమన్వయంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో సాయం

విజయవాడ/వన్‌టౌన్, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): నేరాలు.. నిందితులు.. అంటూ తిరిగే పోలీసులు.. తమ సహజ శైలికి భిన్నంగా వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందిస్తున్నారు. బాధితులకు అండగా నిలుస్తున్నారు. "అమ్మా బోటు వచ్చింది ఎక్కండి", "ఆహారం అందిందా? నీళ్ల బాటిళ్లు వచ్చాయా?".. అంటూ బుడమేరు ముంపు ప్రాంత బాధితులకు సాయం చేస్తున్నారు. అంతేకాదు.. వరదలో చిక్కుకున్నామని ఎవరైనా ఫోన్ చేస్తే చాలు వెంటనే అక్కడకు చేరిపోతున్నారు. బాధితులను సురక్షిత ప్రాంతాలకు తీసుకువస్తున్నారు. విజయవాడలోని సింగ్‌నగర్, ప్రకాశ్‌నగర్, పాయకాపురం, రాధానగర్, ప్రశాంతినగర్ తదితర ప్రాంతాలు బుడమేరు వరద కారణంగా నడుము లోతు నీటిలో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో బాధితులను రక్షించేందుకు పోలీసులు తమ వంతు పాత్ర పోషిస్తున్నారు. వరద బాధితులకు ఆహారం, తాగునీరు అందించడం, నిత్యావసరాల పంపిణీ వంటివి చురుగ్గా చేస్తున్నారు. ఎక్కడా విసుగు, విరామం లేకుండా కష్టపడుతున్నారు. ఇదేసమయంలో వరద నీరు తగ్గిన ఇళ్లలో దొంగతనాలు జరగకుండా కూడా ఓ కంట కనిపెడుతున్నారు. విజయవాడ నగర పోలీసులతోపాటు పొరుగునే ఉన్న కృష్ణా జిల్లా పోలీసులను కూడా వరద సహాయక చర్యల కోసం పిలిపించారు. సుమారు వెయ్యి మందికిపైగా పోలీసు సిబ్బంది వరద సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారు. పోలీసు శాఖతోపాటు ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది కూడా బాధితులకు సాయం చేస్తున్నారు. శుక్రవారం పాతరాజరాజేశ్వరిపేటలోని మారుమూల ప్రాంతంలో ఓ కుటుంబం చిక్కుకుపోయింది. సాయం కోసం పోలీసులకు సమాచారం అందించడంతో విజయవాడ నార్త్ ఏసీపీ ఎం. రాజారావు ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ఆగమేఘాలపై స్పందించారు. ట్రాక్టర్‌పై బయలుదేరారు. అయితే.. కొంత దూరం వెళ్లిన తర్వాత నీటి మట్టం పెరగడంతో ట్రాక్టర్ ముందుకు వెళ్లలేకపోయింది. దీంతో అక్కడే ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తమ వెంట తెచ్చిన బోటులో వెళ్లి నలుగురు సభ్యులున్న కుటుంబాన్ని సురక్షిత ప్రాంతానికి తీసుకొచ్చారు. స్థానిక పోలీసుల సహకారం తోడవడంతో ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు మరింత సులువుగా సహాయక చర్యలు చేపట్టాయి.



ముంపు ప్రాంత బాధితులను తీసుకొచ్చేందుకు ట్రాక్టర్‌పై వెళుతున్న పోలీసులు, మంత్రి సవిత


ఈ పరిస్థితి ఎప్పుడూ చూడలేదు



వరద ప్రారంభమైన రోజు నుంచి విధులు నిర్వహిస్తున్నా. నా ఉద్యోగ జీవితంలో ఇలాంటి విపత్కర పరిస్థితి చూడలేదు. బాధితుల కష్టాలను చూస్తుంటే ఎంత బాధ్యతగా మా విధులు నిర్వహించాలో అర్థమవుతోంది. బాధితులు ఇబ్బంది పడకుండా అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటున్నాం. వారిని సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నాం.

- జి. రామకృష్ణ, విజయవాడ ఏడీసీపీ

బాధితుల సంఖ్య ఊహించనిది



వరదలో చిక్కుకున్నవారి ప్రాణాలను రక్షించడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం. బాధితుల సంఖ్య ఊహించనంతగా ఉంది. ఎప్పటికప్పుడు వారికి ఇబ్బంది లేకుండా వ్యవహరిస్తున్నాం. 5 రోజుల నుంచి డ్యూటీలోనే ఉన్నాం. బాధితుల కష్టాలు చూసి అలసట కూడా రావడం లేదు.

- సురేశ్, విజయనగరం, ఎస్‌డీఆర్ఎఫ్

దొంగతనాలు జరగకుండా...



వరద ముంపు తీవ్రంగా ఉంది. బాధితులు చాలా నష్టపోయారు. వారు కోలుకోవాలంటే చాలాకాలం పడుతుంది. 4రోజులు నుంచి డ్యూటీ చేస్తున్నా. ఆహారం, తాగునీరు బాధితులకు చేరేలా చూస్తున్నాం. వారి ఇళ్లలో దొంగతనాలు జరగకుండా చూస్తున్నాం.

- కె. పవన్ కుమార్, కానిస్టేబుల్, కాకినాడ

ఆర్టీసీకి 30 కోట్ల నష్టం: మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి

విజయవాడ, సెప్టెంబరు 9: వరదల వల్ల తొమ్మిది రోజులుగా బస్సులు నడపని కారణంగా ఆర్టీసీకి రూ.30 కోట్లమేర నష్టం వాటిల్లిందని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఈ నష్టం నుంచి బయటపడేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆర్టీసీని ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యాధరపురంలోని ఆర్టీసీ ఆస్పత్రిని మంత్రి సందర్శించారు. ముంపునకు గురైన విద్యాధరపురం ఆర్టీసీ డిపో, జోనల్ వర్క్‌షాపులోని పలు విభాగాలను ఆయన పరిశీలించారు. ఉద్యోగులు, ఆర్టీసీ సిబ్బందికి అందుతున్న వైద్య సదుపాయాలపై ఆరా తీశారు.

400 పంచాయతీలకు 4 కోట్ల చెక్కులు పంపిణీ

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'గ్రామాల అభివృద్ధితోనే గ్రామ స్వరాజ్యం సాధ్యం. మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో సాకారం చేసుకుందాం' అని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. వరదలతో దెబ్బతిన్న పంచాయతీలకు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ రూ.4కోట్లు విరాళం ఇచ్చారు. పంచాయతీకి రూ.లక్ష చొప్పున 400 పంచాయతీలకు చెక్‌ల పంపిణీ కార్యక్రమాన్ని సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 19 చోట్ల నిర్వహించారు. తెనాలిలో కొన్ని పంచాయతీలకు మనోహర్ చెక్‌లు పంపిణీ చేశారు.

బీమా ప్రీమియంపై జీఎస్టీ తగ్గించండి: పయ్యావుల

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సామాన్య ప్రజల జీవన, ఆరోగ్య బీమా ప్రీమియంలపై ఉన్న జీఎస్టీ విధానాన్ని సరళీకరించాలని, 18శాతం నుంచి పన్ను 5శాతానికి తగ్గించాలని రాష్ట్ర ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్ విజ్ఞప్తి చేశారు. వృద్ధులు, మానసిక వికలాంగుల బీమా పాలసీలపై జీఎస్టీకి పూర్తి మినహాయింపు ఇవ్వాలని కోరారు. సోమవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన జరిగిన 54వ జీఎస్టీ కౌన్సిల్ సమావేశంలో పయ్యావుల పాల్గొన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల రంగంలో ఉపయోగించే విడిభాగాలపై జీఎస్టీని 18శాతం నుంచి 5 శాతానికి తగ్గించాలని ప్రాతిపాదించారు. భవిష్యత్తులో జీఎస్టీ కౌన్సిల్ సమావేశాన్ని ఏపీలో నిర్వహించాలని కౌన్సిల్‌ని పయ్యావుల ఆహ్వానించారు.

నెల్లూరులో 'ర్యాట్ ఫీవర్' కలకలం

అల్లూరు, సెప్టెంబరు 9: నెల్లూరు జిల్లా అల్లూరు మండలం పడమర గోగులపల్లిలో ఆట అంకమయ్య అనేవ్యక్తికి ర్యాట్ ఫీవర్(ఎలుక జ్వరం) సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. అంకమయ్య కొన్ని రోజులుగా తీవ్ర జ్వరంతో బాధపడుతూ నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందాడు. జ్వరం తగ్గకపోవడంతో చెన్నైలోని ఓ ప్రముఖ ఆస్పత్రిలో చేరాడు. కోలుకుని ఇంటికి తిరిగొచ్చాక కూడా ఒళ్లు నొప్పులతో అల్లాడిపోవడంతో నెల్లూరులోని అపోలో ఆస్పత్రికి తరలించారు. ప్రత్యేక పరీక్షలు నిర్వహించిన వైద్యులు అతనికి ర్యాట్ ఫీవర్ సోకినట్టు నిర్ధారించారు.

విష ప్రచారం సరికాదు: మంత్రి కొలుసు

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): 'విజయవాడ చరిత్రలో ఎన్నడూ చూడని విధంగా వరదల ఉపద్రవం ముంచుకొచ్చింది. దానిని సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం ధీటుగా ఎదుర్కొంది. ప్రస్తుతం ముంపు ప్రాంతాల్లో బురదను తొలగించే పనిలో ఉంటే.. వైసీపీ నేతలు పనిగట్టుకుని బురద జల్లేలా విమర్శలు చేయడం సరికాదు' అని మంత్రి కొలుసు పార్థసారథి ఖండించారు. సోమవారం ఆయన విజయవాడలోని జిల్లా కలెక్టరు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'ఇలాంటి విపత్కర పరిస్థితుల్లో ప్రభుత్వానికి నిర్మాణాత్మక సలహాలు, సూచనలు అందించాలి. అలాకాకుండా తమ సొంత పత్రికలో విషం కక్కుతూ వార్తలను ప్రచురిస్తూ విషప్రచారం చేయడం సరికాదు. వాస్తవానికి గత వైసీపీ ప్రభుత్వ వైఫల్యం వల్లే ప్రస్తుత విపత్తు దాపురించింది. గతఐదేళ్లు కాలువల్లో తీసిన పూడిక మట్టిని కూడా వైసీపీ నాయకులు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. వరద నష్టం అంచనా వేయడానికి 1,700 ఎన్యూమరేషన్ బృందాలను ఏర్పాటు చేశాం. ప్రత్యేక యాప్‌ను కూడా రూపొందించాం. 5 వేల మంది సిబ్బందితో విజయవాడ ముంపు ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి' అని మంత్రి కొలుసు వివరించారు. ప్రకాశం బ్యారేజీ గేట్లను ఇనుప బోట్లు ఢీకొన్న ఘటన కచ్చితంగా విద్రోహ చర్యేనని మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. సోమవారం ఏలూరు జిల్లా నూజివీడులో వరద బాధిత గ్రామాల సర్పంచ్‌లకు ఆయన చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'ప్రకాశం బ్యారేజీ గేట్లను ఇనుప బోట్లు ఢీకొట్టడం, నిజంగా కుట్ర అయితే.. వారి కుతంత్రం నెరవేరి వరద మరింత పెరిగితే కృష్ణా-గుంటూరు జిల్లాల్లోని అనేక గ్రామాలు కనుమరుగయ్యేవి. దీనిపై పూర్తిస్థాయి విచారణ జరుగుతోంది. దోషులు ఎంతటివారైనా వదిలే ప్రసక్తి లేదు' అని మంత్రి తెలిపారు.

మత్స్యకారులు వేటకు వెళ్లొద్దు: మంత్రి అచ్చెన్న

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): తుఫాను పూర్తిగా తగ్గేవరకూ మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని మంత్రి అచ్చెన్నాయుడు విజ్ఞప్తి చేశారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలని ఆయన ఆదేశించారు. సోమవారం ఉత్తరాంధ్ర అధికారులతో మంత్రి టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. 'తీరప్రాంతాల్లో మత్స్యకారుల నివాస ప్రాంతాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బోట్లను సురక్షిత ప్రాంతాల్లో ఉంచాలి. తుఫాన్ పూర్తిగా తగ్గే వరకు వేట పూర్తిగా నిషేధించాలి' అని సూచించారు. 'ఇటీవలి భారీ వర్షాలు, వరదలకు 1.81 లక్షల హెక్టార్లలో పంట నష్టం జరిగింది. 3,449 హెక్టార్లలో మత్స్యసాగుపై ప్రభావం చూపింది. 381 బోట్లు, 257 వలలు దెబ్బతిన్నాయి' అని మంత్రి తెలిపారు.

దోమల లార్వా నివారణకు ఇళ్లల్లో స్ప్రే

- ప్రజలంతా వైద్య సిబ్బందికి సహకరించాలి: మంత్రి సత్యకుమార్ యాదవ్

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): వరద ప్రభావిత ప్రాంతాల్లో 131 మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు వైద్య సేవలందిస్తున్నామని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. వరద ప్రభావం తగ్గిన 28 సచివాలయాల పరిధిలో దోమల లార్వాల నివారణకు స్ప్రేయింగ్, ఫాగింగ్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. చికున్ గున్యా, మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులను అరికట్టేందుకు మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్లు, సూపర్ వైజర్లు, ఇతర వైద్య సిబ్బంది 900 మందికి వారం రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామని చెప్పారు. దోమలను నిర్మూలించి వాటి వల్ల వచ్చే వ్యాధుల నుంచి ప్రజలను కాపాడేందుకు ఇంటింటికీ స్ప్రే చల్లే కార్యక్రమాన్ని ఏడు రోజుల పాటు నిర్వహిస్తామన్నారు. అంతకుముందు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో వైద్య సిబ్బందికి నిర్వహించిన శిక్షణ శిబిరంలో మంత్రి మాట్లాడుతూ.. వరద ప్రభావిత ప్రాంతాల్లో సేవలందించేందుకు సైనికుల్లా పనిచేయాలని వైద్య సిబ్బందికి పిలుపునిచ్చారు.

బీజేపీ మంత్రి, ఎమ్మెల్యేల వేతనం విరాళం..

విజయవాడ ప్రజలు వరదల్లో చిక్కుకొని చాలా ఇబ్బందిపడ్డారని బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు అన్నారు. అపార అనుభవం గల సీఎం చంద్రబాబు ఉండటం వల్ల వరదల్ని సమర్థవంతంగా ఎదుర్కొన్నామన్నారు. బీజేపీ తరపున 8 మంది ఎమ్మెల్యేలు, మంత్రి ఉన్నారని.. వారి ఒక నెల వేతనాన్ని సీఎం సహాయ నిధికి విరాళంగా అందిస్తామని చెప్పారు.

రూ.2000 తగ్గిన వెండి ధర

న్యూఢిల్లీ: ఢిల్లీ మార్కెట్లో 24 క్యారెట్ల బంగారం ధర 10 గ్రాములపై రూ.700 తగ్గి రూ.73,500కు దిగి వచ్చింది. కిలో వెండి ఏకంగా రూ.2,000 తగ్గుదలతో రూ.83.800 ధర పలికింది. అంతర్జాతీయంగా వీటి ధరలు తగ్గుముఖం పట్టడమే ఇందుకు కారణం. ఇంటర్నేషనల్ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం ఒకదశలో 2,522.90 డాలర్లు, వెండి 28.44 డాలర్ల వద్ద ట్రేడయ్యాయి.

మళ్లీ లాభాల్లోకి మార్కెట్

గతవారం వరుసగా 4 రోజులు నష్టపోయిన ఈక్విటీ మార్కెట్ సోమవా రం మళ్లీ లాభాల్లోకి మళ్లింది. సెన్సెక్స్ 375.61 పాయింట్ల వృద్ధితో 81,559.54 వద్ద ముగిసింది. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ రంగ షేర్లలో కొనుగోళ్లు ఇందుకు దోహదపడ్డాయి. నిఫ్టీ సైతం 84.25 పాయింట్లు పెరిగి 24,936.40 వద్ద స్థిరపడింది.

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు భారీ స్పందన

బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ రూ.6,560 కోట్ల మెగా ఐపీఓకు భారీ స్పందన లభించింది. ఆఫర్ ప్రారంభ మైన నాలుగు గంటల్లోనే ఇష్యూ సైజుకు సమాన మైన బిడ్లు లభించగా.. ఇష్యూ తొలిరోజు పూర్తయ్యేస రికి 2.01 రెట్ల బిడ్లు దాఖలైనట్లు ఎన్ఎస్ఈ డేటా ద్వారా వెల్లడైంది.

- వెస్టర్న్ క్యారియర్స్ ఐపీఓ ఈనెల 13న ప్రారంభమై 18న ముగియనుంది.

2027 నాటికి మస్క్ ట్రిలియనీర్?

ప్రపంచంలో ఆ ఘనత సాధించనున్న తొలి వ్యక్తి

2028 నాటికి అదానీ, 2033 నాటికి అంబానీ

న్యూఢిల్లీ: కుబేరుల సంపద మరింత పెరిగి పోతోంది. విద్యుత్ కార్ల కంపెనీ టెస్లా, స్పేస్ఎక్స్‌ల అధినేత ఎలాన్ మస్క్ సంపద 2027 నాటికి లక్ష కోట్ల డాలర్లకు చేరనుంది. ఇదే జరిగితే ప్రపంచ చరిత్రలో తొలి ట్రిలియనీర్‌గా (లక్ష కోట్ల డాలర్లు) మస్క్ రికార్డు సృష్టిస్తారు. ప్రస్తుత డాలర్-రూపాయి మారకం రేటు ప్రకారం ఆయన సంపద విలువ రూ.83.96 లక్షల కోట్లకు సమానం. అయితే ఇందుకోసం మస్క్ సంపద 2027 వరకు ఏటా సగటున 110 శాతం చొప్పున పెరగాల్సి ఉంటుందని 'ఇన్ఫార్మా కనెక్ట్ అకాడమీ' ఒక నివేదికలో తెలిపింది. మస్క్ ఇప్పటికే 23,700 కోట్ల డాలర్ల (సుమారు రూ.19.89 లక్షల కోట్లు) సంపదతో ప్రపంచం లోనే అత్యంత సంపన్నుడిగా కొన సాగుతున్నారు.



అదే రేసులో అదానీ, అంబానీ



రేస్‌లోని ఇతరులు

మన దేశానికి చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్తలు గౌతం అదానీ, ముకేశ్ అంబానీ కూడా ఈ స్థాయికి చేరేందుకు పోటీపడుతున్నారు. గౌతం అదానీ 2028 నాటికి, ముకేశ్ అంబానీ 2033 నాటికి ఈ స్థాయికి చేరే అవకాశం ఉందని ఆ సంస్థ అంచనా. అయితే ఇందుకోసం అదానీ సంపద ఏటా ప్రస్తుత వృద్ధిరేటు 123 శాతం చొప్పున పెరగాల్సి ఉంటుంది. గౌతం అదానీ ప్రస్తుతం 10,000 కోట్ల డాలర్ల (సుమారు రూ.8.39 లక్షల కోట్లు) సంపదతో ప్రపంచ కుబేరుల్లో 13వ స్థానంలో ఉన్నారు. ముకేశ్ అంబానీ 11,100 కోట్ల డాలర్ల (సుమారు రూ.9.32 లక్షల కోట్లు) సంపదతో ప్రస్తుతం ఆసియాలో అత్యంత సంపన్నుడిగా ఉన్నారు. ఇక 2035 కల్లా అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ కంపెనీ షేర్ల మార్కెట్ విలువ (మార్కెట్ క్యాప్) కూడా లక్ష కోట్ల డాలర్ల స్థాయికి చేరి, ఆ స్థాయికి చేరిన తొలి భారత కంపెనీగా రికార్డు సృష్టించనుందని తెలిపింది.

ఎలాన్ మస్క్, గౌతంఅదానీ, ముకేశ్ అంబానీ లతో పాటు మరికొంత మంది ప్రపంచ పారిశ్రామి కవేత్తలు కూడా వెనకా ముందుగా ట్రిలియనీర్ల జాబితాలో చేరే అవకాశం ఉందని 'ఇన్ఫార్మా కనెక్ట్ అకాడమీ' తెలిపింది. అమెరికా టెక్ దిగ్గజం ఎన్‌వి డియా అధినేత జెన్సెన్ హువాంగ్, ఇండోనేషియా పారిశ్రామికవేత్త ప్రజోగో పంగెస్తు, ఫ్రెంచ్ వ్యాపా రవేత్త బెర్నార్డ్ అర్నాల్ట్, ఫేస్‌బుక్ సీఈఓ మార్క్ జుకర్‌బర్గ్ కూడా ఈ జాబితాలో చేరే అవకాశం ఉందని పేర్కొంది.

స్పైస్‌జెట్ సమస్య పరిశీలిస్తున్నాం

పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ స్పైస్‌జెట్ ఎదుర్కొం టున్న సమస్యను పరిశీలిస్తున్నామని పౌర విమాన యాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు. ఆ సంస్థ సక్రమంగా కార్యకలాపాలు చేపట్టేందుకు వీలుగా విమానయాన రంగం లో సమతూకం తీసుకు రావాలనుకుంటున్నామని, ఆ నేపథ్యంలో సంస్థ సమ స్యల పరిష్కారానికి చేయూత అందించాలనుకుంటున్నా మని తెలిపారు. ఫిక్కి నిర్వహించిన సదస్సులో పాల్గొన్న సందర్భంగా విలేకరులు అడిగిన ప్రశ్నలకు మంత్రి స్పందించారు. దేశీయ మార్కెట్లో డిమాండు పెరుగు తున్న దృష్ట్యా మరిన్ని విమానయాన సంస్థలు సర్వీ సులు ప్రారంభించడానికి వెసులుబాటు కల్పించాలన్నది తమ ధ్యేయమని మంత్రి చెప్పారు. ఆర్థికంగాను, ఇతరత్రా ఒత్తిడులు ఎదుర్కొంటున్న స్పైస్‌జెట్‌ను పౌర విమానయాన శాఖ డైరెక్టర్ జనరల్ కార్యాలయం గత నెల 29న విస్తృత నిఘాలో పెట్టిన విషయం విదితమే. విమాన ధరల గురించిన ప్రశ్నకు స్పందిస్తూ ధరలు మార్కెట్లో డిమాండు ఆధారంగా పెరుగుతూ, తగ్గుతూ ఉంటాయని; అయినప్పటికీ ధరలు భారీగా పెరిగిన సందర్భాల్లో మంత్రిత్వ శాఖ తగు సూచనలు చేస్తూనే ఉంటుందని మంత్రి చెప్పారు.

106 ప్రాంతీయ విమానాశ్రయాల అభివృద్ధి

ప్రాంతీయ కనెక్టివిటీని విస్తరించే ప్రయత్నాల్లో భాగంగా అభివృద్ధి చేయడానికి అవకాశం ఉన్న 106 విమానాశ్రయాలు, ఎయిర్ స్ట్రిప్‌లను గుర్తించినట్లు నాయుడు వెల్లడించారు. ఉడాన్ దేశంలో విమాన ప్రయాణాన్ని ప్రజలకు అందుబాటులోకి తెచ్చిందంటూ ఈ పథకాన్ని మరో 10 సంవత్సరాలు పొడిగించామన్నారు. ముందుగా ప్రకటించిన ప్రకారం ఈ స్కీమ్ 2027 నాటికి ముగియవలసి ఉంది.

రేపటి నుంచి 2వ ఆసియా పసిఫిక్ దేశాల మంత్రుల కాన్ఫరెన్స్

పౌర విమానయాన రంగంపై చర్చించేందుకు రెండో ఆసియా పసిఫిక్ దేశాల మంత్రుల కాన్ఫరెన్స్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. బుధ, గురువారాల్లో రెండు రోజుల పాటు జరిగే ఈ సమావేశాలలో 18 దేశాల మంత్రులు, 41 దేశాల నుంచి 250 మంది ప్రతినిధులు, అంతర్జాతీయ ఏజెన్సీలు పాల్గొననున్నాయి.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	72,800 ▼	66,500 ▼	90,000 ▼
ముంబై	71,380 ▼	65,380 ▼	81,480 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

10వ తేదీ

హైదరాబాద్	485	విజయవాడ	520
వరంగల్	487	గోదావరి	515
చిత్తూరు	553	విశాఖపట్నం	525
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	89	విజయవాడ	108
వరంగల్	89	గుంటూరు	105
కరీంనగర్	89	ఒంగోలు	105
మహబూబ్‌నగర్	89	చిత్తూరు	111
కర్నూలు	89	నెల్లూరు	111
విశాఖపట్నం	94	అనంతపురం	111
గోదావరి	108		

మార్కెట్లో కొత్త హ్యుండయ్ అల్‌కజార్



న్యూఢిల్లీ: హ్యుండయ్ మోటార్స్ ఎస్‌యూవీ విభాగంలోని అల్‌కజార్ కొత్త వెర్షన్‌ను మార్కెట్లోకి తెచ్చింది. ఈ కారు పెట్రోల్, డీజిల్ వెర్షన్లు రెండింటిలోనూ అందుబాటులో ఉంటుంది. ఢిల్లీలో పెట్రోల్ వేరియెంట్ ధర రూ.14.99 లక్షలు కాగా డీజిల్ వేరియెంట్ ధర రూ.15.99 లక్షలు. కస్టమర్ డిమాండును ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ వారి అంచనాలను మించి కార్లను తయారుచేస్తున్నామని కంపెనీ ఎండీ ఉన్‌సూ కిమ్ అన్నారు. మరింత మంది కొత్త కస్టమర్లను ఆకర్షించడం లక్ష్యంగా ఈ కారు ధరను నిర్ణయించామని కంపెనీ సీఓఓ తరుణ్ గార్గ్ చెప్పారు. తమ కంపెనీ నుంచి అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ వ్యవస్థతో (ఏడీఏఎస్) వచ్చిన ఎనిమిదో కారు ఇదని ఆయన తెలిపారు.

ఏథర్ ఎనర్జీ రూ.4,500 కోట్ల ఐపీఓ

ఓలా ఎలక్ట్రిక్ తర్వాత మరో ఎలక్ట్రిక్ టూవీలర్ కంపెనీ ఏథర్ ఎనర్జీ కూడా ఐపీఓకు రాబోతోంది. ఈ కంపెనీ ఐపీఓకు అనుమతి కోరుతూ సెబీకి ప్రాథమిక ముసాయిదా పత్రాలు సమర్పించింది. పబ్లిక్ ఆఫరింగ్‌లో భాగంగా రూ.3,100 కోట్ల తాజా ఈక్విటీని జారీ చేయనుండటంతో పాటు ప్రస్తుత ప్రమోటర్లు, ఇన్వెస్టర్లకు చెందిన 2.2 కోట్ల ఈక్విటీ షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిన విక్రయించనున్నట్లు డీఆర్‌హెచ్‌పీలో కంపెనీ వెల్లడించింది. 2.2 కోట్ల షేర్ల అమ్మకం ద్వారా రూ.1,400 కోట్ల వరకు సమకూరవచ్చని అంచనా. అనగా, పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ మొత్తం రూ.4,500 కోట్ల వరకు సమీకరించే అవకాశం ఉంది. గతనెలలో ఓలా ఎలక్ట్రిక్ ఐపీఓ ద్వారా రూ.6,145 కోట్లు సమీకరించింది.

'ఫిట్‌డే'లో మహేశ్ బాబు పెట్టుబడి



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): టాలీవుడ్ సూపర్‌స్టార్ మహేశ్ బాబు ఇన్వెస్టర్‌గా మారారు. తాజాగా హైదరాబాద్ కేంద్రంగా పని చేసే పోషకాహార ఉత్పత్తుల స్టార్టప్ కంపెనీ 'ఫిట్‌డే'లో పెట్టుబడి పెట్టారు. తన నేతృత్వంలోని జీఎంబీ ఎంటర్‌టెయిన్‌మెంట్ కంపెనీ ద్వారా ఆయన ఈ పెట్టుబడి పెట్టారు. అయితే ఎంత మొత్తం పెట్టుబడి పెట్టిందీ వెల్లడించలేదు. ఫిట్‌డే మంచి పోషకాలతో ఆరోగ్యానికి దోహదం చేసే ఆహార ఉత్పత్తులను తయారు చేసి మార్కెట్ చేస్తోంది. మహేశ్ బాబు తమ స్టార్టప్‌లో పెట్టుబడి పెట్టడం తమ కంపెనీ చరిత్రలో ఒక ప్రధాన మైలు రాయి అని ఫిట్‌డే తెలిపింది. ఈ పెట్టుబడితో ఫిట్‌డే తన ఉత్పత్తులను జాతీయ స్థాయికి విస్తరించనుంది.

టీ-హబ్ 'ల్యాబ్2మార్కెట్'

23 స్టార్టప్‌ల ఎంపిక

న్యూఢిల్లీ: ల్యాబ్2మార్కెట్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్లు హైదరాబాద్‌కు చెందిన స్టార్టప్ ఇంక్యుబేటర్ టీ-హబ్ సోమవారం ప్రకటించింది. వినూత్న పరిశోధనల ద్వారా మార్కెట్‌కు అవసరమైన సరికొత్త ఆవిష్కరణలు చేపట్టడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశం. ఈ ప్రోగ్రామ్‌లో పాలుపంచుకునేందుకు 200 దరఖాస్తులు రాగా, 23 స్టార్టప్‌లను ఎంపిక చేసినట్లు టీ-హబ్ వెల్లడించింది. పరిశోధకులు, ఆవిష్కర్తలు తమ ఆలోచనలకు వాణిజ్య రూపమిచ్చేందుకు ఈ కార్యక్రమం దోహదపడనుందని టీ-హబ్ పేర్కొంది. వీరిని ఇండస్ట్రీ నిపుణులు పర్యవేక్షించడం, మార్గనిర్దేశం చేయడంతోపాటు ఆలోచనలను వ్యాపారీకరించడంతో ఎదురయ్యే సవాళ్ల పరిష్కరించడంలోనూ తోడ్పడనున్నట్లు తెలిపింది.

సిరియాదే టైటిల్

0-3తో ఓడిన భారత్ ● ఇంటర్ కాంటినెంటల్ కప్



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): సొంతగడ్డపై జరిగిన ఇంటర్‌కాంటినెంటల్ కప్‌లో భారీ అంచనాలతో బరిలోకి దిగిన భారత జట్టు ఆడిన రెండు మ్యాచ్‌ల్లోనూ ఓటమిపాలై అభిమానులను నిరాశపర్చింది. సోమవారం జీఎంసీ బాలయోగి స్టేడియంలో జరిగిన తమ రెండో మ్యాచ్‌ను సిరియాతో ఆడిన బ్లూ టైగర్స్ 0-3తో చిత్తుగా ఓడింది. అంతకుముందు మ్యాచ్‌లో 2-0తో మారిషస్‌ను చిత్తు చేసిన సిరియా ఆడిన రెండు మ్యాచ్‌లు నెగ్గి, ట్రోఫీని కైవసం చేసుకుంది. టీమిండియాతో మ్యాచ్‌లో ఆరంభంనుంచే దూకుడుగా ఆడిన సిరియా అదే ఆధిపత్యాన్ని తుది వరకు చెలాయించింది. 7వ నిమిషంలోనే మొహమ్మద్, 77వ నిమిషంలో ఇరాన్‌డస్ట్, ఇంజ్యూరీ టైమ్‌లో పాబ్లో గోల్స్ సాధించారు.

ట్రోఫీ ప్రదానం చేసిన సీఎం రేవంత్..

విజేత సిరియా జట్టుకు తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ట్రోఫీ ప్రదానం చేశారు. అంతకుముందు సమాచారశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఇరు జట్ల ఆటగాళ్లతో కరచాలనం చేసి, మ్యాచ్‌ను ప్రారంభించారు. ముగింపు వేడుకల్లో శాట్ ఛైర్మన్ శివసేనా రెడ్డి, ప్రభుత్వ క్రీడాశాఖ సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాక్ అథ్లెట్లకు వీసాలు

లాహోర్ : దక్షిణాసియా అథ్లెటిక్ సమాఖ్య జూనియర్ చాంపియన్‌షిప్‌లో పాల్గొనాల్సిన పాకిస్థాన్ అథ్లెట్లకు భారత వీసాలు లభించాయి. 12 మంది సభ్యుల పాకిస్థాన్ బృందానికి భారత హై కమిషన్ వీసాలు మంజూరు చేసింది. దాంతో పోటీల వేదికైన చెన్నైకి వారు బయలుదేరారు. వాఘా సరిహద్దునుంచి అమృత్‌సర్‌కు.. అక్కడ నుంచి విమానంలో చెన్నై చేరుకుంటారు. ఈనెల 11 నుంచి 13 వరకు శాఫ్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ జరగనుంది.

శ్రీలంకకు ఓదార్పు విజయం

నిస్సాంక అజేయ శతకం ● ఇంగ్లండ్‌తో మూడో టెస్టు

లండన్: ఇంగ్లండ్‌తో జరిగిన చివరిదైన మూడో టెస్టులో శ్రీలంక 8 వికెట్ల తేడాతో నెగ్గింది. అయితే సిరీస్‌ను మాత్రం ఆతిథ్య జట్టు 2-1తో గెలుచుకుంది. లంక బౌలర్లు ఇంగ్లండ్‌ను రెండో ఇన్నింగ్స్‌లో 156 పరుగులకే కుప్పకూల్చారు. దీంతో 219 పరుగుల లక్ష్యంతో నాలుగో రోజు సోమవారం బరిలోకి దిగిన లంక జట్టులో నిస్సాంక (127 నాటౌట్) అజేయ శతకంతో రాణించాడు. ఫలితంగా పర్యాటక జట్టు 2 వికెట్లు కోల్పోయి 219 పరుగులు చేయడంతో మరో రోజు ఉండగానే ఈ టెస్టును దక్కించుకుంది. ఇంగ్లండ్‌కు 62 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం దక్కినా ఫలితం లేకపోయింది. అలాగే ఇంగ్లిష్ గడ్డపై లంకకిది కేవలం నాలుగో టెస్టు విజయం మాత్రమే. అంతకు ముందు ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 325, లంక 263 పరుగులు చేశాయి.

వర్షం లేకున్నా ఆట రద్దు

కివీస్-అఫ్ఘాన్ ఏకైక టెస్టు

నొయిడా: తొలిసారిగా అఫ్ఘానిస్థాన్-న్యూజిలాండ్ జట్ల మధ్య జరుగుతున్న ఏకైక టెస్టు మొదటి రోజు ఆట రద్దయ్యింది. సోమవారం ఇక్కడ వర్షం లేకపోయినా స్థానిక షహీద్ విజయ్‌సింగ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ పూర్తి చిత్తడిగా ఉండడంతో టాస్ కూడా వేయలేని పరిస్థితి నెలకొంది. గత వారం రోజులుగా ఇక్కడ వర్షాలు కురుస్తున్నాయి. నీటిని తోడేసి మైదానాన్ని ఆరబెట్టేందుకు ఇక్కడ ఆధునిక సౌకర్యాలు లేకపోగా గ్రౌండ్ స్టాఫ్‌కు కూడా పెద్దగా అనుభవం లేదు. భవిష్యత్‌లో మరోసారి ఈ స్టేడియంలో ఆడేందుకు రాబోమని అఫ్ఘాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) పేర్కొంది.

పాప్ జోరు.. డీజే హోరు

ఘనంగా ముగిసిన పారాలింపిక్స్





పారిస్: ఎంత అద్భుతంగా ఆరంభమయ్యాయో అంతే ఘనంగా పారిస్ పారాలింపిక్స్ ముగిశాయి. పాప్ స్టార్ల పాటలు..డీజేల మ్యూజిక్‌తో స్టేడ్ డి ఫ్రాన్స్ ఊగిపోయింది. ఇక..168 దేశాల నుంచి సుమారు 4,400 మంది దివ్యాంగ అథ్లెట్లు తమ అసమాన ప్రతిభాపాటవాలతో 12 రోజులపాటు విశ్వవ్యాప్త క్రీడాభిమానులను అలరించారు. క్రీడల ముఖ్య నిర్వాహకుడు టోనీ ఎస్టాన్గ్యెట్ మాట్లాడుతూ..'ఈ క్రీడలు పది కాలాలపాటు అభిమానుల మదిలో మెదులుతూ ఉంటాయి' అని అన్నారు. పారిస్ మేయర్ అనె హిడాల్గో పారాలింపిక్ పతాకాన్ని అంతర్జాతీయ పారాలింపిక్ కమిటీ (ఐపీసీ) అధ్యక్షుడు ఆండ్రూ పార్సన్స్‌కు అందజేశారు. ఆయన దానిని తదుపరి క్రీడల ఆతిథ్య నగరం లాస్ ఏంజిల్స్ మేయర్ కరెన్ బాస్‌కు అప్పగించారు. ఈ సందర్భంగా గాయని బ్రాడ్‌వే స్టార్ అలీ స్ట్రోకర్ అమెరికా జాతీయ గీతాన్ని ఆలపించింది. అనంతరం కాలిఫోర్నియా బీచ్‌లో పారా స్కేట్‌బోర్డర్లు, వీల్ చెయిర్ అథ్లెట్లు ప్రదర్శించిన విన్యాసాలకు సంబంధించిన చిత్రాన్ని ప్రదర్శించారు. ముగింపోత్సవ టిక్కెట్ల అమ్మకాలపై నిర్వాహకులు తొలుత ఆందోళన చెందినా..దానిని పటాపంచలు చేస్తూ ఫ్యాన్స్ భారీగా స్టేడియానికి తరలొచ్చారు. 76 సంవత్సరాల ఫ్రెంచ్ మ్యూజిక్ దిగ్గజం జీన్ మైకేల్ ఆధ్వర్యంలో 20 మంది డీజేలు గంటపాటు ప్రదర్శించిన కార్యక్రమాలు ప్రేక్షకులను మరో లోకంలో విహరింపజేశాయి. ఫ్రాన్స్ పాప్ స్టార్ శాంటా పాటలకు ప్రేక్షకులు ఊగిపోయారు. ఆమె పాటలకు స్టెప్పులేస్తూ హోరెత్తించారు. కాగా..అక్షర క్రమంలో అథ్లెట్ల పరేడ్ జరిగింది. భారత్ తరపున ప్రీతి పాల్, హర్విందర్ త్రివర్ణ పతాకాన్ని చేబూని ముందు నడిచారు.



ఫ్రెంచ్ పాప్‌స్టార్ శాంటా

మహిళల మారథాన్‌లో ప్రపంచ రికార్డు



ప్రపంచ రికార్డు ప్రదర్శనతో పారాలింపిక్స్‌కు తెరపడ్డాయి. మొరాకోకు చెందిన 29 ఏళ్ల ఫాతిమా ఎల్ ఇద్రిసీ మహిళల మారథాన్‌లో వరల్డ్ రికార్డును బద్దలుగొట్టింది. రెండు గంటల 48 నిమిషాల 36 సెకన్లలో గమ్యం చేరిన ఇద్రిసీ స్వర్ణ పతకం కొల్లగొట్టింది. ఈక్రమంలో జపాన్ రన్నర్ మిసాటో 2020లో నెలకొల్పిన గత రికార్డును ఆరు నిమిషాల తేడాతో సవరించింది. మెరిమ్ (మొరాకో) రజతం, మిచిషిటా (జపాన్) కాంస్య పతకం నెగ్గారు.



ఎదురులేని సినర్

యూఎస్ ఓపెన్ టైటిల్ సొంతం

ఫైనల్లో ఫ్రిట్జ్ ఓటమి



న్యూయార్క్: టాప్ సీడ్ జానిక్ సినర్ ఈ ఏడాది రెండో గ్రాండ్‌స్లామ్ టైటిల్‌తో అదరగొట్టాడు. ఆదివారం రాత్రి జరిగిన యూఎస్ ఓపెన్ పురుషుల సింగిల్స్ ఫైనల్లో ఇటలీ ఆటగాడు సినర్ 6-3, 6-4, 7-5తో 12వ సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా)ను వరుస సెట్లలో ఓడించి విజేతగా నిలిచాడు. సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ ఆస్ట్రేలియన్ ఓపెన్ నెగ్గిన సినర్.. యూఎస్ ఓపెన్ నెగ్గిన తొలి ఇటాలియన్‌గా చరిత్ర సృష్టించాడు. టైటిల్ ఫైట్‌లో సినర్‌తో పోల్చితే ఫ్రిట్జ్ ఎక్కువ విన్నర్లు సంధించినా.. అనవసర తప్పిదాలతో మూల్యం చెల్లించుకొన్నాడు. తొలి సెట్ ఆరంభంలో నువ్వానేనా? అన్నట్టుగా ఇద్దరూ తలపడడంతో స్కోరు 3-3తో సమమైంది. అయితే, ఏడో గేమ్‌లో టేలర్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన సినర్.. వరుసగా మూడు గేమ్‌లు గెలిచి తొలి సెట్‌ను తన ఖాతాలో వేసుకొన్నాడు. ఇక, రెండో సెట్‌లో ఫ్రిట్జ్ నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో ఆసక్తి రేగింది. కానీ, 9వ గేమ్ నెగ్గిన జానిక్.. ఆ తర్వాతి గేమ్‌లో బ్రేక్ పాయింట్‌తో రెండో సెట్‌ను కూడా దక్కించుకొన్నాడు. మూడో సెట్‌లో టేలర్ నుంచి గట్టిపోటీ ఎదురైంది. 3-3తో ఉన్న సమయంలో ఏడో గేమ్‌లో జానిక్ సర్వీస్‌ను బ్రేక్ చేసిన ఫ్రిట్జ్.. ఆ తర్వాత గేమ్‌ను గెలిచి 5-3తో పైచేయి సాధించాడు. ఈ దశలో ఒక్కసారిగా దూకుడుపెంచిన సినర్ వరుసగా నాలుగు గేమ్‌లు గెలిచి.. చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకొన్నాడు. రెండుసార్లు డోపింగ్‌లో పట్టుబడడంతో తీవ్ర ఇబ్బందులు, విమర్శలకు గురైన సినర్.. టోర్నీ ఆరంభంలో కొంత తడబడినా క్రమంగా పుంజుకొని గ్రాండ్‌స్లామ్‌ను ముద్దాడాడు.



అక్టోబరు 18 నుంచి ప్రొ. కబడ్డీ లీగ్

హైదరాబాద్‌లో ఆరంభం

న్యూఢిల్లీ: ప్రొ. కబడ్డీ లీగ్ (పీకేఎల్) 11వ సీజన్ ఆరంభానికి హైదరాబాద్ వేదిక కానుంది. సోమవారం పీకేఎల్ షెడ్యూల్‌ను విడుదల చేశారు. మ్యాచ్‌లను మూడు నగరాల్లో నిర్వహించనున్నారు. దీంట్లో భాగంగా తొలి అంచె పోటీలు అక్టోబరు 18నుంచి నవంబరు 9 వరకు హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో జరుపనున్నారు. ఆరంభ మ్యాచ్‌లో తెలుగు టైటాన్స్-బెంగళూరు బుల్స్ తలపడతాయి. ఆ వెంటనే రెండో మ్యాచ్ యు ముంబా-దబాంగ్ ఢిల్లీ కేసీ మధ్య జరుగుతుంది. ఇక నొయిడాలో నవంబరు 10-డిసెంబరు1 వరకు రెండో అంచె పోటీలు.. పుణెలో డిసెంబరు 3-24 మధ్య మూడో అంచె పోటీలను నిర్వహించనున్నారు. ప్లేఆఫ్స్ మ్యాచ్‌ల షెడ్యూల్‌ను తర్వాత ప్రకటిస్తారు.

భారత్‌కు రెండో విజయం

- 1-5తో జపాన్ చిత్తు

హులున్‌బుర్ (చైనా): ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో భారత హాకీ జట్టు వరుసగా రెండో విజయం సాధించింది. సోమవారం జపాన్‌తో జరిగిన ఏకపక్ష మ్యాచ్‌లో 5-1 తేడాతో నెగ్గింది. సుఖ్‌జీత్ రెండో నిమిషంలోనే ఫీల్డ్ గోల్‌తో ఖాతా తెరవగా.. 60వ నిమిషంలో తన రెండో గోల్ సాధించాడు. ఇక అభిషేక్ (3), సంజయ్ (17), ఉత్తమ్ సింగ్ (54) జట్టుకు మరో మూడు గోల్స్‌ను అందించారు. డిఫెండింగ్ చాంపియన్‌గా బరిలోకి దిగిన భారత్ తొలి మ్యాచ్‌లో చైనాను 3-0తో ఓడించింది.

వినేశ్, బజరంగ్ రాజీనామాల ఆమోదం

రైల్వే శాఖ నిర్ణయం

న్యూఢిల్లీ: రాజకీయాల్లో చేరిన స్టార్ రెజ్లర్లు వినేశ్ ఫొగట్, బజరంగ్ పూనియా తమ రైల్వే ఉద్యోగాలకు రాజీనామా చేశారు. వీటిని వెంటనే ఆమోదించినట్టు నార్తర్న్ రైల్వే శాఖ పేర్కొంది. అలాగే ఈ ఇద్దరి విషయంలో మూడు నెలల నోటీస్ పీరియడ్‌ను కూడా ఎత్తివేసినట్టు తెలిపింది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు వీరికి మార్గం సుగమమైంది. గతవారమే ఇద్దరు రెజ్లర్లు కాంగ్రెస్ పార్టీలో చేరారు.



చత్రాపల్లి గ్రామంలోకి కొట్టుకువచ్చిన కొండచరియలు, మట్టి, రాళ్లు

కుటుంబంలో 'వరద' విషాదం

మహిళ మృత్యువాత..ముగ్గురికి తీవ్ర గాయాలు.. నిద్రిస్తుండగా ముంచెత్తిన వరద.. చత్రాపల్లిలో కొండచరియల బీభత్సం



కుమారి (ఫైల్)

గూడెంకొత్తవీధి (అల్లూరి సీతారామరాజు జిల్లా), సెప్టెంబరు 9: వాయుగుండం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాలు ఏజెన్సీ ప్రాంతాలను వణికిస్తున్నాయి. కొండల మీద నుంచి వచ్చిపడుతున్న వరద, విరిగిపడుతున్న కొండచరియలు అల్లూరి సీతారామరాజు జిల్లాలో బీభత్సం సృష్టించాయి. వరద ప్రవాహంలో ఓ కుటుంబం కొట్టుకుపోయింది. ఆ కుటుంబంలోని ఓ మహిళ ఆ తర్వాత విగత జీవి అయి కనిపించగా, మిగతా ముగ్గురు తీవ్ర గాయాలతో బయటపడ్డారు. ఆదివారం అర్ధరాత్రి దాటాక అంతా నిద్రలో ఉండగా ఈ విషాదం చోటుచేసుకుంది. మృతురాలిని గూడెంకొత్తవీధి మండలం గాలికొండ పంచాయతీ చత్రాపల్లి గ్రామానికి చెందిన కొర్రా కుమారి(20)గా గుర్తించారు. కొండ దిగువన ఉన్న చత్రాపల్లి గ్రామంలో అర్ధరాత్రి తరువాత వర్షం ఉధృతి పెరిగింది. ఆ సమయంలో గ్రామ సమీపంలోని కొండ పైనుంచి వరద ప్రవాహంతో కొండచరియలు కొట్టుకువచ్చాయి. ఈ వరదలో వృద్ధుడు కొర్ర పండన్న, కుమారుడు కొర్ర సుబ్బారావు, కుమార్తె కొర్ర కుమారి (20), మరో కుమార్తె కొర్ర సుమిత్ర వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. కొర్ర కుమారి మృతదేహం గ్రామానికి కిలోమీటరు దూరంలో లభ్యమైంది. పండన్న, సుబ్బారావు, సుమిత్ర గ్రామానికి 400 నుంచి 600 మీటర్ల దూరంలో తుప్పల్లో చిక్కుకున్నారు. సహాయం కోసం వారు వేసిన కేకలు విని గ్రామస్థులు అక్కడకు చేరుకున్నారు. తీవ్రంగా గాయపడిన వారిని స్థానికులు కొంతదూరం వరకు మోసుకువచ్చి, అక్కడ నుంచి అంబులెన్సులో సప్పర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. కాలు విరిగిపోయిన సుమిత్రకు పీహెచ్‌సీలోనే చికిత్స అందిస్తున్నారు. కాగా, చత్రాపల్లి గ్రామంలో కొండచరియలు, వరద నీటి ప్రవాహానికి పదుల సంఖ్యలో మేకలు, గొర్రెలు, పశువులు కొట్టుకుపోయి మృత్యువాతపడ్డాయి. ఈ గ్రామంలో పండన్న గృహంతో పాటు మరో మూడు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్నాయి.



ఏలేరు రిజర్వాయర్ ముంపు ప్రాంతంలో బోటులో పర్యటిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, టీడీపీ నేత వర్మ

మాటలతో కాకపోతేనే చర్యలు!

- ఆక్రమణదారుల విషయంలో 'హైడ్రా' కంటే కూడా ఇదే మేలు
- విజయవాడను నిలబెట్టేందుకు సీఎం రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారు
- 4 అడుగుల లోతున జగనన్న కాలనీలు
- వైసీపీ తప్పులకు ఇప్పుడు పేదలకు నరకం
- కాకినాడ జిల్లా వరద ప్రాంతాల్లో డిప్యూటీ సీఎం పవన్ పర్యటన



ఏలేరు రిజర్వాయర్ ముంపు ప్రాంతంలో బురదలోనే నిలబడి అధికారులకు సూచనలిస్తున్న డిప్యూటీ సీఎం పవన్

కాకినాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : బుడమేరు మార్గంలో అక్రమంగా నిర్మాణాలు చేసిన వారితో మాట్లాడాలని, ఆ తర్వాతే తగిన చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అన్నారు. హైడ్రా వంటి వ్యవస్థ కంటే కూడా ఇదే మేలైన విధానమన్నారు. అయితే, ఇది తన వ్యక్తిగత అభిప్రాయమన్నారు. కాకినాడ జిల్లా వరద ముంపు ప్రాంతమైన గొల్లప్రోలులో సోమవారం ఆయన పర్యటించారు. సుద్దగడ్డ వరద ముంపు బారిన పడిన పేదల ఇళ్ల కాలనీని పవన్ సందర్శించారు. కాలనీకి బోటుపై వెళ్లి అక్కడినుంచి వరద నీటిలోను, బురదమయంగా మారిన రహదారుల్లోను తిరిగి బాధితులతో మాట్లాడారు. వారి కష్టాలను తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. "చాలామంది తెలిసో తెలియకో బుడమేరు పరీవాహక ప్రాంతాలను ఆక్రమించి ఉంటారు. అది ఆక్రమణ స్థలం అని తెలియక కొనుగోలు చేసిన వారున్నారు. ఇలాంటి వారందరితో కూర్చొని మాట్లాడితే బాగుంటుంది" అని అన్నారు. నదులు, వాగులు, ఇతర పరీవాహక ప్రాంతాల్లో కట్టడాలపై ప్రజల్లో చైతన్యం రావాలని పవన్ అభిప్రాయపడ్డారు. అనుకోకుండా వచ్చిన అకాల వర్షాలతో విజయవాడకు వరద పోటెత్తిందని, దాని నుంచి కోలుకునేందుకు కొంత సమయం పడుతుందన్నారు. వరద బాధితులను ఆదుకునేందుకు సీఎం చంద్రబాబు రాత్రింబవళ్లు పనిచేస్తున్నారన్నారు. జగనన్న కాలనీల పేరుతో గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులకు ప్రజలు నష్టపోయారని తెలిపారు. ఆ తప్పులను కూటమి ప్రభుత్వంలో తాము సరిచేయాల్సి ఉందన్నారు. గొల్లప్రోలులో పేదల ఇళ్లకాలనీ పేరుతో లోతట్టు ప్రాంతంలో నాడు 32 ఎకరాలను కొనుగోలు చేశారని, ఇది నాలుగు అడుగుల లోతులో ఉందని తెలిపారు. రూ.30లక్షల మార్కెట్ ధర ఉన్న భూమిని రూ.60లక్షలకు కొనుగోలు చేశారని చెప్పారు. ఇలాంటి ముంపు ప్రాంతాల్లో గత జగన్ ప్రభుత్వం స్థలాలు ఇవ్వడంవల్ల పేదలు ఇబ్బందులు పడుతున్నారని పవన్ కల్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు.

ముంపు ప్రాంతాల్లో పవన్ పర్యటన..

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాజీ ఎమ్మెల్యే వర్మతో కలిసి పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. మునిగిపోయిన పేదల ఇళ్ల వద్దకు ఆయన బోటులో వెళ్లారు. బురదలో నడుచుకుంటూ బాధితులను పరామర్శించారు. ప్రతిఒక్కరి సమస్యను విన్నారు. పవన్ కల్యాణ్ జ్వరంతో బాధపడుతున్నప్పటికీ బోటెక్కి కలెక్టర్‌తో కలిసి ముంపునకు గురైన కాలనీకి వెళ్లారు. ముంపు సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

వరద నష్టం అంచనాకు
మంత్రివర్గ ఉపసంఘం

- ఏర్పాటులో ఇంత జాప్యమా?
- సీఎం ఆదేశించిన 3రోజులకు

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి) : వరదనష్టం అంచనా కోసం మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటయింది. ఉపసంఘంలో ఆర్థికశాఖ, రెవెన్యూ, పురపాలక, హోం, విపత్తు నిర్వహణ శాఖల మంత్రులు సభ్యులుగా ఉంటారు. రెవెన్యూ, విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి.. కన్వీనర్‌గా ఉంటారు. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. ఉపసంఘం వీలైనంత త్వరగా తన నివేదిక ఇవ్వాలని సీఎస్ తన ఉత్తర్వుల్లో కోరారు. ఇదిలాఉంటే, ఉపసంఘం ఏర్పాటు, ఉత్తర్వుల జారీలో ఆలస్యం అయిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి, వరద నష్టం అంచనా వేసేందుకు విధివిధానాలు రూపొందించేందుకు, మొత్తం పర్యవేక్షణకోసం ఉపసంఘం ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఈనెల ఏడో తేదీన... అధికారులను ఆదేశించారు. కానీ అధికారులు ఒక రోజు ఆలస్యంగా ఎనిమిదో తేదీన సీఎస్ కార్యాలయానికి ప్రతిపాదనలు పంపించారు. సీఎస్ నీరబ్ తన దైన శైలిలో నింపాదిగా మరొక రోజు సమయం తీసుకొని సోమవారం సాయంత్రం ఉత్తర్వులు ఇచ్చారు. నిజానికి సీఎస్ ఉత్తర్వులు విడుదలయ్యేనాటికే వరదనష్టం అంచనా కార్యక్రమం సోమవారం ఉదయమే ప్రారంభమైంది. మొత్తం మూడు రోజుల పాటు సమగ్రంగా వరదనష్టం అంచనావేయాలని ప్రభుత్వం ముందుగానే నిర్ణయించింది. ఒక రోజు ఎన్యుమరేషన్ కూడా ముగిసిన తర్వాత, ఇప్పుడు మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేస్తూ సీఎస్ ఉత్తర్వులు ఇవ్వడం అధికార వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ముఖ్యమంత్రి ఆదేశాలపై కీలక ఉత్తర్వులు ఇవ్వడానికి కూడా మూడు రోజుల సమయం తీసుకున్నారన్న చర్చ జరుగుతోంది.

వరదలకు మరొకరు మృతి

- 46కు చేరిన మరణాల సంఖ్య

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ఇటీవలి వరదలకు గల్లంతైన విజయవాడ నార్త్ మండలానికి చెందిన వ్యక్తి మృతదేహాన్ని సోమవారం గుర్తించారు. దీంతో పలు జిల్లాల్లో వర్షాలు,వరదల కారణంగా మృతి చెందిన వారి సంఖ్య 46కు చేరింది. వీరిలో ఎన్టీఆర్‌జిల్లాలోనే 36 మంది ఉన్నారు. కాగా, విపత్తుతో పంచాయతీరాజ్‌శాఖరోడ్లు 1,160 కిలోమీటర్లు, ఆర్ అండ్‌బీ రోడ్లు 3,990 కిలోమీటర్లు, మున్సిపల్ రోడ్లు 558.47 కిలో మీటర్ల మేర దెబ్బతిన్నాయని అంచనా వేశారు.

ఉత్తరాంధ్రలో కుంభవృష్టి



అనకాపల్లి జిల్లా బొజ్జన్నకొండ వద్ద నీట మునిగిన వరి పొలాలు



బుచ్చెయ్యపేట మండలం వడ్డాదిలో కాజ్‌వే పైనుంచి ఉధృతంగా ప్రవహిస్తున్న పెద్దేరు

(మొదటి పేజీ తరువాయి)

పూసపాటిరేగ మండలం)లో 14, కృష్ణదేవిపేట (అనకాపల్లి జిల్లా గొలుగొండ మండలం), చింతపల్లి (అల్లూరి జిల్లా)లో 13, ముంచంగిపుట్టు(అల్లూరి జిల్లా), పెదనడిపల్లి(చీపురుపల్లి)లో 12, కాకరపాడు(అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం), రణస్థలంలో 11, పూసపాటిరేగ, భీమిలి, బొండపల్లి, బలిఘట్టంలలో 10, మెరకముడిదాం, చీపురుపల్లి, విశాఖపట్నం, గరివిడి, గంపరాయి, నర్సీపట్నం, ఎస్.రాయవరంలలో తొమ్మిది సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. దక్షిణ ఒడిశాలోని మల్కన్‌గిరి, రాయగడ, గజపతి జిల్లాల్లోనూ భారీ నుంచి అతి భారీవర్షాలు కురిశాయి. మల్కన్‌గిరిలో 25, చిత్రకొండలో 23, కొరుకొండలో 20, మథిలిలో 15, లమత్‌పుట్‌లో 13, అంబదోలలో 12 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఒడిశాలో భారీవర్షాలు కురవడంతో అటు నుంచి ఉత్తరాంధ్ర మీదుగా ప్రవహించే నదులు, వాగులకు వరద పోటెత్తింది. అల్లూరి, అనకాపల్లి, పార్వతీపురం మన్యం జిల్లాల్లో పలుచోట్ల రోడ్లపై నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. దక్షిణ ఒడిశాలో కురిసిన వర్షాలకు సీలేరు నదికి వరద పెరిగింది. 2006 తరువాత అత్యధికంగా శబరి నదిలో 10.27 మీటర్ల ఎత్తున వరద ప్రవహిస్తోంది. ఈ వరద కూడా కూనవరం వద్ద గోదావరిలో కలుస్తోందని, దీంతో మంగళవారంకల్లా గోదావరి ప్రవాహం పెరుగుతుందని తెలిపారు. అల్లూరి జిల్లాలో గెడ్డలు, వాగులు ఉగ్రరూపం దాల్చాయి. కల్వర్టులు, రోడ్లు ధ్వంసమయ్యాయి. జిల్లాలోని జీకేవీధి మండలం గాలికొండ పంచాయతీ చత్రాపల్లి గ్రామంలో వరద బీభత్సంతోపాటు కొండచరియలు విరిగిపడటంతో గిరిజన యువతి కొర్రా కుమారి(20) మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. మృతురాలి కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షలు ఎక్స్‌గ్రేషియా ప్రకటించింది. మాచ్‌ఖండ్ జలవిద్యుత్ కేంద్రంలోకి వర్షం నీరు చేరడంతో విద్యుత్ ఉత్పత్తిని నిలిపివేశారు. సీలేరు జల విద్యుత్ కేంద్రంలోకి కూడా నీరు ప్రవేశించింది. పాడేరు, లంబసింగి, గాలికొండ ఘాట్ మార్గాల్లో బండరాళ్లు, చెట్లు విరిగిపడటంతో జిల్లాలోని అన్ని ఘాట్ మార్గాల్లో రాకపోకలను నిలిపివేయాలని జిల్లా కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ ఆదేశించారు. అనకాపల్లి జిల్లాలో 1,528 హెక్టార్లలో వరి పంట నీటమునిగింది. నర్సీపట్నం నుంచి అల్లూరి జిల్లా చింతపల్లి వెళ్లే ప్రధాన రహదారిపై పలుచోట్ల కాజ్‌వేలు దెబ్బతిన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో 2,705 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. మహేంద్రతనయ, బహుదా, నాగావళి, వంశధార నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. గొట్టాబ్యారేజీ గేట్లను ఎత్తివేసి 11,553 క్యూసెక్కుల నీటిని వంశధార నదిలోకి విడిచిపెట్టారు. ఇక నారాయణపురం ఆనకట్ట గేట్లను ఎత్తి నాగావళి నదిలోకి నీటిని వదిలేస్తున్నారు. విజయనగరం జిల్లాలో చాలా చోట్ల ఇళ్లు, కార్యాలయాలు, ఇతర భవనాలు ముంపులోనే ఉన్నాయి. పంట పొలాలు చెరువుల్లా కనిపిస్తున్నాయి. పార్వతీపురం మన్యం జిల్లాలో పలుచోట్ల వరి పొలాలు ముంపునకు గురయ్యాయి. అరటి, మొక్కజొన్న పంటలు నేలవాలాయి. నదీతీర ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ ఆదేశించారు.

అల్లకల్లోలంగా సముద్రం..

తీవ్ర వాయుగుండం సోమవారం ఉదయం ఒడిశాలో పూరీ వద్ద తీరం దాటింది. తర్వాత పశ్చిమ వాయువ్యంగా, తూర్పు ఆగ్నేయంగా పయనించి ఛత్తీస్‌గఢ్‌లోని రాయిపూర్‌కు 360 కి.మీ. తూర్పుగా కేంద్రీకృతమై ఉంది. మంగళవారం నాటికి తీవ్ర అల్పపీడనంగా బలహీనపడే క్రమంలో ఒడిశా మీదుగా ఛత్తీస్‌గఢ్ వైపు పయనిస్తుందని వాతావరణ శాఖ తెలిపింది. మంగళవారం ఉత్తర కోస్తాలో పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. తీవ్ర వాయుగుండం తీరం దాటినా సముద్రం అల్లకల్లోలంగా ఉంది. తీరం వెంబడి గంటకు 45 నుంచి 55, అప్పుడప్పుడు 65 కి.మీ. వేగంతో గాలులు వీస్తున్నాయి. మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లరాదని వాతావరణశాఖ హెచ్చరించింది.



ముఖ్యమంత్రి చంద్రబాబును దీవించి, విరాళం అందజేస్తున్న చలసాని పూర్ణబ్రహ్మయ్య దంపతులు



సీఎం చంద్రబాబుకు రూ. 5కోట్లు విరాళం అందజేస్తున్న మేఘా సంస్థ ఎండీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ సుబ్బయ్య

విరాళంగా చిన్నారుల పాకెట్ మనీ

- ముఖ్యమంత్రి అభినందనలు

వరద బాధితుల సహాయార్థం చిన్నారులు తమ పాకెట్ మనీని విరాళంగా ఇస్తున్న వీడియోపై సీఎం చంద్రబాబు ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఈ వీడియో ఈ రోజు నాలో గొప్ప ఆనందాన్ని నింపింది. పశ్చిమగోదావరి జిల్లా పెంటపాడు మండలం పడమర విప్పర్రులోని శ్రీ విద్యా నికేతన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు తమ పాకెట్ మనీని విరాళంగా ఇస్తూ అసాధారణ కరుణ ప్రదర్శించారు. విద్యార్థులకు ఇలాంటి ఉన్నతమైన విలువలను నేర్పిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందిస్తున్నా. ఇలాంటి చర్యలు మనిషితనంపై మన విశ్వాసాన్ని పునరుద్ధరిస్తాయి.. కరుణ, బాధ్యతతో కూడిన పౌరుల నేతృత్వంలో భవిష్యత్‌కు భరోసా కల్పిస్తాయి' అని చంద్రబాబు పేర్కొన్నారు.


మేమూ ఊతమిస్తాం



రూ.2.5 కోట్ల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న జీఎంఆర్ ఈడీ చల్లా ప్రసన్న, సీఈవో మనోమెరాయ్



వెల్ జాన్ ఇండస్ట్రీస్ తరఫున రూ.కోటి చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న వి.జనార్ధన రావు



వరద బాధితుల సహాయార్థం కోటి రూపాయల చెక్కును సీఎం చంద్రబాబుకు అందజేస్తున్న లలితా జ్యూవెలరీ అధినేత ఎం.కిరణ్‌కుమార్

- వరద సాయంలో ఉదారత

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)

సర్వమూ ఊడ్చేసిన వరద దుఃఖం నుంచి ప్రజలు కోలుకోవడానికి ప్రభుత్వం అన్ని విధాలా సాయం చేస్తోంది. మేముసైతం అంటూ అనేక మంది స్వచ్ఛందంగా కదలి వరదబాధితులకు సాయం అందిస్తున్నారు. ముంపు ప్రాంతాల్లోని ప్రజలకు నేరుగా వివిధ రూపాల్లో ఆ సాయాన్ని అందజేస్తున్నారు. మరోవైపు ప్రభుత్వ సహాయ కార్యక్రమాలకు ఊతం ఇచ్చేలా ముఖ్యమంత్రి సహాయ నిధికి ఇతోధికంగా సాయం చేస్తున్న వారూ ఉన్నారు. అన్న క్యాంటీన్ల నిర్వహణ కోసం ముఖ్యమంత్రి సహాయనిధికి రూ.10 కోట్లు విరాళంగా అందజేయాలని రేషన్ డీలర్లు నిర్ణయించారు. ఈ మేరకు డీలర్ల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు దివి లీలా మాధవరావు నేతృత్వంలో ఒక ప్రతినిధి బృందం సోమవారం ముఖ్యమంత్రి చంద్రబాబుని కలసి తమ అంగీకార పత్రాన్ని అందజేశారు. విజయవాడలోని కలెక్టర్ కార్యాలయంలో సోమవారం సీఎం చంద్రబాబును కలసి పలువురు విరాళాల చెక్కులు అందజేశారు.మేఘ ఇంజనీరింగ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ ఎండీ కృష్ణారెడ్డి, డైరెక్టర్ సుబ్బయ్య రూ.5 కోట్లు, రేషన్ డీలర్లకు చెందిన రెండు సంఘాలు ఎం. గిరిజారావు తదితరుల నేతృత్వంలో రూ.3 కోట్లు, జీఎంఆర్ గ్రూప్ ఛైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు చేసిన ప్రకటన మేరకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చల్లా ప్రసన్న, సీఈవో మనోమేరాయ్ రూ.2.50 కోట్లు, ఏఐజీ హాస్పటల్స్ ఛైర్మన్ డాక్టర్ డీ నాగేశ్వరరెడ్డి, వైస్ ఛైర్మన్ పీవీఎస్ రాజు రూ.కోటి(ఆన్‌లైన్ ట్రాన్సాక్షన్), వెల్‌జాన్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అధినేత వెలనాటి జనార్దన్‌రావు రూ.కోటి, లలితా జ్యూవెలరీ మార్ట్ లిమిటెడ్ అధినేత ఎం కిరణ్ కుమార్ రూ.కోటి, మెప్మా తరఫున ఐఏఎస్ అధికారి తేజ్ భరత్ రూ.కోటి చెక్కు ఇచ్చారు. ప్రసాద్ సీడ్స్ అధినేత కారుమంచి ప్రసాద్ రూ.50 లక్షలు, తణుకు ఎమ్మెల్యే అరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో సింగపూర్ ప్రవాస తెలుగు వారు రూ.17.50 లక్షలు, సిద్ధార్థ మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్ డాక్టర్ అమ్మన్న రూ.15 లక్షలు, పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు రూ.10 లక్షలు, ఎన్నారైలు సురేష్ మానుకొండ, ఉప్పు వినోద్‌బాబు, వరదా అమర్ రూ.10 లక్షలు, ఏపీ ప్రభుత్వ డాక్టర్స్ అసోసియేషన్ నుంచి డాక్టర్ ఐ బాబ్జీ శ్యామ్‌కుమార్ రూ.6 లక్షలు, మాలకొండయ్య రూ.5 లక్షలు, బెస్ట్ ఆగ్రో లైఫ్ లిమిటెడ్ యాజమాన్యం సూర్యదేవర బాబు, వెంకట రమాప్రసాద్ రూ.5 లక్షలు, వల్లూరి రవీంద్రనాథ్, తేజ్ రూ.5 లక్షలు, మాజీ ఎమ్మెల్సీ అంగర రామ్మోహన్ రూ.5 లక్షలు, ది ఆలమూరు తాలూకా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రూ.5 లక్షలు, మండపేట నియోజకవర్గ రైస్ మిల్లర్స్ రూ.5 లక్షలు, చాంబర్ ఆఫ్ కామర్స్ రూ.1.5 లక్షలు, రోటరీ క్లబ్ రూ.75 వేల చెక్కులను ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అందజేశారు. తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రూ.4 లక్షలు, టీ సతీష్ రూ.3 లక్షలు, పాలడుగు పార్వతీదేవి రూ.3 లక్షలు, ప్రసాద్‌నాయుడు రూ.2 లక్షల 116, టీ కిషోర్ కుమార్ రూ.1,11,116, గాంధీ-వసుమతి రూ.2 లక్షల 016, కొత్తపల్లి గాంధీ రూ.లక్ష, కేవీఎస్వీ ప్రసాద్ రూ.లక్ష, యలమంచిలి విమలాబాయ్ రూ.లక్ష, తోటకూర రాజారత్నంబాబు రూ.లక్ష, గారపాటి శ్రీలక్ష్మి రూ.లక్ష, పులి వెంకటేశ్వర్లు రూ.లక్ష, శ్రీ ఇషా రెటీనా ఫౌండేషన్ ఐ హాస్పటల్ అధినేత కొండా రాజేష్ రూ.లక్ష అందించారు.

లోకేశ్‌కు అందించిన విరాళాలు

పలువురు దాతలు మంత్రి లోకేశ్‌ను కలసి విరాళాలు అందజేశారు. గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్, టీడీపీ నేతలు కలసి రూ.34,47,442, హైదరాబాద్‌కు చెందిన ప్రకాశ్ ఆర్ట్స్ ఛైర్మన్ సీడీవీ సుబ్బారావు రూ.25 లక్షలు, చంద్రగిరి నియోజకవర్గానికి చెందిన డాలర్స్ దివాకర్‌రెడ్డి రూ.10 లక్షలు, విజయవాడకు చెందిన పీవీఎస్ లేబొరేటరీస్ అధినేత పీవీ శేషయ్య రూ.10 లక్షలు, పెనమలూరుకు చెందిన ఎంవీఆర్ చౌదరి రూ.5 లక్షలు, కాకినాడకు చెందిన యునైటెడ్ ప్రైవేట్ ఎడ్యుకేషన్ సంస్థ అధినేత ఎం శ్రీవిజయ్ రూ.2 లక్షలు, మచిలీపట్నంకు చెందిన ఎస్ఆర్‌వై రామనాథ్ దేవీప్రసాద్ రూ.లక్ష, ఎస్ఆర్‌వై శిల్పాదేవి రూ.లక్ష చెక్కులు అందజేశారు.



ముఖ్యమంత్రి చంద్రబాబుకు రూ.50 లక్షల చెక్కును అందజేస్తున్న ప్రసాద్ సీడ్స్ ఛైర్మన్ కారుమంచి ప్రసాద్

కండ్రిక వాసులకు 50 లక్షల వస్తుసామాగ్రి

విజయవాడ 64వ డివిజన్ కండ్రిక కాలనీ వాసులకు టీడీపీ నేత కొమ్మారెడ్డి పట్టాభిరామ్, ఆయన మిత్రబృందం రూ.50 లక్షల విలువైన వస్తు సామాగ్రిని సీఎం ద్వారా అందజేశారు. కాకులపాడుకు చెందిన చలసాని పూర్ణబ్రహ్మయ్య దంపతులు చంద్రబాబును విజయవాడలో సోమవారం కలసి ఆశీర్వదించడంతో పాటు వరద బాధితులకు తమ వంతు సహకారంగా రూ.5 లక్షల విరాళాన్ని అందజేశారు.

తప్పించుకున్నారా.. వదిలేశారా?

(మొదటి పేజీ తరువాయి)

పెద్ద ఎత్తున హింసాకాండకు పాల్పడిన మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి సోదరుడు వెంకట్రామిరెడ్డి పరారీ అయి దాదాపు 4 నెలలు అవుతున్నా పోలీసులు అరెస్ట్ చేయలేకపోతున్నారు. ఈ కేసుల్లో నిందితులు అరెస్ట్ కాకుండా కోర్టు నుంచి ఎలాంటి రక్షణ లేకపోయినా పోలీసులు పట్టుకోలేకపోతున్నారు. నిందితులు పారిపోయారా? లేదంటే పారిపోయేందుకు పోలీసులు సహకరించారా? పారిపోతారని తెలిసినా కళ్లు మూసుకున్నారా? పారిపోయిన వాళ్లను పట్టుకునే శక్తి సామర్థ్యాలు పోలీస్ శాఖకు లేవా? ఇలా ఎన్నో ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

కోర్టు బెయిల్ తిరస్కరించినా

మూడేళ్ల క్రితం రాజధాని ప్రాంతంలో టీడీపీ కేంద్ర కార్యాలయం, చంద్రబాబు ఇంటిపై జరిగిన దాడి ఘటనలు అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపాయి. ఈ కేసుల్లో సూత్రధారులు, ప్రధాన నిందితులు ముందస్తు బెయిల్ కోసం దాఖలు చేసుకున్న పిటిషన్‌ను గత బుధవారమే హైకోర్టు తోసిపుచ్చింది. నిందితుల అరెస్టుకు హైకోర్టు క్లియరెన్స్ ఇచ్చినప్పటికీ పోలీసులు మాత్రం ఉదాసీన వైఖరి అవలంభించడంపై రాజకీయ, పోలీసు వర్గాలలో చర్చనీయాంశంగా మారింది. 2021 అక్టోబరు 19న మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై వైసీపీ మూక దాడి చేసి విధ్వంసం సృష్టించిన విషయం విదితమే. ఈ కేసులో సూత్రధారులైన ఎమ్మెల్సీలు లేళ్ల అప్పిరెడ్డి, తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేశ్, విజయవాడ తూర్పు వైసీపీ సమన్వయకర్త దేవినేని అవినాశ్‌తో పాటు వందలాది మంది నిందితులుగా ఉన్నారు. వీరిలో 14 మంది ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా వారి పిటిషన్లను కోర్టు తిరస్కరించింది. ఆ వెంటనే వైసీపీ నాయకులు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. అయితే ఈ కేసులో నందిగం సురేశ్, విజయవాడ డిప్యూటీ మేయర్ భర్త అవుతు శ్రీనివాసరెడ్డిని పోలీసులు అరెస్ట్ చేశారు. వీరిద్దరికి రిమాండ్ విధించడంతో జైలుకు తరలించారు. చంద్రబాబు ఇంటిపై దాడి కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్‌తో పాటు అనేక మంది నిందితులుగా ఉన్నారు. ఆయన కూడా అజ్ఞాతంలోకి వెళ్లారు. కీలకమైన కేసుల్లో నిందితులను అరెస్టు చేయకపోవడం పోలీసుల వైఫల్యమనే విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా ఆయా కేసుల్లో కోర్టు తీర్పు వెలువరించనుందనే విషయం ముందుగానే తెలుసు. అయినప్పటికీ పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరించారు. కోర్టు ఎటువంటి తీర్పు ఇచ్చినప్పటికీ పోలీస్ శాఖ అందుకు అనుగుణంగా అప్రమత్తంగా వ్యవహరించకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో ప్రత్యక్షంగా పాల్గొనడమే గాక కీలక నిందితుడైన పానుగంటి చైతన్య ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. నేటి వరకు చైతన్యను పోలీసులు పట్టుకోలేకపోయారు.

4 నెలలుగా అజ్ఞాతంలోనే

గత వైసీపీ ప్రభుత్వంలోను, ఎన్నికల సమయంలోను, పోలింగ్ తర్వాత కూడా మాచర్లలో పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి ఎన్నో అరాచకాలకు పాల్పడ్డారు. కేసుల భయంతో మే 14న రామకృష్ణారెడ్డితో కలసి మాచర్లలో హౌస్ అరెస్టు నుంచి పోలీసుల కళ్లు కప్పి తప్పించుకున్నారు. దాదాపు 4 నెలలుగా అజ్ఞాతంలో ఉన్న ఆయన్ను అరెస్టు చేయడంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి. కొందరు పోలీసు అధికారుల సహకారంతోనే ఆయన తప్పించుకు తిరుగుతున్నారన్న ఆరోపణలున్నాయి. మాచర్ల నియోజకవర్గంలో వెంకట్రామిరెడ్డి పోలింగ్ రోజు, ఆ తర్వాత పెద్దఎత్తున హింసాకాండ సాగించారు. వెల్దుర్తి మండలం కండ్లకుంట పోలింగ్ కేంద్రంలో టీడీపీ ఏజెంట్ నోముల మాణిక్యరావుపై వెంకట్రామిరెడ్డి, ఆయన అనుచరులు దాడి చేశారు. మాణిక్యరావు ఇంటికి వెళ్లి ఆయన భార్య పిల్లలను చితకబాదారు. తిరిగి పోలింగ్ బూత్‌కు వచ్చి పెట్రోలు బాంబులు, బరిసెలతో హత్యాయత్నం చేసినట్టు మాణిక్యరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వెంకట్రామిరెడ్డిపై కేసు నమోదైంది. మాచర్ల పట్టణంలోనూ బీభత్సం సృష్టించారు. పీడబ్ల్యూడీ కాలనీ పోలింగ్ కేంద్రం వద్ద ఉన్న టీడీపీ నేతలను వెంకట్రామిరెడ్డి కారుతో ఢీకొట్టి తొక్కించుకుంటూ వెళ్లడంతో పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. కారంపూడిలో ఆయన వందలాది మందితో వచ్చి దాడులకు తెగబడ్డారు. ఈ దాడిలో సీఐ నారాయణస్వామి కూడా గాయపడ్డారు. ఎన్నికల అరాచకాలకు సంబంధించి పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిపై మూడు హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. కారంపూడి సీఐపై దాడి ఘటనలో ఆయనపై సెక్షన్ 307 కింద కేసు నమోదైంది. ఆయన అరాచకాలు చెబుతూ పోతే పెద్ద జాబితానే అవుతుంది. టీడీపీ కార్యకర్తలు, నేతలను భయభ్రాంతులకు గురిచేసి గ్రామాల నుంచి వెళ్లిపోయేలా చేశారు. అక్రమ కేసులతో ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టారు. దాడులు చేసినా వారిపై కేసులు నమోదు కాకుండా పోలీసు వ్యవస్థను గుప్పిట్లో పెట్టుకున్నారు. ప్రత్యర్థులు, టీడీపీ నేతలు, కార్యకర్తలను అనుచరుల చేత హత్య చేయించారు.

ఒక్కొక్కరు పారిపోతున్నా...

పిన్నెల్లి సోదరుల ప్రధాన అనుచరుడు తురకా కిషోర్ కూడా వెంకట్రామిరెడ్డితో కలసి పరారయ్యాడు. ఆయన ఆచూకీ కూడా పోలీసులు కనుకోలేకపోయారు. కిషోర్‌పై కూడా మూడు హత్యాయత్నం కేసులు నమోదయ్యాయి. వైసీపీ ప్రభుత్వ హయాంలో రాజ్యాంగేతర శక్తి మాదిరిగా చట్ట విరుద్ధంగా వ్యవహరించిన బోరుగడ్డ అనిల్ కూడా ఎన్నికల ఫలితాల అనంతరం అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. ముఖ్య కేసుల్లో నిందితులు అజ్ఞాతంలోకి వెళుతున్నా పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. రోజులు గడుస్తున్నా ఇంతవరకు నిందితులను పట్టుకోలేకపోయారు.

సుప్రీంకోర్టులో అవినాశ్ పిటిషన్

- ముందస్తు బెయిల్ ఇవ్వాలని వినతి

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో నిందితుడు, వైసీపీ నేత దేవినేని అవినాశ్ సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ అత్యున్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ నేతలు దేవినేని అవినాశ్‌తో పాటు లేళ్ల అప్పిరెడ్డి, నందిగం సురేశ్, తలశిల రఘురామ్ తదితరులపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తమను అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ అవినాశ్‌తో పాటు మరికొందరు ఏపీ హైకోర్టును ఆశ్రయించారు. ఆ పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. ఈ నేపథ్యంలో సోమవారం దేవినేని అవినాశ్ సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేశారు. ఇదిలాఉంటే దేవినేని అవినాశ్ విదేశాలకు పారిపోతుండగా గత నెలలో శంషాబాద్ విమానాశ్రయంలో పోలీసులు అడ్డుకున్నారు.

అప్పిరెడ్డి ప్రధాన అనుచరుడి అరెస్టు

- టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసు
- బాబు నివాసంపై దాడి ఘటనలో జోగి రమేశ్ అనుచరులు ఇద్దరు అదుపులోకి

మంగళగిరి సిటీ/తాడేపల్లి, సెప్టెంబరు 9: టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ప్రధాన అనుచరుడు, గుంటూరుకు చెందిన వైసీపీ మాజీ కార్పొరేటర్ షేక్ రబ్బాని (ఏ-51)ని మంగళగిరి రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం ఆయన్ను కోర్టులో హాజరు పరిచినట్టు రూరల్ సీఐ వై.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కేసులో ఇప్పటివరకు సుమారు 25 మందిని అరెస్టు చేశారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నివాసంపై దాడి కేసులో మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రధాన అనుచరులైన ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నానికి చెందిన కుంచం జయరాజు (ఏ-23), వెంకట కోటేశ్వరరావు (ఏ-13)ను అదుపులోకి తీసుకున్నట్టు తాడేపల్లి సీఐ బి.కల్యాణరాజు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా 14 రోజులు రిమాండ్ విధించిందని చెప్పారు. కాగా టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అరెస్టయిన మాజీ ఎంపీ నందిగం సురేశ్‌ను విచారణ నిమిత్తం కస్టడీకి ఇవ్వాలని కోరుతూ మంగళగిరి అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో పోలీసు కస్టడీ పిటిషన్‌ను దాఖలు చేశారు.

బుడమేరు లీకేజీ కట్టడి

- వందల మందితో పనులు.. నేడు పూర్తయ్యే అవకాశం
- మొదటి గండి వద్ద భారీగా నీరు లీక్
- జియో మెంబ్రేన్ షీట్లతో కట్టడికి చర్యలు

జి.కొండూరు, సెప్టెంబరు 9: బుడమేరు డైవర్షన్ కెనాల్(బీడీసీ) గండ్లను సమర్థంగా పూడ్చిన అధికారులకు ఇప్పుడు బండరాళ్ల నుంచి లీక్ అవుతున్న వరద నీటిని కట్టడి చేయడం పెద్ద సవాల్‌గా మారింది. వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ నుంచి బీడీసీకి 3.9, 4, 4.1 కిలోమీటర్ల వద్ద పడిన గండ్లను పూడ్చి కట్టను యథాతథ స్థితికి తీసుకురావడంతో పాటు బలోపేతం చేశారు. 4, 4.1 కి.మీ.ల వద్ద పడిన గండ్ల నుంచి నీరు పెద్దగా లీక్ కావడం లేదు కానీ 3.9కి.మీ.వద్ద పూడ్చిన అతిపెద్ద గండి వద్ద రాళ్ల సందుల్లో నుంచి నీరు భారీగా లీకవుతోంది. వరద ఉరవడి ఇక్కడే అధికంగా ఉండటంతో లీకులు ఆగడం లేదు. పైగా ఆది, సోమవారాల్లో వర్షం పడుతూనే ఉండటం ఆటంకంగా మారింది. మరోసారి వరద వస్తే కట్టకు గండిపడే ప్రమాదం ఉన్నందున సోమవారం ఉదయం నుంచి వందల మంది లీకులను యుద్ధ ప్రాతిపదికన సరిచేసే పనిలో ఉన్నారు. మంగళవారం నాటికి పనులు పూర్తయ్యే అవకాశం ఉందని జల వనరుల శాఖ అధికారులు చెబుతున్నారు.

పనులు ఇలా...

రెస్క్యూ టీమ్‌లో ముగ్గురు వ్యక్తులు ఆక్సిజన్ సిలెండర్లు ధరించి నీళ్ల లోతుకు వెళ్లి లీకుల వద్ద పట్టను కప్పుతున్నారు. శాంతినగర్-కవులూరు వంతెన వద్ద రైట్ బ్యాంక్‌పై సిద్ధంగా ఉంచిన ఇసుక బ్యాగ్‌లను 2 మర బోట్లలోకి గండ్ల వద్దకు తరలిస్తున్నారు. నీరు లీకవుతున్న కట్టపై లోపల వక్క జియో మెంబ్రేన్ షీట్‌లు(పట్టాలు) పరుస్తున్నారు. అవి కదలకుండా వాటిపై ఇసుక బస్తాలు ఉంచుతున్నారు. సుమారు 300 మంది ఈ పనుల్లో నిమగ్నమయ్యారు. పట్టలు పరడం పూర్తవగానే మట్టి పోసి లీకులను సరి చేయనున్నారు. మరోవైపు కట్టను పవర్ రోలర్‌తో బలోపేతం చేస్తున్నారు. ఇప్పుడున్న కట్టకు సమాంతరంగా మరో బండ్ వేసి లీకులను కట్టడి చేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. మరో రోజులో లీకేజీలను సరిచేస్తామని ఎంఈఐఎల్ కెప్టెన్ రామ వెల్లడించారు.


బీడీసీ గండ్ల వద్ద జరుగుతున్న సీపేజ్ అరెస్టు పనులు

బుడమేరు గండిని పూడ్చాం: ఆర్మీ

అల్వాల్, సెప్టెంబరు 8(ఆంధ్రజ్యోతి): ఏపీలో వరద సహాయ చర్యల్లో తమ జవాన్లు పాలుపంచుకున్నట్లు ఆర్మీ వెల్లడించింది. బుడమేరు గండిని విజయవంతంగా పూడ్చినట్లు తెలిపింది. 'గేబియాన్ రిటైనింగ్ వాల్‌ను నిర్మించాం. వెలుపలి వైపు మట్టితో 4 మీటర్ల ఎత్తు వరకు రక్షిత కట్టను నిర్మించడంతోపాటు ఇసుక సంచులతో నింపి కాలువకు పడిన గండిని పూడ్చడానికి ఆర్మీ బృందాలు తీవ్రంగా శ్రమించాయి(ఆ రాష్ట్ర నీటిపారుదల మంత్రి ఆదేశాల మేరకు మరో 10 అడుగుల మేర కట్ట ఎత్తును పెంచేందుకు పౌర యంత్రాంగం కసరత్తు చేస్తోంది). దాంతోపాటు విజయవాడలో అజిత్‌సింగ్ నగర్, వైఎస్ఆర్ నగర్‌లలో ఆర్మీ వైద్యసహాయ బృందాలు పనిచేస్తున్నాయి. మా హ్యూమానిటేరియన్ అసిస్టెన్స్ అండ్ డిజాస్టర్ రిలీఫ్ బలగాలు డోర్నియర్ ఎయిర్‌క్రాఫ్ట్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్, మరో రెండు చేతక్ హెలికాప్టర్లలో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహించాయి' అని వెల్లడించింది.

ఆహారం అందలేదన్నందుకు.. బాధితుడి చెంప పగలగొట్టిన వీఆర్వో

విజయవాడ, సెప్టెంబరు 9: తమ వీధికి ఆహారం, మంచినీరు రాలేదని అడిగినందుకు విజయవాడలో వరద బాధితుడిపై వీఆర్వో చేయి చేసుకోవడం వివాదాస్పదమైంది. విజయవాడ 58వ డివిజన్ 259 సచివాలయం వీఆర్వో విజయలక్ష్మి.. పోలీసులు, ఇతర ప్రభుత్వ సిబ్బంది సమక్షంలోనే బాధితుడి చెంప చెళ్లుమనిపించారు. అసభ్యకరంగా దూషించి, బెదిరింపులకు దిగారు. 'నన్నే ప్రశ్నిస్తారా' అంటూ బాధితులపైనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. వరద బాధితులకు సోమవారం రేషన్ పంపిణీ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకుంది. ఈ సమయంలో స్థానికుడు ఒకరు తమ ప్రాంతానికి మంచి నీరు, ఆహారం అందలేదన్నారు. దీంతో వీఆర్వోకు, ఆయనకు మధ్య మాటామాటా పెరిగింది. సహనం కోల్పోయిన వీఆర్వో.. బాధితుడిని చెంపపై కొట్టారు. ఈ ఘటనపై ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన సీరియస్‌గా స్పందించారు. వీఆర్వోకు షోకాజ్ నోటీసు ఇచ్చారు.



బుడమేరు గండి పూడ్చివేతకు 'గేబియన్ బుట్టలు'

- అక్కరకొచ్చిన ఆర్మీ సాంకేతికత

అమరావతి, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): బుడమేరు గట్టుకు పడిన భారీ గండిని భారత సైన్య సాంకేతిక పరిజ్ఞానంతో పూడ్చివేశారు. ఇందుకోసం 'గేబియన్ బుట్టల'ను ఉపయోగించారు. మొదటి రెండు గండ్లను.. జల వనరుల శాఖ సంప్రదాయ విధానంలో కొట్టుకుపోయిన కట్టపై భారీ రాళ్లు, మట్టి పోసి కట్టలు వేసి పూడ్చేసింది. కానీ మూడో గండి దాదాపు 100 మీటర్ల మేర ఉండడంతో దానిని పూడ్చేందుకు సైన్యం కూడా సాయం చేసింది. వరద నివారణ చర్యల్లో కీలకంగా పనిచేసే అనుభవం కలిగిన ఆర్మీ.. భారీ వరద తాకిడిని తట్టుకునేందుకు అడ్డుకట్టలు వేయడానికి గేబియన్ బుట్టలను వాడుతుంటుంది.

గేబియన్ బుట్టలంటే..!

ఇనుప చువ్వలతో పెద్ద బుట్టల్లా తయారు చేస్తారు వాటిని గండిపడ్డ ప్రాంతంలో పొందికగా ఉంచుతారు.. వాటిలో పెద్ద పెద్ద రాళ్లతో పాటు మట్టి కూడా వేస్తారు. ఈ బుట్టలను ఒకదాని పక్కన మరొకటి, ఒకదానిపైన ఇంకొకటి పేర్చుతారు.వాటిపై మళ్లీ రాళ్లు, మట్టి పోస్తారు. తద్వారా గండిపూడ్చడం తేలకని. గేబియన్ బుట్టలు బరువుగా ఉండడం వల్ల వరద తాకినా కదలవని ఆర్మీ అధికారులు వెల్లడించారు. సహజంగా వరద భారీగా ఉన్నప్పుడు ఎంత పెద్దరాళ్లను వేసినా తట్టుకోలేవు. అవి కదిలిపోతాయి. రాళ్లు కదిలితే.. దానిపై వేసిన మట్టి కొట్టుకుపోతుంది. ఇనుప చువ్వల బుట్టలో వేసిన పెద్దరాళ్లు వరదకు తట్టుకుంటాయి. రాళ్లు కదలకుండా ఇనుప చువ్వలు చుట్టూ ఫెన్సింగ్ తరహాలో రక్షణ ఇస్తాయి. గేబియన్ సాంకేతిక పరిజ్ఞానాన్ని ఆర్మీ అధికారులు బుడమేరు గండి పూడ్చివేతలో వినియోగించడంతో.. రాష్ట్రానికి కొత్త సాంకేతిక విధానం పరిచయమైంది.


కబేళా సెంటరులో బాధితులతో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

నా కోసం పోరాడిన.. ప్రజల కోసమే ఈ యుద్ధం

- ముంపు ప్రాంతాల్లో ఇంటింటికీ ఉచితంగా జత బట్టలు: చంద్రబాబు

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): సరిగ్గా ఏడాది కిందట జగన్ ప్రభుత్వం నన్ను తప్పుడు కేసుల్లో ఇరికించి జైలుకు పంపించినప్పుడు ప్రజలు నా కోసం పోరాటం చేశారు. ఈ రోజు వారికి కష్టం వస్తే వరద ప్రాంతాల్లో బాధితులను ఆదుకోవడానికి నేను యుద్ధం చేస్తున్నాను' అని సీఎం చంద్రబాబు అన్నారు. సోమవారం 9వ రోజు కూడా విజయవాడలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఆయన.. సింగ్ నగర్ ఫ్లై ఓవర్ వద్ద మాట్లాడారు. 'ఆ రోజు నన్ను ప్రభుత్వం బస్సులో నుంచి దించి జైలుకు పంపింది. ఈ రోజు అదే బస్సులో కూర్చుని ప్రజల కోసం పనిచేస్తున్నాను. ఆ రోజు నా కోసం 80 దేశాల్లో తెలుగువారు రోడ్ల మీదకు వచ్చి నిరసన తెలిపారు. నాకు అండగా నిలిచారు. నేను కూడా అదే స్థాయిలో నిలిచి పనిచేస్తున్నాను' అన్నారు. 'వరద నీటిలో కొందరు 7 రోజులు.. మరికొందరు 9 రోజులు ఉండాల్సి రావడం మహా విషాదం. గత ప్రభుత్వం బుడమేరుకు పడిన గండ్లను పట్టించుకోలేదు. బుడమేరును ఆక్రమించుకుంటే వదిలేశారు. తామూ కొన్ని ఆక్రమించి అమ్ముకున్నారు. వీటన్నింటి వల్ల రెండున్నర లక్షల కుటుంబాలు యాతనలు పడాల్సి వచ్చింది. మేం ఎన్ని చేయాలో అన్నీ చేశాం. చివరి వ్యక్తి వరకు సాయం అందించాలని ప్రయత్నించాం. నేను స్వయంగా తిరిగితే సరిగ్గా విషయం తెలుస్తుందని ప్రతి రోజూ ముంపు ప్రాంతంలో తిరిగాను. రేషన్ ఇచ్చినా ఈ రోజూ ఆహార ప్యాకెట్లు సరఫరా చేశాం' అని వెల్లడించారు. 'బట్టలన్నీ తడిచిపోయాయని ఇవాళ చెప్పారు. బాధితులందరికీ ఇంటికో జత బట్టలు ఉచితంగా ఇవ్వాలని ఆదేశించా. ఇళ్లలో ఎలక్ట్రికల్, ప్లంబింగ్, కార్పెంటరీ, పెయింటింగ్ వంటి పనులు, రిపేర్ల బాధ్యత అర్బన్ కంపెనీకి అప్పగించాం. ఫోన్ చేస్తే ఆ కంపెనీ నుంచి వచ్చి రిపేర్లు చేస్తారు. ఉద్యోగులను ఇంటింటికీ పంపి అర్బన్ కంపెనీ యాప్ ఎలా వాడాలో శిక్షణ ఇప్పిస్తున్నాం. వాహనాల రిపేర్లను ఆరేడు ప్రదేశాల్లో చేయించాలనుకుంటున్నాం. బీమా లేని వాహనాల రిపేర్లు ఎలా అన్నది ఆలోచిస్తున్నాం. ప్రజలు చాలా నష్టపోయారు. కానీ అన్నీ ప్రభుత్వం చేయలేదు' అన్నారు.

సిగ్గుపడాల్సింది పోయి ఎదురు దాడి

తమ వైఫల్యాలతో ఈ వరద నష్టం సంభవించినందుకు సిగ్గుపడాల్సిన పార్టీలు ఇంకా ఎదురు దాడి చేస్తున్నాయి. వీళ్ల పార్టీ రంగు వేసి ఉన్న పెద్ద పెద్ద బోట్లు వచ్చి ప్రకాశం బ్యారేజి గేట్లను ఢీకొట్టాయి. బోట్లను లంగరు వేయకుండా ఎలా వదిలిపెడతారు? వాటితో నిన్నటి వరకూ దొంగ ఇసుక వ్యాపారం చేశారు. త్వరలో బుడమేరు ఆపరేషన్ ప్రారంభమవుతుంది. ముంపు రాకుండా కాపాడతాం.

తలశిల, నందిగం కనుసన్నల్లోనే.. 'బోట్ల' కుట్ర

- దర్యాప్తు బృందాల నిర్ధారణ.. ఈ వ్యవహారంలో ఇద్దరి అరెస్టు

విజయవాడ, సెప్టెంబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజీ కౌంటర్ వెయిట్లను ఢీకొట్టిన ఇనుప బోట్ల వెనుక కుట్ర ఉన్నట్లు పోలీసులు తేల్చారు. మాజీ సీఎం జగన్ సన్నిహితుడు, వైసీపీ ఎమ్మెల్సీ తలశిల రఘురాం, మాజీ ఎంపీ నందిగం సురేశ్ కనుసన్నల్లోనే కార్గో బోట్లు నదిలోకి కదిలి వచ్చాయని దర్యాప్తు బృందాలు నిర్ధారణకు వచ్చాయి. మూడు కౌంటర్ వెయిట్ల ధ్వంసానికి కారణమైన ఇద్దరిని సోమవారం అరెస్టు చేశారు. వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ గురుప్రకాశ్ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం మండలం సూరాయిపాలెం గ్రామానికి చెందిన కోమటి రామ్మోహన్, గొల్లపూడి గంగానమ్మ ఆలయం ప్రాంతానికి చెందిన వక్కలగడ్డ ఉషాద్రిని అరెస్టు చేసి ఇక్కడి చీఫ్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపరిచారు. న్యాయాధికారి రాజశేఖర్ వారికి ఈ నెల 20వ తేదీ వరకు రిమాండ్ విధించారు. అనంతరం వారిని విజయవాడలోని జిల్లా జైలుకు తరలించారు. ప్రకాశం బ్యారేజీకి ఇటీవల 11.47 లక్షల క్యూసెక్కుల వరద వచ్చినప్పుడు ఐదు బోట్లు కొట్టుకుని వచ్చి కౌంటర్ వెయిట్లను ఢీకొట్టిన విషయం తెలిసిందే. 67, 69 గేట్ల వద్ద ఉండే కౌంటర్ వెయిట్లు మధ్యకు విరిగిపోగా, 70వ నంబరు కౌంటర్ వెయిట్‌కు పగుళ్లు వచ్చాయి. ఈ మూడింటి స్థానంలో కొత్త స్టీల్ కౌంటర్ వెయిట్లను ఏర్పాటు చేయాల్సి వచ్చింది. 5 బోట్లలో ఒకటి ప్రవాహంలో కొట్టుకుపోగా.. మూడు మాత్రం కౌంటర్ వెయిట్లను ఢీకొని అక్కడే నిలిచిపోయాయి. ఇంకోటి గేటు కింద ఇరుక్కుపోయి ఉంటుందని భావిస్తున్నారు.

మూడింటినీ కలిపి కట్టారు..

బ్యారేజీకి కొట్టుకొచ్చిన బోట్ల బాగోతాన్ని పోలీసులు వెలికితీశారు. కేవీఎం ఏపీ-4-ఎం-ఎస్‌బీ0022, కేవీపీ ఏపీ-4-ఎం-ఎస్‌బీ0017, కేఎస్‌పీ ఏపీ-4-ఎం-ఎస్‌బీ0023 రిజిస్ట్రేషన్ నంబర్లు ఉన్న బోట్లు వక్కలగడ్డ ఉషాద్రికి చెందినవిగా గుర్తించారు. ఈ బోటు ఒక్కొక్కటి 40-50 టన్నుల బరువు ఉంటుంది. ఈ మూడింటినీ కలిపి గొల్లపూడిలోని శ్మశాన వాటిక వద్ద కట్టారు. నాలుగో బోటు భవానీపురానికి చెందిన కర్రి నరసింహస్వామికి చెందినదని, ఐదో బోటు విజయవాడకు చెందిన గూడూరు నాగమల్లేశ్వరికి చెందినదని పోలీసులు తేల్చారు. ఈ రెండు బోట్లకు వేర్వేరుగా లంగరు వేశారు. గతంలో జగన్ కార్యక్రమాల అమలును పర్యవేక్షించి.. ఇప్పుడు ఎమ్మెల్సీగా ఉన్న తలశిల రఘురాంకు కోమటి రామ్మోహన్ మేనల్లుడు. రామ్మోహన్‌కు ఉషాద్రి ముఖ్య అనుచరుడు. మరో బోటు యజమాని కర్రి నరసింహస్వామి బీజేపీ నేత బబ్బూరి శ్రీరామ్‌కు అనుచరుడు. నదిలో మొత్తం 60-70 కార్గో బోట్లు తిరుగుతున్నాయి. ఇవన్నీ అమరావతి బోటు సొసైటీ కింద రిజిస్టర్ అయ్యాయి. తలశిల, నందిగం స్కెచ్‌తోనే రామ్మోహన్, ఉషాద్రి బోట్లను శ్మశాన వాటిక వద్ద కట్టారని తెలుస్తోంది. భారీగా వరదలు వచ్చే సూచనలు ఉన్నా ఇలా చేయడం సర్వత్రా అనుమానాలు రేకెత్తిస్తోంది. ఈ మూడు బోట్లు మరో రెండు బోట్లను తోసుకుని నదిలోకి వచ్చాయి. రామ్మోహన్, ఉషాద్రి ఉద్దేశపూర్వకంగానే నిర్లక్ష్యంగా వ్యవహరించారని పోలీసులు గుర్తించారు.

నందిగం లారీల్లో ఇసుక లోడింగ్..

2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఉచితఇసుక పాలసీని మార్చేసింది. నదిలో ఇసుకను తవ్వుకోవడానికి అనుమతులు ఇవ్వలేదు. ఉషాద్రి మాత్రం కోమటి రామ్మోహన్ ద్వారా అప్పటి బాపట్ల ఎంపీ నందిగం సురేశ్, ఎమ్మెల్సీ రఘురాంను సంప్రదించాడు. ఉషాద్రి వైసీపీ నేత కావడంతో ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుక తవ్వుకునేందుకు బోట్లను నదిలోకి దింపారు. నందిగంకు ముఖ్యఅనుచరుడిగా ఉన్న ఉద్దండరాయుపాలేనికి చెందిన యోహాన్ నిరంతరం అతడితో ఉండేవాడు. అక్రమంగా తవ్విన ఇసుకను నందిగం సురేశ్‌కు చెందిన లారీల్లో ఉషాద్రి లోడ్ చేసేవాడు. ఈ లోడింగ్ ప్రక్రియ రాత్రిపూట నిర్వహించేవారు. లాస్య బోట్ సొసైటీ అధినేత, టీడీపీ నేత ఆలూరి హరికృష్ణ చౌదరి.. ఉషాద్రి చేస్తున్న అక్రమాలను వ్యతిరేకించాడు. తలశిల, రామ్మోహన్ కలిసి ఆయనపై హత్యాయత్నం కేసు పెట్టడం గమనార్హం.

ఆపరేషన్ 'కౌంటర్ వెయిట్' సక్సెస్

విజయవాడ, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రకాశం బ్యారేజ్ వద్ద ఆపరేషన్ 'కౌంటర్ వెయిట్' పూర్తయింది. విరిగిపోయిన 3 కౌంటర్ వెయిట్ల స్థానంలో కొత్త స్టీల్ కౌంటర్ వెయిట్లను ఏర్పాటు చేశారు. ఇప్పటికే రెండు ఏర్పాటుచేయగా, సోమవారం 70వ గేటు వద్ద ఉన్న చివరి కౌంటర్ వెయిట్‌ను తొలగించి, దానిస్థానంలో కొత్తది ఏర్పాటుచేశారు. దీంతో ప్రధాన ఘట్టం పూర్తయింది. ఇక కాంక్రీట్ పోయాల్సిన పని మిగిలి ఉంది. ఈ పనులు మంగళవారం నాటికి బెకమ్ కంపెనీ ఇంజనీర్లు పూర్తిచేయనున్నారు. కొత్త కౌంటర్ వెయిట్ల ఏర్పాటుకు 15రోజులు పడుతుందని భావించగా, 5రోజుల్లోనే ఆ ప్రక్రియ పూర్తవడం విశేషం. డిజైన్ల రూపకల్పనలో కీలకంగా వ్యవహరించిన కన్నయ్య నాయుడును బెకమ్ కంపెనీ ఇంజనీర్లు, జలవనరుల శాఖ అధికారులు సత్కరించారు.

కోలుకుంటున్న విజయవాడ

వీడిన వరద ముంపు.. వేగంగా సహాయక చర్యలు

- వరదను సవాల్‌గా తీసుకున్న సర్కారు
- వరద బాధితులకు ఆసాంతం అండగా..
- గండ్ల పూడ్చివేతతో బుడమేరు శాంతం
- ఇప్పుడు ఇన్‌ఫ్లో 2వేల క్యూసెక్కుల్లోపే
- ఎంతో కలవరపరిచిన వాయుగుండం
- అలాంటిదేమీ లేకుండానే తీరం దాటడంతో ఊరట
- ప్రకాశం బ్యారేజీ మరమ్మతు పనులూ పూర్తి

(విజయవాడ - ఆంధ్రజ్యోతి)

నిన్నటి వరకు వరద నీటిలో నానిన విజయవాడలోని ముంపు ప్రాంతాలన్నీ కుదుటపడ్డాయి. బుడమేరు ఇన్‌ఫ్లో రెండు వేల క్యూసెక్కుల లోపే ఉండటం.. ఎగువ ప్రాంతాల్లో పెద్దగా వర్షం పడే అవకాశాలు లేకపోవడంతో విజయవాడకు ముప్పు దాదాపు తప్పినట్లే! మరోవైపు బుడమేరు డైవర్షన్ చానల్ గండ్లు పూడ్చివేసిన అధికారులు సోమవారం కట్టను బలోపేతంచేసి గండ్లు పూడ్చిన ప్రాంతాల్లో సీపేజీని అరికట్టే ప్రయత్నాల్లో నిమగ్నమయ్యారు. మంగళవారం నాటికి ఈ పనులు కొలిక్కి వచ్చే అవకాశం ఉంది. సీపేజీ నివారణకు జియో టెక్స్‌టైల్ మెటీరియల్ వినియోగిస్తున్నారు. తొలుత గండ్లు పడిన రెండు ప్రాంతాల్లో సీపేజీ 500 క్యూసెక్కులు ఉండగా అది సోమవారం నాటికి 200 క్యూసెక్కులకు తగ్గింది. మంగళవారం నాటికి పూర్తిగా తగ్గిపోతుందని నీటిపారుదల శాఖ అధికారులు తెలిపారు. కట్ట పటిష్ఠతను పెంచేందుకు గండ్లుపడిన చోట 5.7 మీటర్ల ఎత్తును.. మరో 0.3 మీటర్ల ఎత్తుకు పెంచుతున్నారు. మెగా ఇంజనీరింగ్ కంపెనీ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పనుల్లో సుమారు 300 మంది నిమగ్నమయ్యారు.

ఫలించిన కష్టం..

బుడమేరు వరద సెప్టెంబరు 1వ తేదీన నగరాన్ని ముంచెత్తడంతో నగరవాసులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. ఊహించని విపత్తుకు జిల్లా అధికారయంత్రాంగం కూడా చేతులెత్తేసిన పరిస్థితి! అలాంటి సమయంలో రంగంలోకి దిగిన సీఎం చంద్రబాబు..జిల్లా కలెక్టరేట్‌లోనే మకాం వేసి మంత్రులను, రాష్ట్రస్థాయి, జిల్లా స్థాయి అధికారులను పరుగులు పెట్టించారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల సిబ్బందిని విజయవాడ రప్పించి వరద సహాయక చర్యలను ముమ్మరం చేశారు. దాని ఫలితమే ఆటు వరద నీరు తగ్గుముఖం పడుతున్న సమయంలోనే ముంపు ప్రాంతాల్లో ముప్పేట సహాయక చర్యలకు అవకాశం లభించింది. మొత్తం మీద వారంరోజులు పైగా సీఎం, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు పడిన కష్టానికి ఫలితం దక్కింది.

తిరిగి సాధారణ స్థితికి..

వాయువ్య బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం ఒడిసాలోని పూరీ వద్ద తీరం దాటడంతో విజయవాడనగరవాసులు ఊపిరిపీల్చుకున్నారు. ఇప్పటికే వారం రోజులుగా కుండపోత.. వరద తాకిడితో ఉక్కిరిబిక్కిరి అయిన నగరవాసులు తాజా వాయుగుండంతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వాయుగుండం తీరం దాటడంతో వర్షాలూ తగ్గుముఖం పట్టాయి. సోమవారమంతా ఎలాంటి వర్షం లేకుండానే గడిచిపోవడంతో వరద ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యలూ వేగవంతంగా సాగుతున్నాయి. ఆస్తి నష్టం అంచనా పనులు మొదలయ్యాయి. వ్యాధులపై కూడా డోర్ టు డోర్ సర్వే ప్రారంభించారు. వరద నుంచి ఇప్పుడిప్పుడే బయటపడుతున్న వారికి తక్కువ ధరకు కూరగాయాలు అందించేందుకు 85 మొబైల్ రైతు బజార్లను వరద ప్రభావిత ప్రాంతాల్లో తిప్పుతున్నారు. వరద బాధితులకు నిత్యావసర కిట్లు పంపిణీ 50 శాతానికిపైగా పూర్తయినట్లు అధికారులు తెలిపారు. మిగిలిన ప్రాంతాల్లోనూ మంగళ, బుధవారం నాటికి పూర్తి చేస్తామని చెప్పారు.

బ్యారేజీ వద్ద మరమ్మతులు పూర్తి

మర బోట్ల కారణంగా దెబ్బతిన్న ప్రకాశం బ్యారేజీ గేట్ల మరమ్మతు సోమవారం పూర్తయింది. కేవలం ఐదు రోజుల్లో నీటిపారుదల శాఖ నిపుణుడు కన్నయ్యనాయుడు పర్యవేక్షణలో ఈ పనులు పూర్తిచేయడం గమనార్హం. ప్రకాశం బ్యారేజీ 67, 69, 70 నంబరు గేట్లు బోట్లు ఢీకొన్న కారణంగా దెబ్బతిన్నాయి. వాటి కౌంటర్ వెయిట్లు ధ్వంసం కావడంతో వాటి స్థానంలో కొత్తవాటిని బిగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆగమేఘాలపై చర్యలు తీసుకుంది. కన్నయ్యనాయుడిని రంగంలోకి దించింది. దెబ్బతిన్న కౌంటర్ వెయిట్ల స్థానంలో స్టీల్‌తో తయారు చేసిన కౌంటర్ వెయిట్లను ఐదు రోజుల్లో బెకం కంపెనీ ఏర్పాటు చేయడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గేట్ల వద్ద చిక్కుకున్న బోట్లను మంగళవారం నాడు తొలగించనున్నట్లు అధికారులు తెలిపారు.


వైఎస్ఆర్ నగర్‌లో వరద తగ్గి బురదతో నిండిన రహదారి

మంత్రులంతా సహాయక కార్యక్రమాల్లోనే

- సాగునీటి వనరులు అన్నింటికీ మ్యాపింగ్: మంత్రి లోకేశ్

అమరావతి, సెప్టెంబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రులందరూ ముఖ్యమంత్రి చంద్రబాబు టీమ్‌గా సహాయ కార్యక్రమాలపై దృష్టి సారించామని ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. బుడమేరు ముంపు బాధితులకు సాయం అందించడంలో మంత్రులంతా సమష్టిగా, సమన్వయంతో పని చేస్తున్నామని తెలిపారు. విజయవాడ కలెక్టరేట్ ప్రాంగణంలో సోమవారం ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. బుడమేరు అనుభవంతో నదులపై కంటే వాగులు, చెరువులపై దృష్టి పెట్టాల్సి ఉందని స్పష్టమైందని, రాష్ట్రంలోని అన్ని సాగునీటి వనరులనూ మ్యాపింగ్ చేస్తూ నిరంతరం సమీక్షిస్తామని చెప్పారు. నదీ పరీవాహక ప్రాంతాల అభివృద్ధితో పాటు వాగులు, ఏరులు, పెద్ద చెరువుల యాజమాన్య నిర్వహణకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. గండ్లు పడిన ప్రాంతాల్లో లీకేజీని పూర్తిస్థాయిలో అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. లోకేశ్ ఆదేశాలతో ఇరిగేషన్ అధికారులు జియో మెంబ్రేన్ షీట్‌లను వినియోగించి సోమవారం సాయంత్రానికల్లా లీకేజీని పూర్తిగా అరికట్టేందుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే గండ్లు పడినచోట కట్ట 5.7 మీటర్ల ఎత్తు పెరిగింది. మరో 0.3 మీటర్ల ఎత్తు పెంచితే ప్రస్తుతం ఉన్న కట్ట స్థాయికి పనులు పూర్తవుతాయి.

జగన్‌కు హుందాతనం ఉందా?

ప్రతిపక్ష నేత హోదా డిమాండ్ చేస్తున్న జగన్‌కు హుందాతనం ఉందా అని మంత్రి లోకేశ్ నిలదీశారు. బురద రాజకీయానికి బ్రాండ్ అంబాసిడర్‌గా మారి అర్థంలేని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లండన్ ఎగిరిపోవాల్సిన జగన్.. పాస్‌పోర్టు సమస్య కారణంగా బెంగళూరు ప్యాలెస్‌లో విశ్రాంతి తీసుకుంటున్నారని ఎద్దేవా చేశారు. సీఎం చంద్రబాబు 74 ఏళ్ల వయసులో క్షణం తీరికలేకుండా వరద బాధితులకు సాయం అందిస్తున్నారని, ఆయనపై విమర్శలు చేయడానికి మనసెలా వచ్చిందని జగన్‌ను నిలదీశారు. జగన్ అందించే సెల్ఫ్ చెక్కుల కథ అందరికీ తెలిసిందేనని అన్నారు.


వైఎస్సార్ కాలనీలో ఇంటిలోని సామానంతా బురదమయం కావడంతో వాటిని శుభ్రం చేసుకుంటున్న ఓ కుటుంబం


చిట్టినగర్‌లో రోడ్డుపై బురదను శుభ్రం చేస్తున్న సహాయ సిబ్బంది


ఏడీసీపీ మిషన్‌తో బుడమేరులో వరద ప్రవాహాన్ని కొలుస్తున్న దృశ్యం

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి
దిక్సూచి
విజయవాడ ● మంగళవారం 10 సెప్టెంబరు 2024
diksuchi@andhrajyothy.com

ఆలిండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రెన్స్ టెస్ట్



ఆలిండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రెన్స్ టెస్ట్ ఫోరెన్సిక్ సైన్స్ కోర్సుల్లో ప్రవేశానికి ఉద్దేశించిన 'ఆలిండియా ఫోరెన్సిక్ సైన్స్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఏఐఎఫ్ఎస్ఈటీ) 2025' నోటిఫికేషన్ వెలువడింది. దీని ద్వారా పార్టిసిపేటింగ్ యూనివర్సిటీలు అందిస్తున్న బీఎస్సీ (ఫోరెన్సిక్ సైన్స్), ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లలో అడ్మిషన్స్ ఇస్తారు. బీఎస్సీ ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. ఎమ్మెస్సీ వ్యవధి రెండేళ్లు. ఫోరెన్సిక్ సైన్స్ అధ్యయనంలో మెడికల్ డేటా సైన్స్, ల్యాబొరేటరీ డేటా సైన్స్, ఫీల్డ్ సైన్స్ అనే మూడు విభాగాలు ఉంటాయి.

- **మెడికల్ డేటా సైన్స్:** ఇందులో ఫోరెన్సిక్ పాథాలజీ, సైకియాట్రీ, సైకాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, ఆంటాలజీ అంశాలు ఉంటాయి.
- **ల్యాబొరేటరీ డేటా సైన్స్:** ఇందులో కెమిస్ట్రీ, బయాలజీ, టాక్సికాలజీ, బాలిస్టిక్స్, ఫింగర్‌ప్రింట్స్, సస్పెక్టెడ్ డాక్యుమెంట్స్, మార్క్స్, ఇంప్రెషన్స్ అంశాలు ఉంటాయి.
- **ఫీల్డ్ సైన్స్:** ఇందులో క్రైమ్ సీన్ ఇన్వెస్టిగేషన్; అగ్ని ప్రమాదాలు, పేలుళ్లు, సీక్రెట్ డ్రగ్ ల్యాబొరేటరీలపై విచారణ వంటివి ఉంటాయి.

ప్రోగ్రామ్‌ల వివరాలు: బీఎస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లో సైంటిఫిక్ అప్లికేషన్స్, బ్లడ్ స్టెయిన్స్-సాయిల్-బోన్స్-ఫింగర్ ప్రింట్స్, మొబైల్/ల్యాప్‌టాప్/కంప్యూటర్ డేటా రికవరీ, డీఎన్ఏ ప్రొఫైలింగ్, సివిల్ కేసెస్, ఇల్లీగల్ యాక్టివిటీస్ తదితరాలకు సంబంధించిన సబ్జెక్టులు ఉంటాయి.

- ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లో నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. ప్రోగ్రామ్‌లో భాగంగా క్రైమ్ ఇన్వెస్టిగేషన్స్, క్రైమ్ లోకేషన్‌లో దొరికిన వస్తువుల ఆధారంగా అనుమానితుల ఐడెంటిఫికేషన్, ఫోరెన్సిక్ సైన్స్ ప్రిన్సిపల్స్, పోలీసింగ్, క్రిమినల్ ఇన్వెస్టిగేషన్, ఫోరెన్సిక్ సైన్స్ టెక్నిక్స్, ఫొటోగ్రఫీ టెక్నిక్స్, విభిన్న పరిస్థితుల్లో జరిగిన నేరాలపై విశ్లేషణ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.

అర్హత వివరాలు: బీఎస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్ కెమిస్ట్రీ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం 50 శాతం మార్కులు తప్పనిసరి.

- ఎమ్మెస్సీ(ఫోరెన్సిక్ సైన్స్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ద్వితీయ శ్రేణి మార్కులతో బీఎస్సీ(ఫోరెన్సిక్ సైన్స్/సంబంధిత సబ్జెక్టులు) ఉత్తీర్ణులై ఉండాలి.

ఏఐఎఫ్ఎస్ఈటీ వివరాలు: దీనిని ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. మొబైల్, ల్యాప్‌టాప్, డెస్క్‌టాప్ ద్వారా హాజరు కావచ్చు. ఈ ఎగ్జామ్‌లో 100 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. పరీక్ష సమయం గంట. నెగెటివ్ మార్కులు లేవు. బీఎస్సీ, ఎమ్మెస్సీ ప్రోగ్రామ్‌లకు నిర్దేశించిన టెస్ట్ సిలబస్ కోసం వెబ్‌సైట్ చూడవచ్చు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. అభ్యర్థులు ఈ ఎగ్జామ్‌ను ఒక్కో ప్రోగ్రామ్‌నకు గరిష్ఠంగా మూడుసార్లు రాయవచ్చు.

ఉద్యోగావకాశాలు: ఈ ప్రోగ్రామ్‌లు పూర్తిచేసిన అభ్యర్థులకు డైరెక్టరేట్ ఆఫ్ ఫోరెన్సిక్ సైన్స్ సర్వీసెస్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్, ఇంటెలిజెన్స్ బ్యూరో, బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్, ఐఎఫ్‌ఓ ఫోరెన్సిక్ స్టాండర్డ్స్ అండ్ రీసెర్చ్ ప్రైవేట్ లిమిటెడ్, సెంట్రల్ గవర్నమెంట్ ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లలో ఉద్యోగావకాశాలు లభిస్తాయి. ఫోరెన్సిక్ ల్యాబ్‌లు, క్రైమ్ బ్రాంచ్‌లు, నార్కోటిక్ డిపార్ట్‌మెంట్, హాస్పిటల్స్, ప్రైవేట్ డిటెక్టివ్ ఏజెన్సీస్, లీగల్ సంస్థలు, పోలీస్ డిపార్ట్‌మెంట్, క్వాలిటీ కంట్రోల్ బ్యూరో, బ్యాంకులు, డిఫెన్స్/ఆర్మీ సంస్థల్లో ఫోరెన్సిక్ ఎక్స్‌పర్ట్‌లుగా రాణించవచ్చు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 26
- **ఏఐఎఫ్ఎస్ఈటీ 2025 తేదీ:** అక్టోబరు 27
- **ఎంట్రెన్స్ టెస్ట్ ఫలితాలు విడుదల:** అక్టోబరు 30
- **వెబ్‌సైట్:** aifset.com

ఐఐటీ హెచ్‌లో పీహెచ్‌డీ

సంగారెడ్డి-కంది‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్(ఐఐటీహెచ్)- పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. రెగ్యులర్, డైరెక్ట్ విధానాల్లో అడ్మిషన్స్ ఇస్తారు. రెగ్యులర్ ప్రోగ్రామ్‌లో విభాగానికి నిర్దేశించిన మేరకు అకడమిక్ మెరిట్, రిటెన్ టెస్ట్, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. డైరెక్ట్ ప్రోగ్రామ్ వ్యవధి అయిదేళ్లు. మొదటి రెండేళ్లు జేఆర్ఎఫ్ కింద రూ.50,000; చివరి మూడేళ్లు ఎస్ఆర్ఎఫ్ కింద రూ.55,000 అందిస్తారు.

విభాగాలు: ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, బయోమెడికల్ ఇంజనీరింగ్, బయోటెక్నాలజీ, కెమిస్ట్రీ, సివిల్ ఇంజనీరింగ్, డిజైన్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, మెటీరియల్స్ సైన్స్ అండ్ మెటలర్జికల్ ఇంజనీరింగ్, మేథమెటిక్స్, ఫిజిక్స్

అర్హత: డైరెక్ట్ పీహెచ్‌డీలో ప్రవేశానికి ఐఐటీలు/నిట్ సంస్థలు/ఐఐఎస్సీ/ఐసర్ సంస్థల నుంచి కనీసం 9 సీజీపీఏతో బీఈ/బీటెక్/బీ డిజైన్/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులై ఉండాలి. గేట్ అర్హత తప్పనిసరి కాదు.

- రెగ్యులర్ పీహెచ్‌డీలో ప్రవేశానికి సంబంధిత విభాగంలో ఎంఈ/ఎంటెక్/ఎంఎస్/ఎంసీఏ/ఎమ్మెస్సీ ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. గేట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి. పూర్తి సమాచారం కోసం వెబ్‌సైట్ చూడవచ్చు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబరు 19
- **వెబ్‌సైట్:** www.iith.ac.in/phdadmissions/

6జీ టెక్నాలజీ భారత్ సంసిద్ధత

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే



కొన్ని ఆవిష్కరణలు ప్రపంచ గతినే మార్చివేస్తాయి. అలాంటి ఆవిష్కరణలుగా నిప్పు, చక్రం, ఆవిరి యంత్రాలు, కరెంటు, కంప్యూటర్లు, ఇంటర్నెట్ వంటి వాటిని పేర్కొనవచ్చు. అయితే ఈ ఆవిష్కరణలు పనిలో మానవ ప్రమేయాన్ని తగ్గిస్తూ వచ్చాయి. కానీ మరో అయిదారేళ్లలో అందుబాటులోకి రాబోతున్న 6జీ టెక్నాలజీ పనిలో మానవ ప్రమేయాన్ని ఆసాంతం తగ్గించనుంది. ప్రస్తుత 5జీ టెక్నాలజీ మానవ-రోబో సమన్వయంతో పనులు చక్కబెట్టడానికి వీలుకల్పిస్తుండగా, రాబోతున్న 6జీ టెక్నాలజీ కృత్రిమ మేధకు మరింత వేగాన్ని అందించి అనేక రంగాల్లో మానవ ప్రమేయాన్ని దాదాపు శూన్యం చేయనుంది. ఉదాహరణకు స్వయంచోదక వాహనాలు(డ్రైవర్‌లెస్ కార్లు)ను చెప్పుకోవచ్చు.

- ఈ అధునాతన 6జీ సాంకేతికతను అందిపుచ్చుకుని అందరికన్నా ముందుగా ప్రపంచ విపణిలో మార్కెట్ అవకాశాలను కొల్లగొట్టడానికి ప్రపంచ దేశాలు పోటీ పడుతున్నాయి. ఈ తరుణంలో భారత్ కూడా రంగంలోకి దిగింది. 2030 నాటికల్లా 6జీ టెక్నాలజీని ప్రవేశపెట్టడానికి గల సాధ్యాసాధ్యాల పరిశీలన, సూచనల నిమిత్తం ఎ.కె.తివారీ అధ్యక్షతన ఒక టాస్క్‌ఫోర్స్ కమిటీని ఏర్పాటు చేసింది.
- తదనంతరం '6 మూలస్తంభాల వ్యూహంతో 6జీ విజన్'ను తదుపరి '6జీ మిషన్'ను భారత టెలీ కమ్యూనికేషన్స్ శాఖ ప్రవేశపెట్టడమే కాక అంతర్జాతీయ పరస్పర సహకారం నిమిత్తం భారత్ 6జీ అలయెన్స్(బీ6జీఏ)ను కూడా ఏర్పాటు చేసింది. ఈవిధమైన కార్యాచరణల నేపథ్యంలో అసలు 6జీ టెక్నాలజీ అంటే ఏమిటి? ప్రస్తుత తరం 5జీ టెక్నాలజీతో పోల్చిన ఏవిధంగా మెరుగైనది? 6జీ సాంకేతికత కోసం జాతీయంగా అంతర్జాతీయంగా జరుగుతున్న ప్రయత్నాలేమిటి? అన్న కోణంలో పరిశీలన జరపాల్సి ఉంది.

6జీ అంటే?

- వైర్‌లెస్ టెలీ కమ్యూనికేషన్ టెక్నాలజీని దాని పరిణామక్రమం ఆధారంగా వివిధ జనరేషన్లుగా విభజించి పేర్కొంటారు. ఈవిధంగా ఇప్పటివరకూ 1 నుంచి 5 తరాలు అందుబాటులోకి రాగా, మరింత అభివృద్ధి చెందిన తరంగా రాబోతున్న తదుపరి తరాన్ని 6వ తరంగా పేర్కొంటున్నారు.

5జీతో పోల్చితే 6జీ ఏవిధంగా మెరుగైనది?

- వేగపరంగా 5జీ ఒక మిల్లీ సెకన్(1000 మైక్రో సెకన్లు)లో 20 గిగాబైట్ల డేటాను అందిస్తుంది. అదే 6జీ 1 మైక్రో సెకన్‌లో వెయ్యి గిగాబైట్ల(ఒక టెరాబైట్) డేటాను అందిస్తుంది. అంటే 6జీ సాంకేతికత వేగంలో 5జీ కన్నా వెయ్యిరెట్లు మెరుగైనది.
- అదేవిధంగా లేటెన్సీ అనగా నెట్‌వర్క్‌లోని ఒక పాయింట్ నుంచి మరో పాయింట్‌కు సమాచారం(డేటా) చేరడానికి పట్టే సమయం(జాప్యం)ను, 5జీతో పోల్చిన 6జీ విపరీతంగా తగ్గిస్తుంది. 5జీలో ఈ లేటెన్సీ 5 మిల్లీ సెకన్లు కాగా, 6జీతో 'అల్ట్రా లో లేటెన్సీ(అతి తక్కువ జాప్యం)' సాధ్యపడి ఒక మైక్రో సెకనుకు ఈ జాప్యం పరిమితం అవుతుందని అంచనా. ఇంతవరకూ ఉపయోగించని 'టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలను 6జీ సాంకేతికతలో వినియోగించనుండటంతో అల్ట్రాలో లేటెన్సీ సాధ్యం కానుంది. టెరా హెర్ట్జ్ పౌనఃపున్యాలు విద్యుదయస్కాంత వర్ణ పటంలో పరారుణ తరంగాలు, మైక్రోవేవ్ తరంగాల మధ్య ఉంటాయి. చాలా సూక్ష్మంగానూ, సున్నితంగానూ ఉండే ఈ తరంగాలు భారీస్థాయిలో డేటాను వేగంగా చేరవేయగలవు.
- 5జీ సాంకేతికత 'ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్'ను ప్రవేశపెట్టడానికి సహకరించి, మానవుల నుంచి యంత్రానికి కమ్యూనికేషన్‌ను సాధ్యం చేసింది. ఈ పునాదిపై మరింత విస్తృతీకరించిన 6జీ సాంకేతికత మెషీన్ టు మెషీన్ కమ్యూనికేషన్‌ను(యంత్రాల మధ్య సమాచార బదిలీ) సాధ్యపరిచింది. ఇది చాలా వేగంగా జరిగే కమ్యూనికేషన్ కావడంతో మానవ మెదళ్లు గ్రహించగలవు.

6జీ టెక్నాలజీ ద్వారా రానున్న మార్పులు

1. కమ్యూనికేషన్ల పరంగా: నెట్‌వర్క్ స్లైసింగ్ ప్రక్రియ ద్వారా విస్తృత నెట్‌వర్క్‌లను అతి చిన్న ప్రత్యేక నెట్‌వర్క్‌లుగా విభజించడం వల్ల వివిధ రకాల సమాచార రద్దీని ప్రాధాన్యతల ఆధారంగా విభజించి నిర్వహించడానికి అవకాశం ఉంది. అదేవిధంగా సమాచార ప్రసారంలో విస్తృతస్థాయిలో భద్రత లభిస్తుంది. ఎన్‌క్రిప్షన్, హోలో గ్రాఫిక్ కమ్యూనికేషన్, మెరుగైన కృత్రిమమేధ, ఎక్స్‌టెండెడ్ రియాలిటీల ద్వారా మరింత భద్రతతో పాటు స్పష్టత, నిజ సమయ సమాచార బదిలీ(రియల్ టైమ్ డేటా ట్రాన్స్‌ఫర్) సాధ్యమవుతాయి. మరింత వేగంగా ఫైల్ డౌన్ లోడింగ్, వెబ్‌సెర్ఫ్, వర్చువల్ రియాలిటీ, సమాచార మార్పిడి సాధ్యమవుతాయి.

2. రవాణారంగం: వేగం, లేటెన్సీల పరంగా, మెషీన్ టు మెషీన్ కమ్యూనికేషన్స్, కృత్రిమ మేధ, త్రీడీ సాంకేతికతలతో ఈ 6జీ టెక్నాలజీ తీసుకువచ్చే మార్పుల కారణంగా స్వయంచోదిత వాహనాలు (డ్రైవర్ లెస్ కార్లు), ఎయిర్ ట్రాఫిక్ నియంత్రణ; బుల్లెట్ ట్రైన్స్ వంటి రవాణారంగ అంశాల్లో విప్లవాత్మక మార్పులు రానున్నాయి.

3. స్మార్ట్ సిటీస్, గ్లోబల్ కనెక్టివిటీ: రియల్ టైమ్ మానిటరింగ్, గ్లోబల్ కనెక్టివిటీ(ప్రజలు, పరికరాలు, సిస్టమ్స్, వివిధ సంస్థల మధ్య నిరంతర అనుసంధానత) వల్ల ట్రాఫిక్ నుంచి, ఫ్రిజ్‌లో సరుకుల వరకూ అన్నిటి సమాచారం అప్రయత్నంగా బదిలీ అయిపోతున్నాయి. అనుసంధానతలు పెరగడం వల్ల పట్టణ-గ్రామ అంతరాలు తొలగిపోతాయి.

4. విద్య, పరిశోధన రంగాలు: విద్యార్థులకు విద్యారంగంలో ప్రపంచ వ్యాప్త అనుసంధానత ఏర్పడుతుంది. వర్చువల్ క్లాసెస్, టీచర్స్, క్లాస్‌మేట్స్‌తోపాటు సమాచార విశ్లేషణ రియల్ టైమ్ ఎక్స్‌పీరియన్స్(అనుభవ పూర్వక అధ్యయనం) సాధ్యమవుతాయి. ఆదేవిధంగా అన్ని రంగాల్లో సంక్లిష్ట అంశాలపరంగా కూడా పరిశోధనకు అవకాశం ఏర్పడుతుంది. పరిశోధనల్లో వేగం సాధ్యమవుతుంది.

5. ఆరోగ్యరంగం: టెలీ మెడిసిన్, కృత్రిమమేధ మద్దతుతో క్లిష్టమైన శస్త్రచికిత్సలు కూడా రోబోటిక్ పద్ధతిలో నిర్వహించడం, వ్యాధి నిర్ధారణ పరీక్షల్లో వేగం, వైద్యులతో అనుసంధానత మొదలైన సౌలభ్యాలు కలుగనున్నాయి.

6. వ్యవసాయ, వ్యాపార, ఆర్థిక రంగాలు: వ్యవసాయ, వ్యాపార రంగాల్లో డిమాండ్ - సప్లయ్ -ఉత్పత్తి నియంత్రణపరంగా తక్షణ సమాచార బదిలీ విస్తృతస్థాయిలో వివిధ వ్యవస్థల మధ్య జరిగి మార్కెట్లు విస్తరిస్తాయి. నష్టభయం తగ్గుతుంది. వేగవంతమైన కృత్రిమ మేధతో నిర్ణయాలు, విశ్లేషణ, ఆచరణపరమైన జాప్యాన్ని నివారించవచ్చు. ఇవి సమిష్టిగా ఆర్థికవ్యవస్థ పురోభివృద్ధికి దోహదం చేస్తాయి.

7. అంతరిక్ష రంగం, రక్షణ రంగం, విపత్తు నిర్వహణ: అంతరిక్ష ప్రయోగాల్లో రియల్ టైమ్ మానిటరింగ్ అండ్ కంట్రోల్ ద్వారా వాహక నౌకలు, రోబోలు వంటి వాటిని తక్షణం నియంత్రిస్తూ వైఫల్యాలను తగ్గించవచ్చు. అత్యధిక రిజల్యూషన్‌తో కూడిన చిత్రాలు ఖగోళ పరిస్థితుల, పదార్థాల విస్పష్ట అంచనాకు సహకరిస్తాయి. అదే విధంగా సుదూర ఖగోళ అన్వేషణ సాధ్యమై దూరాన ఉన్న నక్షత్రాలు, గ్రహాల సమాచారం లభ్యమవుతుంది. మెషీన్ టు మెషీన్ కమ్యూనికేషన్, వేగం వల్ల వివిధ రకాల భౌగోళిక పరిస్థితుల్లో, సరిహద్దుల్లో, యుద్ధ, విపత్తు పరిస్థితుల్లో ఎంతో ప్రయోజనకరం.

8. పర్యావరణం: ఆగ్‌మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ వల్ల ప్రయాణ అవసరాలు తగ్గి కార్బన్ ఫుట్‌ప్రింట్ తగ్గుతుంది. ఆదేవిధంగా స్మార్ట్ సిటీస్, స్మార్ట్ మీటర్స్ వంటి వాటివల్ల విద్యుత్, నీరు వృథా తగ్గి పర్యావరణానికి మేలు చేకూరుతుంది.

(మిగతా రేపటి దిక్సూచిలో..)


ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్

బాలికల్లో ఉన్నత విద్యను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'సంతూర్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 2024'కి దరఖాస్తులు కోరుతున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్నాటక, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలకు చెంది, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులైన 1,500 అర్హులైన బాలికలకు ఏటా రూ.24,000 స్కాలర్‌షిప్‌ని 'విప్రో కన్జ్యూమర్ కేర్ అండ్ విప్రో కేర్స్ అందజేస్తుంది'. అభ్యర్థులు పదో తరగతి వరకు స్థానిక ప్రభుత్వ పాఠశాలలో చదివి ఉండాలి. 2023-24 విద్యా సంవత్సరంలో ఏదైనా ప్రభుత్వ జూనియర్ కాలేజీ నుంచి ఇంటర్మీడియట్ ఉత్తీర్ణులై, తప్పనిసరిగా ఫుల్ టైం గ్రాడ్యుయేషన్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. అర్హులైన అభ్యర్థులు సెప్టెంబరు 25లోపు www.santoorscholarships.com వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. మరిన్ని పూర్తి వివరాలకు 7411654395/7411654394 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చు.

ఎస్‌బీఐఎఫ్ ఆశా స్కాలర్‌షిప్

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్(ఎస్‌బీఐఎఫ్)- ఆశా స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్ 2024ను ప్రకటించింది. పేద విద్యార్థులకు ఆర్థిక సహకారం అందిస్తూ వారు ఉన్నత విద్యలు అభ్యసించేలా ప్రోత్సహించేందుకు దీనిని ఉద్దేశించారు. ఇది వన్‌టైమ్ స్కాలర్‌షిప్ ప్రోగ్రామ్. ఆరోతరగతి నుంచి పీజీ వరకు చదివే అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకోవచ్చు. గత విద్యా సంవత్సరంలో కనీసం 75 శాతం మార్కులు సాధించి ఉండాలి. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రాధాన్యమిస్తారు. స్కాలర్‌షిప్‌ల సంఖ్యలో సగాన్ని మహిళలకు/విద్యార్థినులకు కేటాయించారు.



పాఠశాల విద్యార్థులకు

- ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఆరోతరగతి నుంచి పన్నెండోతరగతి చదువుతూ ఉండాలి. కుటుంబ వార్షికాదాయం మూడు లక్షలు మించకూడదు.
- ఎంపికైన విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు.

డిగ్రీ అభ్యర్థులకు

- ఐఐటీలు/నిట్ సంస్థలు/ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్ ఉన్న కళాశాలల్లో డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కుటుంబ వార్షికాదాయం ఆరు లక్షలకు మించకూడదు. మూడు లక్షలలోపు వార్షికాదాయం ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.
- నిట్ సంస్థలు, ఎన్ఐఆర్ఎఫ్ కళాశాలల్లో చదివేవారికి రూ.50,000ల స్కాలర్‌షిప్; ఐఐటీల్లో చదివేవారికి రూ.2,00,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు.

పీజీ అభ్యర్థులకు

- ఐఐఎం సంస్థలు/నిట్ సంస్థలు/ఎన్ఐఆర్ఎఫ్ కళాశాలల్లో పీజీ చేస్తూ ఉండాలి. కుటుంబ వార్షికాదాయం ఆరు లక్షలకు మించకూడదు. మూడు లక్షలలోపు వార్షికాదాయం ఉన్నవారికి ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది.
- నిట్ సంస్థలు, ఎన్ఐఆర్ఎఫ్ కళాశాలల్లో చదివేవారికి రూ.70,000ల స్కాలర్‌షిప్; ఐఐఎం సంస్థల్లో ఎంబీఏ/పీజీడీఎం చదివేవారికి రూ.7,50,000ల స్కాలర్‌షిప్ ఇస్తారు.

ఎంపిక: వచ్చిన దరఖాస్తులు పరిశీలించి అకడమిక్ మెరిట్, కుటుంబ వార్షికాదాయం ఆధారంగా అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేస్తారు. వీరికి పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. తరవాత డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు వారి బ్యాంక్ ఖాతాల్లో స్కాలర్‌షిప్ మొత్తాన్ని నేరుగా జమ చేస్తారు.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 1
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** గత విద్యా సంవత్సరానికి సంబంధించిన మార్కుల పత్రాలు; ఆధార్ కార్డ్; అడ్మిషన్ లెటర్, ఐడీ కార్డ్, బోనఫైడ్ సర్టిఫికెట్, ఫీజు రిసీట్, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు; అభ్యర్థి ఫొటో
- **వెబ్‌సైట్:** www.sbifashascholarship.org

ఎద్దు పాలు

ఒక రోజు అక్బర్ చక్రవర్తికి సరదాగా బీర్బల్ ను పరీక్షించాలి అనిపించింది, వెంటనే బీర్బల్‌ను పిలిపించి, నాకు చాలా తలనొప్పిగా ఉంది. వైద్యుని పిలిచి చూపిస్తే, దీనికి మందు తయారు చేయాలంటే ఎద్దు పాలు కావాలి అన్నాడు. నువ్వు వెళ్లి ఆ పాలు తెప్పించే పని చూడు లేకపోతే పరిణామాలు దారుణంగా ఉంటాయిఅని చెప్పాడు బీర్బల్ అది విని, మారు మాట్లాడకుండా అలాగే మహారాజా అని వెళ్లిపోయాడు. ఇంటికి వచ్చి, ఆందోళనగా ఉన్న బీర్బల్‌ను అతని భార్య విషయం ఏమిటని ఎందుకు ఆందోళనగా ఉన్నారని అడిగింది, మహారాజు పురమాయించిన పని సంగతి చెప్పాడు బీర్బల్. దీనికేనా ఇంత కంగారు? అని నవ్వేసింది బీర్బల్ భార్య. నేనో ఉపాయం చెబుతాను మీరు నేను చెప్పినట్టు చేస్తే, ఈ గండం గట్టెక్కవచ్చు అన్నది ఆమె .సరేనని ప్రశాంతంగా నిద్రపోయి, రెండు రోజుల తర్వాత అక్బరు కొలువుకు వెళ్లాడు బీర్బల్. ఏమైంది ఎద్దుపాల సంగతి? అని అడిగాడు అక్బరు. దానికి బీర్బల్ మహారాజా ఎద్దుపాల జాడ కనుక్కున్నాను. కానీ ఆ పాలు అమ్మే అతనికి నిన్న మగ పిల్లాడు పుట్టడం వల్ల ఆరోగ్యం బాగా లేదు. అతని ఆరోగ్యం బాగు పడగానే మీకు ఎద్దుపాలు తెచ్చి ఇవ్వగలడుఅని చెప్పాడు అది విన్న అక్బరు 'మగ వాడికి పిల్లలు పుట్టడం ఏమిటయ్యా బీర్బల్?నీ చమత్కారం కాకపోతే? అన్నాడు దానికి బీర్బల్ నవ్వి, 'మరి ఎద్దు పాలు ఇవ్వడం ఏమిటి మహారాజా మీ చమత్కారం కాకపోతే?' అన్నాడు, తన సవాలును తనకే తిప్పికొట్టిన బీర్బల్ తెలివిని మెచ్చుకోకుండా ఉండలేక పోయాడు అక్బరు చక్రవర్తి.




7 తేడాలను కనిపెట్టండి





సరైన నీడను గుర్తించండి



ఏవి ఎన్ని?



దారి కనుక్కోండి



డైలీ సుడోకు - 405

	7		1		
		3		7	4
8		6	5	2	
7		5			
1					

సుడోకు - 404 సమాధానం

8	4	5	7	3	6
7	2	6	8	1	9
3	1	9	5	4	2
9	5	2	1	6	3
4	7	8	2	9	5
6	3	1	4	8	7

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.